ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

కడప

కపిల్ చిట్స్ మీ వెంట ఆనందం మీ ఇంట
KAPIL GROUP కపిల్ చిట్స్ Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

fb.com/vaartha Digital


Published from Kadapa, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

7-12-2025 ఆదివారం సంపుటి: 31 సంచిక: 306 పేజీలు: 10+4 వెల: 8.00

# శాంతి భద్రతలపై రాజీలేదు

## అమరాతి నిర్మాణం ముందుగానే పూర్తి

### పాఠశాలల్లో పేరెంట్, టీచర్ మీట్ సక్సెస్: సీఎం చంద్రబాబు



**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఏపీ సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.లా అండ్ ఆర్డర్‌కు భంగం కలిగించే వారెవ్వరైనా సహించేది లేదన్నారు.మాజీ సీఎం జగన్ మాటల్లో దేవుడంటే కుడా లెక్కలేని తనం, చులకన భావం వ్యక్తం కావడం దుర్మార్గమన్నారు. రాజధానిలో సమస్యలన్నీ పరిష్కారమై అభివృద్ధి జరుగుతుంటే రాజకీయంగా కొందరు తట్టుకోలేక బాధపడుతున్నారని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్‌టీచర్ మీట్‌పైనా శనివారం ఇష్టాగోష్టి(చిట్‌చాట్) గా సీఎం చంద్రబాబు మాట్లాడారు. లోకేశ్ చిన్నతనంలో పేరెంట్ టీచర్ మీటింగ్‌కి బిజీగా ఉండటం వల్ల వెళ్లలేకపోయాననే ఫీలింగ్ ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రమంతటా నిన్న ఈ కార్యక్రమం ఘనంగా జరగటం చూసి లోకేశ్ విద్యార్థి దశను గుర్తు చేసుకున్నట్లు చెప్పారు. పవన్ కల్యాణ్, మంత్రులు, కూటమి నేతలంతా కార్యక్రమంలో అన్ని చోట్లా పాల్గొని విజయవంతం చేశారని తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాల వల్ల ఎన్నో మార్పులు తీసుకురాగలుగుతున్నామని వ్యాఖ్యానించారు. టీడీపీ ప్రభుత్వంలో జరిగిన హైదరాబాద్ అభివృద్ధి నేటి అక్కడ పాలకులు గుర్తిస్తున్నారని తెలిపారు. ఆనాడు వేసిన అభివృద్ధి బీజం ఫలితంగానే కోకాపేటలో ఎకరం భూమి రికార్డు స్థాయిలో ధర పలుకుతోందని చెప్పారు. ఏపీలో విధ్వంసాన్ని అధిగమించి వికాసం దిశలో అడుగులు వేస్తున్నామన్నారు.అమరావతి రాజధాని నిర్మాణం అనుకున్నదానికన్నా ముందే పూర్తవుతుందన్నారు.ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న వ్యాఖ్యలు హాస్యాస్పదంగాను ఉన్నాయన్నారు.జగన్ చేతగాని తనానికి నిదర్శమన్నారు, పరకామణి అంశంలో ఆయన దిగజారి మాట్లాడుతున్నారన్నారు.శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా జగన్ వ్యాఖ్యలు ఉన్నాయి. జగన్‌కు దేవుడన్నా ఆలయాల పవిత్రత అన్నా లెక్కలేదని చంద్రబాబు మండిపడ్డారు. బాబాయి హత్యనే సెటిల్ చేసుకుందాం అని చూసిన వ్యక్తి జగన్ అన్నారు. తిరుమల పరకామణి చోరీని కూడా సెటిల్ చేయాలని చూడటం ఘోరం అన్నారు. దొంగతనాన్ని కూడా తప్పు కాదు అని చెప్పే వాళ్లను ఏమనాలి? అని ప్రశ్నించారు. సెంటిమెంట్ విషయాల్లో కూడా సెటిల్‌మెంట్ అంటూ వ్యాఖ్యాలా? అని నిలదీశారు. నేరస్థులను వెనకేసుకొస్తాను అంటూ సమాజానికి ఏం చెప్తున్నారని ప్రశ్నించారు. భక్తులు, ప్రజలు అన్నీ గమనిస్తున్నారు, శ్రీవారి ఆలయంలో ప్రతి అంశంలోనూ భక్తుల సెంటిమెంట్ ముడిపడి ఉంటుందన్నారు. సున్నిత అంశాలను కూడా సెటిల్ చేశామని తేలిగ్గా మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు ఇచ్చిన కానుకలు, ముడుపులను కొట్టేసిన దొంగలతో సెటిల్‌మెంట్ ఏంటన్నారు. పరకామణి చోరీపై జగన్ వ్యాఖ్యలపై అన్ని వర్గాల్లో తీవ్ర ఆవేదన కనిపిస్తోందని విమర్శించారు. ప్రాంతాలు, >>2



# సంక్షోభంలోనే ఇండిగో

### 48 గంటల్లోగా ప్రయాణికులకు రిఫండ్ చేయాలని ఆదేశాలు

### తాజా పరిస్థితిపై అత్యవసర సమీక్ష జరిపిన ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** దేశవ్యాప్తంగా సర్వీసులను నిలిపివేసి ప్రయాణీకుల తీవ్ర ఆగ్రహానికి కారణమైన ఇండిగో సంస్థపై చర్యలకు కేంద్రం ఉపక్రమించింది. ప్రధాని నరేంద్రమోడీ స్వయంగా జోక్యంచేసుకుని సంబంధిత మంత్రిత్వశాఖలు, అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఇప్పటికే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్‌నాయుడిని పిలిపించుకుని మొత్తం సమీక్షచేసారు. అదేవిధంగా ప్రధాని మోడీకి కూడా ఇండిగో అధికారులతోపాటు డిజిసిఎ, పౌరవిమానయాన మంత్రిత్వశాఖ మంత్రితోపాటు ఉన్నతాధికారులు మొత్తం పరిస్థితిని వివరించారు. పిఎంఒ ఇండిగో సిఇఒ పీటర్ ఎల్బర్స్‌తో నేరుగా సంప్రదింపులు జరిపి సత్వరమే సర్వీసులు పునరుద్ధరిం >>2

# ఎకోటూరిజం అభివృద్ధికి చర్యలు



### గిరిజన ఉత్పత్తుల పెంపు, మార్కెటింగ్ అవసరం

### సినిమాలు, సీరియళ్ల షూటింగ్‌లను ప్రోత్సహించండి: డిసిఎం పవన్ కల్యాణ్

**విజయవాడ, డిసెంబరు6,ప్రభాతవార్తప్రతినిధి:** అడవిని నమ్ముకొని బతికే గిరిజనుల జీవన ప్రమాణాలు పెరిగేలా యంత్రాంగం పనిచేయాలని, వారి ఆదాయ మార్గాలు పెంచాలని ఉప ముఖ్యమంత్రి(పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ)పవన్ కళ్యాణ్ అన్నారు. అందుకు తగినట్లుగా ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించాలని అధికారులకు స్పష్టం చేశారు. అటవీ ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్, ఎకో టూరిజం, పర్యాటకం పెంపు వంటి కీలకమైన అంశాలను ప్రాతిపదికగా తీసుకొని గిరిజనయువతలో నిరుద్యోగ సమస్య లేకుండా చేయాలన్నారు. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్‌లతో ఉప ముఖ్యమంత్రి మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతంచిత్తూరు కలెక్టర్‌గా సేవలందిస్తున్న సుమిత్ కుమార్, గతంలో అల్లూరి సీతారామ రాజు జిల్లా ఎస్పీగా పనిచేసి >>2

# విశాఖ వన్డేలో భారత్ ఘన విజయం

### సౌతాఫ్రికాపై తొమ్మిది వికెట్ల తేడాతో గెలుపు

### వన్డే సిరీస్ కైవసం చేసుకొన్న టీమిండియా



**విశాఖపట్టణం, డిసెంబరు 6:** టెస్టు సిరీస్‌లో వైట్‌వాష్‌కు భారత జట్టు ప్రతీకారం తీర్చుకుంది. మూడో వన్డేలో దక్షిణాఫ్రికాను చిత్తుగా ఓడించి 2-1తో సిరీస్ కైవసంచేసుకుంది. విశాఖ గడ్డపై ఓపెనర్ యశస్వీ జైస్వాల్(116 నాటౌట్) అజేయ శతకంతో కదంతొక్కాడు. రోహిత్ శర్మ(75), విరాట్ కోహ్లీ(65 నాటౌట్) మరో క్లాస్ ఇన్నింగ్స్‌తో చెలరేగారు. ప్రత్యర్థి నిర్దేశించిన 271 పరుగుల ఛేదనలో టాపార్డర్ దంచి కొట్టడంతో టీమిండియా 9 వికెట్లతో సఫారీలను మట్టికరిపించింది. ఛాంపియన్స్ ట్రోఫీ విజేత టీమిండియా స్వదేశంలో తొలి వన్డే సిరీస్ పట్టేసింది. టెస్ట్ సిరీస్‌లో దక్షిణాఫ్రికా చేతిలో క్లీన్‌స్వీప్ అయిన భారత జట్టు వన్డే సిరీస్‌లో తడాఖా చూపించింది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే వైజాగ్ వన్డేలో అత్యుత్తమ ఆటతో సఫారీలకు చెక్ పెట్టింది రాహుల్ సేన. ఈ ఫార్మాట్లో శతకంతో మెరిసిన యశస్వీ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. రెండు సెంచరీలు, ఒక ఫిఫ్టీ బాదిన కోహ్లీ ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్నాడు. రెండేళ్ల క్రితం వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్ తర్వాత తొలిసారి టాస్ గెలిచిన భారత్ బౌలింగ్ ఎంచుకుని ప్రత్యర్థిని 270కే కట్టడి చేసింది. ఛేదనలో ఓపెనర్లు యశస్వీ జైస్వాల్(116 నాటౌట్), రోహిత్ శర్మ(75) పవర్ ప్లేలో వికెట్ పడకుండా ఆడారు. యశస్వీ కాస్త ఆచితూచి ఆడగా రోహిత్ తనదైన పుల్‌షాట్లతో రెచ్చిపోయాడు. తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యంతో టీమిండియా ను గెలుపు దిశగా నడిపింది. 61వ హాఫ్ సెంచరీ తర్వాత శతకానికి చేరు వైన హిట్ మ్యాన్‌ను మహరాజ్ వెనక్కి పంపాడు. తొలి వికెట్ పార్ట్‌నర్‌షిప్ 155 పరుగులకు తెరపడింది. పవర్‌ప్లే తర్వాత దంచేసిన రోహిత్ ఔట య్యేసరికి భారత్ స్కోర్ 155. అప్పటికి మ్యాచ్ టీమిండియా చేతుల్లోనే ఉంది. అనంతరం క్రీజులోకి వచ్చిన రన్‌మెషీన్ విరాట్ కోహ్లీ(65 నాటౌట్) తనదైన స్టయిల్లో చెలరేగాడు.యాన్సెన్ ఓవర్లో బౌండరీతో తన విధ్వంసానికి తెర తీసిన విరాట్ సఫారీలకు చుక్కలు చూపిస్తూ 34 ఓవర్లో 4, 6 బాదాడు. కాసేపటికే సింగిల్‌తో యశస్వీ వన్డేల్లో తొలి సెంచరీ సంబురాలు చేసుకున్నాడు. ఆ తర్వాత గేర్ మార్చిన కోహ్లీ ఫోర్లతో హోరెత్తించాడు. పవర్ ప్లేలో కట్టుదిట్టంగా బౌలింగ్ చేసిన బార్ట్‌మన్‌ను టార్గెట్ చేసిన రన్ మెషీన్ అతడి ఓవర్లో బౌండరీతో 76వ అర్ధశతకం సాధించాడు. ఆ తర్వాత బంతిని సిక్సర్‌గా మలిచిన అతడు లుంగీఎంగిడి వేసిన 40వ ఓవర్లో మూడు ఫోర్లతో మ్యాచ్‌ను ముగించాడు.విరాట్,యశస్వీ అజేయంగా నిలవగా 9వికెట్లతో సఫారీలను ఓడించిన టీమిండియా2-1తో సిరీస్‌ను సొంతం చేసుకుంది.



శనివారం రూఫ్ టాప్ సోలార్ సిస్టంపై మాట్లాడుతున్న కె విజయానంద్

# రూఫ్ టాప్ సోలార్ పనులు వేగవంతం

### భూసేకరణ త్వరగా పూర్తవ్వాలి

### బిసిల కోసం 21 లక్షల సోలార్ సిస్టమ్స్

### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

**అనంతపురం కలెక్టరేట్, డిసెంబరు 6 ప్రభాతవార్త:** ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ గృహ వినియోగదారులకు రూఫ్ టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. అనంతపురంలోని కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శనివారం పీఎం కుసుమ్, పీఎం సూర్యఘర్ పథకం మరియు అన్ని ఎన్‌ఆర్‌ఈడిసిఏపి ప్రాజెక్టులు, వివిధ పథకాలపై ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్, అనంతపురం జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ, నెడ్ క్యాప్ మేనేజింగ్ డైరెక్టర్ కమలాకర్ బాబు, ఎపిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ పి.అయూబ్ ఖాన్ తదితరులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కె.విజయానంద్ మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో 7.48లక్షల ఎస్సీ,ఎస్టీ గృహ విద్యుత్ వినియోగదారులకు వచ్చే ఏడాది మార్చిలోగా ఫీజిబిలిటీ ఉన్న గృహాలపై రెండు కిలోవాట్ల చొప్పున మొత్తం 415 మెగావాట్ల సామర్థ్యంతో రూఫ్‌టాప్ సోలార్ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. సోలార్ ప్యానల్స్ ను అమర్చిన వెంటనే ఎటువంటి జాప్యం లేకుండా నెట్ మీటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో పీఎంకుసుమ్ పథకం కింద 610 మెగావాట్ల సామర్థ్యంతో 1.36 లక్షల వ్యవసాయ పంపు సెట్లకు సోలార్ విద్యుత్ పనులను పూర్తి చేయాలన్నారు. ఫీడర్ సోలరైజేషన్ పథకం కింద అనంతపురం సర్కిల్ పరిధిలోని 20 ప్రాంతాల్లో 498 ఎకరాల ప్రాంగణంలో 111 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ ప్లాంట్ ల ఏర్పాటుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని అనంతపురం జిల్లా అధికారులను ఆదేశించారు. అదేవిధంగా పీఎం సూర్యఘర్ పథకం కింద అనంతపురం జిల్లాలో 35.7 మెగావాట్ల సామర్థ్యంతో 17,870 గృహాలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్ ను ఏర్పాటు చేయాలని, ఈ పనులను వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 21 లక్షల బీసీ గృహాలకు రూఫ్ టాప్ సోలార్ సిస్టమ్స్‌ను అమర్చనున్నట్లు తెలిపారు. **డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి :**డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని అనంతపురం జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సమీక్షా సమావేశం ప్రారంభానికి ముందు కే. విజయానంద్ బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

# 12 ఎంపిపి సీట్లకు 11న ఎన్నికలు

### నోటిఫికేషన్ జారీ

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో 12 మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ),రెండు ఉపాధ్యక్షులు,ఆరు కో-ఆప్షన్ సభ్యులు,మరో 6 ఉప సర్పంచి స్థానాలకు ఈనెల 11న ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్ని వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీ చేశారు. అవిశ్వాస తీర్మానాలు,ఆకస్మిక మరణం,రాజీనామా చేసిన కారణంగా ఏర్పడిన ఖాళీలను భర్తీ చేసే క్రమంలో ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇచ్చింది. కలిలేశ్వరపురం(అంబేద్కర్ కోనసీమ జిల్లా),విస్సన్నపేట(ఎన్టీఆర్), ముద్దనూరు(వైఎస్సార్ కడప) పెంటపాడు(పశ్చిమ గోదావరి),యలమంచిలి (అనకాపల్లి), మాచవరం(పల్నాడు),తంబళ్ళపల్లె(అన్నమయ్య), విజయపురం,నింద్ర(చిత్తూరు), ఏర్పేడు, వరదాయపాలెం(తిరుపతి),రామగిరి(సత్యసాయి) ఎంపీపీ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి.ఇందుకు సంబంధించి ఈ నెల 7లోగా ఎంపీటీసీ సభ్యులకు సమాచారం అందించి 11న ఉదయం 11గంటలకు ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లుచేయాలని కలెక్టర్లను ఎన్నికల కమిషనర్ ఆదేశించారు. >>2

# ఘోర ప్రమాదం రెండు కార్లు ఢీ

### విజయనగరం జిల్లాకు చెందిన నలుగురు అయ్యప్ప భక్తుల దుర్మరణం

### రామేశ్వరం నుంచి వస్తుండగా తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో దుర్ఘటన



రోడ్డు ప్రమాదంలో మృతుల ఫైల్ ఫొటోలు

**దత్తిరాజేరు (విజయనగరం జిల్లా), డిసెంబరు 6 ప్రభాతవార్త :** తమిళనాడులోని రామనాథపురం జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు కార్లు ఢీకొన్న సంఘటనలో విజయనగరం జిల్లాకు చెందిన అయ్యప్ప భక్తులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘోర రోడ్డు ప్రమాదం ఐదు కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమిళనాడు రామనాథపురం జిల్లా సమీపంలో వీరు ప్రయాణిస్తున్న కారును మరో కారు బలంగా ఢీకొట్టింది. వివరాల్లోకి వెళ్తే ఏపీకి చెందిన అయ్యప్ప భక్తులు రామేశ్వరం దర్శించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. రామనాథపురం >>2

## 'జమిలి'కి రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు..

2లో






శనివారం న్యూఢిల్లీలో నేషనల్ కమ్యూనికేషన్స్ అకాడెమీ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

# సంక్షోభంలోనే ఇండిగో

>> చాలని ప్రధాని ఆదేశించినట్లు తెలిపింది. ఇప్పటికే ఇండిగో సిఇఒ ఎల్బర్స్ ప్రభుత్వానికి పదిరోజులు గడువు కోరారు. కార్యలాపాలన్నీ సాధారణ స్థితికి తెస్తామని హామీ ఇచ్చారు. నిర్వహణ సవాళ్లతోపాటు, సిబ్బంది కొరత, ఫ్లైట్‌డ్యూటీ టైమింగ్స్ వంటి ఆంక్షలవల్లనే ఈపరిస్థితి ఎదురయిందని చెప్పిన సిఇఒ పదిరోజుల్లోనే పరిస్థితులు మొత్తం పునరుద్ధరిస్తామని తెలిపారు. ఇండిగోకు ప్రస్తుతం ఎదురయిన సమస్యలతో స్టాక్ మార్కెట్లలోకూడా షేర్లు ఒక్కుదుటున కుదుపునకు లోనయ్యాయి. మరోవైపు డిజిసిఎ కూడా తమ ఎఫ్‌డిటిఎల్ నిబంధనలను సడలించింది. ఫిబ్రవరి పదవ తేదీవరకూ సడలింపులు అమలులో ఉంటాయనిప్రకటించింది. అంతేకాకుండా ఈ పరిస్థితిపై ఉన్నతస్థాయి దర్యాప్తునకు ఆదేశించింది. కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా టికెట్ల రేట్లను విపరీతంగాపెంచడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసారు. తక్షణమే సవరించుకోకపోతే కఠిన చర్యలు తప్పవని కూడా మంత్రి హెచ్చరికలు జారీచేసారు. విమానయానరంగ చరిత్రలో ఎన్నడూలేనంతగా సంక్షోభానికి తెరలేపిన ఇండిగో సిఇఒపై చర్యలు తీసుకునేందుకు కేంద్రం యోచిస్తోంది. ఒక్క ఇండిగోకే ఈపరిస్థితి ఎందుకు వచ్చిందని, అందులోనూ దేశీయ సర్వీసుల్లో మాత్రమే ఈసమస్యలు రావడంపై కేంద్రం తీవ్ర ఆగ్రహంతో ఉంది.

**టికెట్లకు పరిమితులు విధించిన కేంద్రం:** ఇండిగోపరిస్థితితో రెక్కలు విచ్చుకున్న టికెట్లకు పరిమితులు విధించింది. 500 కిలోమీటర్లవరకూ రూ.7500, 500 నుంచి 1000 కిలోమీటర్లవరకూ 12 వేలు, 1000 నుంచి 1500 కిలోమీటర్లవరకూ రూ.15వేలు, 1500 కిలోమీటర్లు దాటితో రూ.18వేల రూపాయలకు మించకూడదని కేంద్ర పౌరవిమానయాన శాఖ ప్రకటించింది. ఫైలట్ అంతరాయాల వేళల్లో అసాధారణ ఛార్జీలపెంపును తీవ్రంగా పరిగణించింది. అవకాశవాద తీరును ఎట్టిపరిస్థితుల్లోను ఉపేక్షించేదిలేదని, మంత్రిత్వశాఖ నియంత్రణ అధికారాలు ప్రయోగిస్తుందని కూడా స్పష్టంచేసింది. ప్రస్తుతం కొత్తగా నిర్దేశించిన ధరలను విధిగా పాటించాలని, సీనియర్ సిటిజన్లు, విద్యార్థులు, వైద్యసహాయం అందాల్సిన ప్రయాణీకులు సీట్లు దొరక్క ఇబ్బందిపడుతున్నారు. ఈపరిస్థితుల్లో ధరలపై నియంత్రణతో దోపిడీని నిరోధించాల్సిన అవసరం ఉందని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆర్సీఎస్, ఉడాన్, బిజినెస్‌క్లాస్‌లకు ఈ ఛారఙ్జులు వర్తించవని కేంద్రం తెలిపింది. తదుపరి సమీక్షలవరకూ ఈ ధరలే అమలులో ఉంటాయని తెలిపింది.

**48 గంటల్లోపు రీఫండ్‌లు పూర్తిచేయాలి:** అలాగే సుమారు 1000కిపైగా విమాన సర్వీసులు రద్దుకావడంతో ప్రయాణీకులకు రీఫండ్ వెంటనే పూర్తిచేయాలని, 48 గంటల్లోపు పూర్తిచేసి తమకు నివేదిక ఇవ్వాలని పౌరవిమాన యానశాఖ ఆదేశించింది. ఆదివారం రాత్రి 8 గంటలకల్లాపూర్తిచేయాలని స్పష్టంచేసింది. ప్రయాణీకులపై రీషెడ్యూలింగ్ ఛార్జీలు విధించకూడదని స్పష్టంచేసింది. దూరం అయిన ప్రయాణీకుల లగేజిలను కూడా 48 గంటల్లో వారి చిరునామాలకు అందచేయాలనిసూచించింది. ఈ రీఫండ్‌ప్రక్రియలో జాప్యంచేసినా, ఆదేశాలను బేఖాతరుచేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది. వెయ్యివిమాన సర్వీసులవరకూ రద్దయిన ఇండిగో సేవలు శనివారం 850కి దిగివచ్చాయి. రానున్న కాలంలో మరింతగా తగ్గిస్తామని, సిబ్బంది కొరత,ఫైలట్లతో సంప్రదింపులు జరిపి చక్కదిద్దుతున్నట్లు ఎయిర్‌లైన్స్ సిఇఒ ఎల్బర్స్ వెల్లడించారు. ఇదిలా ఉంటే ఇండిగో సంక్షోభం పరిష్కరించేందుకు రైల్వేశాఖ రంగంలోకి దిగింది. కొన్ని రైళ్లకు అదనపు బోగీలను జోడించడం, ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు ప్రకటించింది. సుమారుగా 110 బోగీలు అదనంగా చేరుస్తున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది.

# 11న ఎన్నికలు

>> తగిన కోరం లేకపోవడం,ఇతర కారణాలతో ఎన్నికలు నిర్వహిం చలేనప్పుడు మరుసటి రోజు 12న చేపట్టాలని సూచించారు. అనకాపల్లి జిల్లా మునగపాక,అన్నమయ్య జిల్లా వైపీపల్లి ఉప సర్పంచి స్థానాలకు ఇది వరకు రెండుసార్లు నిర్వహించిన ఎన్నికలు వాయిదా పడినందున,ఈ సారి ముగ్గురు సభ్యులు హాజరైన ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్లను ఎన్నికల కమిషన్ ఆదేశించారు.

# ఎకోటూరిజం అభివృద్ధికి చర్యలు

>> ప్రస్తుతం శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీగా పని చేస్తున్న సతీష్ కుమార్‌లు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా అటవీ ప్రాంతంలో గంజాయి నిర్మూలన అంశంపైనా చర్చించారు. ఈ సందర్భంగా డి.సిఎం పవన్ మాట్లాడుతూ "ప్రపంచం వేగంగా ముందుకు వెళుతోందని, దేశంలోనూ గణనీయమైన మార్పులు వస్తున్నాయని దీన్ని అందిపుచ్చుకోవాలన్నారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని వారి శక్తిని, శ్రమను ఉపయోగించుకొని వారి జీవన ప్రమాణాలను పెంచాలి. అటవీ ఉత్పత్తులు, ఆర్గానిక్ ప్రొడక్ట్స్ కి ఎంతో డిమాండ్ ఉంది. కాఫీ తోటలతోపాటు అడవిలో విరివిగా దొరికే ఉత్పత్తులను సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. **ఉద్యాన పంటలకు ఉపాధి పనులకు అనుసంధానం:** ఏజెన్సీ ప్రాంతంలో ఉద్యాన పంటలకు అనువుగా ఉంటుంది. దీన్ని ఉపాధి హామీతో అనుసంధానం చేయడం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయి. దీనిపై మరింత గా దృష్టి సారించి, వివిధ రకాల పనులకు ఉపాధి హామీ అనుసంధానం అయ్యేలా అధికారులు పరిశీలన చేయాలన్నార. సినిమాలు, సీరియళ్లతో పాటు ఓటీటీ కంటెంట్ లను ఏజెన్సీ ప్రాంతాల్లో షూట్ చేసుకునేలా ప్రొత్సహించాలి. దీని వల్ల గిరిజనులకు ఆదాయం పెరగడంతో పాటు యువతకు ఉపాధి లభిస్తుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి, వారి జీవన ప్రమాణాల పెంపునకు తీసుకుంటున్న చర్యలపై ఎప్పటికప్పుడు చర్చిద్దాం. నిరంతర అనుశీలన చేసి, నెలవారీ రిపోర్టులతో ముందుకు సాగుదామన్నారు. ఈ సమావేశంలో అధికారులు వారి ఆలోచనలను, ప్రణాళికలను ఉప ముఖ్యమంత్రి వద్ద చర్చించారు.

# హోమియో మందుల టెండర్ ధర 17శాతం తగ్గింపు

### ఈయేడాది కొనుగోలులో రూ.2.21 కోట్లు ఆదా..

### రెండు సార్లు టెండర్లు పిలిచినా ఒక్క కేరళ సంస్థే బిడ్ దాఖలు

### ధర విషయంలో అప్రమత్తంగా ఉండాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్



**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** దేశీయ వైద్యవిధానాల విభాగం ఆయుష్ పరిధిలో ప్రభుత్వం హోమియో ఆస్పత్రులను నిర్వహిస్తుంది. ఈ ఆస్పత్రుల్లో మందుల కొనుగోలుకు ప్రభుత్వం అనుమతించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 14 కోట్ల మేరకు హోమియో మందులు కొనడానికి ఆయుష్ విభాగం ప్రతిపాదించింది. రెండు సార్లు టెండర్లు పిలిచినా కేరళ ప్రభుత్వ సంస్థ ఒక్కటే స్పందించిందని, మందుల అవసరాల దృష్ట్యా కొనుగోలుకు అనుమతించాలని వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్‌ను ఆయుష్ విభాగం కోరింది. అనుమతిని మంజూరు చేస్తూ....ఒకటే బిడ్ వచ్చినందున కోట్ చేసిన ధర సరసమైనదా లేదా అని పరిశీలించి బిడ్‌ను ఆమోదించాలని మంత్రి ఆదేశించారు. మంత్రి ఉత్తర్వుల మేరకు సరఫరాదారునితో చర్చించి కోట్ చేసిన ధర కంటే 16.88 శాతానికి తక్కువతో ఆయుష్ విభాగం ధరను నిర్ణయించింది. దీనివల్ల మొత్తం కొనుగోలులో రూ. 2.21 కోట్లు ఆదా అవుతుంది.

**టెండర్ ప్రక్రియధరల నేపథ్యం:** రూ. 4 కోట్ల విలువ చేసే హోమియో మందుల కొనుగోలుకు ఆయుష్ విభాగం రెండు సార్లు టెండర్లు పిలవగా ప్రభుత్వరంగ సంస్థ ఖికేరళ హోమియోపతిక్ కోపరేటివ్ ఆర్గనైజేషన్ (బీవీలీదివీ)ఖి మాత్రమే స్పందించింది. రెండవసారి వచ్చిన టెండర్ ధర సమంజసంగా ఉందా లేదా అని పరిశీలించాలని ఆదేశిస్తూ కొనుగోలుకు మంత్రి ఆమోదం తెలిపారు.

ఫైనాన్షియల్ బిడ్ తెరచి చూసిన అధికారులు సింగిల్ బిడ్డర్ కోట్ చేసిన ధరపై విస్తృతంగా చర్చించారు. ఇదే కంపెనీ గతంలో కర్నాటకు, ఆంధ్రప్రదేశ్‌కు హోమియో మందులు సరఫరా చేసిన ధరను పరిశీలించారు. గత ప్రభుత్వ హయాంలో ఇదే కంపెనీ కర్నాటకు సరఫరా చేసిన ధర కంటే 13 శాతం అధిక ధరకు మన రాష్ట్రానికి సరఫరా చేసిందని గుర్తించారు.

సరఫరాదారునితో విస్తృత చర్చలు చేసిన అనంతరం కోట్ చేసిన ధర కంటే 16.88 శాతం తక్కువకు హోమియో మందుల సరఫరాకు అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఇది కర్నాటక ధర కంటే 6.04 శాతం తక్కువ. 202324 లో రాష్ట్రానికి సరఫరా చేసిర ధర కంటే కూడా 6 శాతం తక్కువ. వెరశి ఈ చర్యల ద్వారా రాష్ట్రానికి రూ. 2.21 కోట్లు ఆదా అవుతుందని ఆయుష్ అధికారులు వివరించారు.

సంవత్సరం పాటు అమలులో ఉండే ఈ కాంట్రాక్ట్ ధరతో రూ.14 కోట్ల విలువచేసే మందుల్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కొనుగోలు చేస్తారు

**మంత్రి అభినందనలు:** తన ఆదేశం మేరకు సరఫరాదారునితో చర్చలు జరిపి ఈ ఆర్థిక సంవత్సరంలో కొనుగోలు చేయనున్న హోమియో మందుల ధరలను భారీగా తగ్గించినందుకు ఆయుష్ విభాగం డైరెక్టర్ శ్రీ కొత్తమాసు దినేష్, ఇతర అధికారులను మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. రూ.14 కోట్ల విలువ చేసే 162 రకాల హోమియో మందుల్ని 207 హోమియో వైద్య శాలలకు, 3 బోధానాసుపత్రులకు ఆయుష్ విభాగం అందజేస్తుంది.

# 'జమిలి'కి రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు..

### జెపిసికి లాకమిషన్ నివేదిక

### రాజ్యాంగ నిబంధనల్లో మార్పురాదని స్పష్టీకరణ




**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** ఒక దేశం ఒకేసారి ఎన్నికలు( వన్‌నేషన్ వన్ ఎలక్షన్)లక్ష్యంతో దేశంలో జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు ప్రవేశపెడుతున్న బిల్లులకు రాష్ట్రాల శాసనసభల ఆమోదం అవసరం లేదని లా కమిషన్, సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ)కి తెలిపింది. ప్రతిపాదిత బిల్లులు రాజ్యాంగంలోని మౌలిక స్వరూపాన్ని మార్చేందుకు ఏమీ ప్రయత్నించడం లేదని పేర్కొంది. సమాఖ్య నిర్మాణానికి భంగకరమయ్యేలా రాజ్యాంగ నిబంధనల్నీ మార్చడం లేదని స్పష్టం చేసింది. ఈ బిల్లులకు సంబంధించి ఇప్పటికే పలు వర్గాలతో చర్చించిన జేపీసీ లా కమిషన్‌తో కూడా విస్తృత చర్చలు జరిపింది. మరో రెండు నెలల్లో మరింత మంది నిపుణులు, సంస్థలతో చర్చలు జరిపిన తర్వాత నివేదికను రూపొందించి వచ్చే బడ్జెట్ సమావేశాలలోపు సమర్పించనుంది. ఈ నివేదికను బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటులో ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి. కాగా, రాజ్యాంగంలోని 368వ అధికరణ కింద జమిలి ఎన్నికల నిర్వహణకు రాష్ట్రాల ఆమోదం అవసరం లేదని 23వ లా కమిషన్ చైర్మన్ జస్టిస్ దినేశ్ మహేశ్వరి జేపీసీ సభ్యులకు వివరించారు. ఈ రాజ్యాంగ సవరణకు కనీసం 50 శాతం అసెంబ్లీలు ఆమోదించాల్సిన అవసరమేదీ లేదన్నారు. జమిలి ఎన్నికల కోసం ప్రవేశపెట్టే ప్రతిపాదనలన్నీ రాజ్యాంగ పరిమితుల్లోనే ఉన్నాయని, లోక్‌సభ, శాసనసభల ఎన్నికల షెడ్యూలును ఒకే తేదీల్లో నిర్ణయించడం వల్ల ప్రజల ఓటు హక్కుకేమీ నష్టం వాటిల్లదన్నారు. లోక్‌సభ, శాసనసభల కాలపరిమితికి సంబంధించి ఆందోళన కూడా అవసరం లేదని జేపీసీ సభ్యులకు లా కమిషన్ తెలిపింది. రాష్ట్ర శాసనసభల ఎన్నికలకు సంబంధించి కూడా చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకే ఉందని తెలిపింది. అందువల్ల ఈ మేరకు బిల్లులు చేసే అధికారం పార్లమెంట్‌కే ఉంటుందని స్పష్టం చేసింది. 82ఏ(3), 82ఏ(5) క్లాజుల కింద ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలు కల్పించడంపై వచ్చిన సందేహాలను కమిషన్ నివృత్తి చేసింది. రాజ్యాంగంలోని 324 అధికరణ కింద ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు విస్తృత అధికారాలున్నాయని, ఇప్పటికే ఉన్న కమిషన్ అధికారాలను సంబంధిత క్లాజులు మరింత స్పష్టతనిస్తాయని వివరించింది. అయితే తమ ప్రశ్నలకు లా కమిషన్ సభ్యులు సంతృప్తికరమైన సమాధానాలు ఇవ్వలేకపోయారని ప్రతిపక్ష సభ్యుడొకరు అన్నారు. ఒకేసారి ఎన్నికలు జరిగితే ప్రజలు లోక్‌సభ ఎన్నికల్లో, అసెంబ్లీ ఎన్నికల్లో వేర్వేరుగా ఓటు వేసే అవకాశాలు ఉండకపోవచ్చునని, దీంతో ఓటు వేసిన తర్వాత సమీక్షించుకునే అవకాశం ఉండదని తాము చెప్పినట్లు తెలిపారు.

## ఇండిగో విమానాల రద్దు.. అందుబాటులో ప్రత్యేక రైళ్లు

**విజయవాడ, డిసెంబరు6:** దేశవ్యాప్తంగా ఇండిగో విమానాల రద్దు కొనసాగుతోంది. దీంతో ప్రయా ణీకులు ఇబ్బంది పడుతున్నారు. వారిని గమ్యస్థానాలకు చేర్చేందుకు భారతీయ రైల్వే ప్రత్యేక రైళ్ళు ఏర్పాటు చేసింది. సికింద్రాబాద్- చెన్నై, చర్లపల్లి-కోల్‌కతా, హైదరాబాద్-ముంబయికి దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్ళు నడుపుతోంది. వీటిలో బెర్తులు ఖాళీగా ఉన్నాయని అధికా రులు తెలిపారు. మరోవైపు 37 రైళ్ళకు 116 కోచ్‌లు అదనంగా జోడిం చాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఇప్పటికే కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్ళు,అదనపు భోగీలతో నడుస్తున్నాయి.

**ప్రయాణీకులకు రిఫండ్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం -కేంద్ర మంత్రి పెమ్మసాని**

ఇండిగో విమానాల రద్దుపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు స్పందించారని,ప్రయాణీకులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. పిల్లలు,వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బంది లేకుండా చూస్తామని చెప్పారు. విమానాల రద్దు కారణాలపై దర్యాప్తు చేస్తామన్నారు. భాధిత ప్రయాణీకులకు రిఫండ్ ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని వివరించారు.



మాజీ ప్రధాని దేవెగౌడ శనివారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్‌తో భేటీ దృశ్యం

# శాంతి భద్రతలపై రాజీలేదు

>> పార్టీలకు అతీతంగా జగన్ వ్యాఖ్యలను తప్పుపడుతున్నారని తెలిపారు. దేవుడి హుండీలో చోరీని సెటిల్ చేయటానికి జగన్ ఎవరని నిలదీశారు. గతంలో నెల్లూరు, విజయనగరం జిల్లాలు ఎంతో ప్రశాంతత ఉన్న జిల్లాలుగా ఉండేవని వైఎస్సార్సీపీ హయాంలో నెల్లూరులో కూడా చాప కింద నీరులా మాఫియాను విస్తరింపచేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేడీడాన్స్ తయారు కావటం చూసి నాకే ఆశ్చర్యం కలిగిందన్నారు. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. శాంతి భద్రతలు అన్నీ అదుపులో పెడుతున్నామని తెలిపారు. అధికారం చేపట్టిన నాటికీ ఇప్పటికీ చాలా మార్పు వచ్చిందన్నారు. మేము ప్రతి కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను,మంత్రులను భాగస్వాములను చేస్తున్నామన్నారు.వారి పరిధిలో సమస్యల పరిష్కారానికి తాము వారినే ప్రోత్సహిస్తున్నామన్నారు. పార్టీ కార్యాలయానికి మంత్రులు, ఎమ్మెల్యేల తాకిడి పెరగటంతో మరింత చురుగ్గా పని జరుగుతోందన్నారు. పార్టీ ఇచ్చిన కార్యక్రమాల్లో క్షేత్ర స్థాయిలో నేతలు చురుగ్గా పాల్గొంటూ ప్రజలకు మరింత అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. గ్రీవెన్స్, ఫించన్ల పంపిణీ, రైతన్నా మీకోసం, మెగా పేరంట్ టీచర్ మీటింగ్ వంటి కార్యక్రమాల్లో అందరూ పాల్గొన్నారన్నారని సీఎం చంద్రబాబు తెలిపారు. అత్యాధునిక విద్యను తీసుకొచ్చేందుకు ముందుకెళ్తున్నామని ఆ దిశగా టీచర్లలో నైపుణ్యాలు పెంపొందించేందుకు విదేశాల్లో శిక్షణ ఇస్తున్నామని సీఎం అన్నారు. దశలవారీగా టీచర్లందరికీ ప్రపంచస్థాయి విద్యపై శిక్షణ ఇస్తామని తెలిపారు. గతంలో ఉపాధ్యాయులను అనేక వేధింపులకు గురిచేశారని కాని కూటమి ప్రభుత్వం టీచర్లను గౌరవించడం ప్రథమ కర్తవ్యంగా పెట్టుకుందని వివరించారు. టీచర్లను గౌరవించడంతో పాటు పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గతంలో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేశారు ఇప్పుడు ఆ పరిస్థితిని చక్కదిద్దామని అన్నారు. కూటమి ప్రభుత్వం స్పష్టమైన విధానంతో ముందుకెళ్తోందని తెలిపారు.

కేంద్రంలో వికసిత్ భారత్ తీసుకొస్తే రాష్ట్రంలో స్వర్ణాంధ్ర నినాదంతో ముందుకెళ్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలిచ్చే స్థాయికి చేరతారని ఆశిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ముస్తాబు కార్యక్రమం చేపట్టడం అభినందనీయమని అలానే ఈ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా తీసుకొచ్చే ప్రయత్నం చేస్తామని వెల్లడించారు. పిల్లలు వినూత్న ఆలోచనలతో కొత్త ఆవిష్కరణలు రూపొందిస్తున్నారని సీఎం కొనియాడారు. ఈ ఏడాది జనవరిలో స్టూడెంట్ ఇన్నోవేషన్ సమిట్ నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే విద్యాశాఖలో 29 సంస్కరణలు తీసుకొచ్చామని రాబోయే రోజుల్లో మరిన్ని సంస్కరణలు తెస్తామని సీఎం అన్నారు.

# రైతుసేవా కేంద్రాల పునర్ వ్యవస్థీకరణ

### మార్కెట్ కమిటీల్లో మౌలిక సదుపాయాలకు బృహత్తరప్రణాళిక

### భూసారం పెంపుతో లాభసాటిగా సేంద్రీయ సాగు: సిఎం చంద్రబాబు

**విజయవాడ డిసెంబర్6, ప్రభాతవార్త ప్రతినిధి :** వ్యవసాయరంగం రాష్ట్రానికి పెద్ద ఆదాయ వనరు ఈ రంగంలో మరింతగా అభివృద్ధి చెందాలన్నారు,రైతులకు మార్కెటింగ్‌పై పూర్తి స్థాయి అవగాహన ఉండాలన్నారు. గిట్టుబాటు ధర,విపణి అవసరతలను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు జరగాలన్నారు.డిమాండ్‌ను అనుసరించి వ్యవసాయ ఉత్పత్తులు జరగాలన్నారు. ప్రజల ఆహారపు అలవాట్లు,అభిరుచులను గమనించి పంటల సాగు జరగాలన్నారు.చిరు ధాన్యాల ఉత్పత్తిపైన, ఉద్యాన పంటలపైన రైతులు దృష్టిపెట్టాలన్నారు.వ్యవసాయంలో ప్రత్యామ్న పంటలపైన రైతులకు అవగాహన అవసరమన్నారు. ఏ ఒక్క రైతు వ్యవసాయంలో నష్టపోయామనే మాట రాకూడదన్నారు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మోలిక సదుపాయాల కల్పనకు బృహత్తర ప్రణాళికను రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సీఎం సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగ పరిస్థితులు . ఖరీఫ్ సాగు, రబీ ప్రణాళిక, ధాన్యం కొనుగోళ్లు తదితర అంశాలపై సంబంధిత శాఖ అధికారులు తో చర్చించారు. వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న విధానాలు, ప్రయోజనాలపై అధికారులతో సమీక్షించారు.ఆయా అంశాలకు సంబంధించి అప్డేట్ సమాచారం పై నివేదికలను సమర్పించాలనిఆదేశించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో గ్రాస్ వాల్యూ అడిషన్ పై సీఎం దిశా నిర్దేశం చేశారు. వ్యవసాయ రంగంలో లాభం రావాలి... వినియోగదారునికి ప్రయోజనం కలగాలి. ఈ విషయంలో వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రైతు బజార్లను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలి. ఎందుకు ఉద్యాన పంటలకు గిట్టుబాటు ధర తగ్గింది. అటువంటి పరిస్థితుల్లో ఆ పంటను రైతు బజార్లకు తరలించి.. వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలి. కోల్డ్ చైన్ లాంటి వ్యవస్థలను ఉపయోగించుకుని ఉద్యాన పంటలకు ధర తగ్గకుండా చూసుకోవాలి. రైతు బజార్లను ఆధునీకరించాలి. అర్బన్ ప్రాంతాల్లో రైతు బజార్ల ఆధునికీకరణకు భూమి ఎంత వరకు అవసరమవుతుందో అంచనా వేయాలి. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు ఎందుకు ఉద్యాన బజార్లను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించండి. మార్కెట్ కమిటీలను, రైతు బజార్లను అనుసంధానం చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. దీని ద్వారా నిధుల సమీకరణ చేపట్టి వ్యవసాయ మోలిక సదుపాయాల కల్పన జరిగేలా చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ మార్కెట్ కమిటీల పరిధిలో ఖాళీగా ఉన్న స్థలాలను సద్వినియోగం చేసుకుంటూ కోల్డ్ చైన్, అగ్రి ప్రాసెసింగ్ వంటి మోలిక సదుపాయాలను కల్పించాలి." అని సీఎం ఆదేశించారు. దశలవారీగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి." అని సీఎం అన్నారు.రబీ సీజన్ కోసం 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని సమీక్షలో అధికారులు వివరించారు. ఇప్పటికే జిల్లాలకు 41 వేల మెట్రిక్ టన్నుల యూరియాను జిల్లాలకు సరఫరా చేశామని అధికారులు చెప్పారు. పోర్టుల్లో 79,527 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలున్నాయని వివరించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ రబీ సాగు కోసం భూసార పరీక్షలు చేసి ఆ డేటా ప్రకారం మైక్రో న్యూట్రియంట్స్ వేసుకునేలా రైతును ప్రోత్సహించండి. వచ్చే సీజన్‌కు భూసార పరీక్షలపై ఓ ప్రామాణిక విధానాన్ని రూపొందించండి. భూసార పరీక్షల రిపోర్టుల ఆధారంగా ఎకరాకు ఎంత ఎరువు వినియోగించాలో రైతులకు దిశా నిర్దేశం చేయాలి. రైతులు, కౌలు రైతులకు ఎంత యూరియా సరఫరా చేశారన్న అంశంపై రికార్డులు పక్కాగా ఉండాలి. ఈ ఏడాది 90.91 లక్షల మెట్రిక్ టన్నుల మేర పంట ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంది. 51 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యం. ఇది గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికం. టార్పాలిన్లు రైతులకు అందుబాటులో ఉంచాలి." అని చంద్రబాబు చెప్పారు.

**ధనధాన్య కృషీ యోజన కింద రైతులకు కలిగే లాభాలపై అధ్యయనం:** హెచ్డీ బర్లీ పొగాకును రైతులు తక్కువ ధరకే అమ్ముకోకుండా చూడాలి. ప్రభుత్వం కొనుగోలు చేసిన పొగాకుకు రైతులకు రూ.96 కోట్లు చెల్లింపు చేశాం. హెచ్డీ బర్లీ పొగాకు పంటకు మార్కెట్ ఉండేలా చూడాలి. దీని కోసం పంటను కూడా అవసరమైన మేరకు నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. నాలుగు జిల్లాల్లో పొగాకుకు క్రాప్ హాలిడే ప్రకటించండి. త్వరలో ప్రధాని ప్రారంభించబోయే ధనధాన్య కృషీ యోజన కింద ఏ పంటకు ఎక్కువ లాభం వస్తుందో చూసుకుని ఆ పంటలను ప్రోత్సహించాలి. పప్పు దినుసుల విషయంలో వందశాతం కొనుగోళ్లు చేస్తామని కేంద్రం చెబుతోంది. ఈ పథకంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేయాలి.. రైతులకు ఎంత వరకు లబ్ది చేకూరుతుందో చూడండి. గతంలో ఏపీ కంటే కర్ణాటకలో సెరీకల్చర్ సాగు తక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు కర్ణాటక రాష్ట్రం ఏపీ కంటే 8 రెట్లు అధికంగా సెరీకల్చర్ రంగంలో ఉత్పత్తి చేస్తోంది. ఎందుకు ఈ స్థాయిలో గ్యాప్ వచ్చిందో విశ్లేషించండి. సిల్క్ ఉత్పత్తికి సంబంధించి యంత్రాలను ఎంఎస్‌ఎంఈలో పెట్టి.. వాటిని సబ్సిడీ మీద సరఫరా చేసేలా చూడండి. బిల్ గేట్స్ ఫౌండేషన్ తో అగ్రిటెక్ పై కూడా పని చేస్తున్నాం. సెరీ కల్చర్ విషయంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకోండి. పట్టు పురుగుల సాగు ఉండే చోట ఇతర పంటల సాగులో ఎరువుల వినియోగం తక్కువగా ఉండేలా చూడండి. వ్యవసాయ సెరీకల్చర్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. ప్రతీ పంటపైనా వ్యవసాయ విశ్వవిద్యాలయాలు అధ్యయనం చేయాలి. రైతులకు వచ్చే

# అధికధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు

### కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు హెచ్చరిక

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** ఇండిగో విమాన సర్వీసులు అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో కొన్ని విమానయాన సంస్థలు అడ్డగోలుగా ఛార్జీలు పెంచడంపై కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తీవ్రంగా స్పందించారు. అవకాశవాద ధరల విధానాలతో ప్రయాణికులను ఇబ్బంది పెట్టడాన్ని ఏమాత్రం సహించబోమని ఆయన స్పష్టం చేశారు. నిర్దేశించిన నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విమాన టికెట్ల ధరలను ఎప్పటికప్పుడు రియల్ టైమ్ డేటా ద్వారా నిశితంగా గమనిస్తామని, ఇందుకోసం ఎయిర్‌లైన్స్ మరియు ఆన్‌లైన్ ట్రావెల్ ప్లాట్‌ఫామ్‌లతో నిరంతరం సమన్వయం చేసుకుంటామని తెలిపారు. ప్రయాణికుల ప్రయోజనాలను కాపాడేందుకు తమ మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని రామ్మోహన్ నాయుడు పునరుద్ఘాటించారు. ప్రస్తుతం కొన్ని ఎయిర్‌లైన్స్‌లో నెలకొన్న కార్యాచరణ అంతరాయాలను ఆసరాగా చేసుకుని, మరికొన్ని విమానయాన సంస్థలు టికెట్ ధరలను అసాధారణంగా పెంచినట్లు వచ్చిన ఫిర్యాదులను కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. ఈ నేపథ్యంలో, ప్రయాణికులను ఆర్థిక దోపిడీ నుంచి కాపాడేందుకు తన నియంత్రణ అధికారాలను ఉపయోగించాలని నిర్ణయించింది.

## వారం - వర్జ్యం

07-12-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
హేమంత ఋతువు, కృష్ణపక్షం
తదియ సా.6.21
పునర్వసు తె.4.13, జ్యేష్ఠ కార్తె
వర్జ్యం : ఉ.11.47-1.18
దు.సా.4.02-సా.4.47
శుభసమయం : ఉ.10.00-11.00,సా.6.30-7.00
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం :** నూతన ప్రయత్నాలు అనుకూలిస్తాయి. భూవివాదాలు, కోర్టుకేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.

**వృషభం:** గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. చేపట్టే పనులు నెమ్మదిగా పూర్తి కాగలవు.బంధువుల కలయిక.

**మిథునం:** ఆత్మీయుల సహకారంతో సమస్యలు కొంతవరకు తీరుతాయి. లక్ష్యసాధనలో ప్రతిబంధకాలు తప్పవు.

**కర్కాటకం:** ప్రయాణాలలో పాత స్నేహితులను కలుసుకొని సహాయం అర్థిస్తారు. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

**సింహం:** భూ వివాదాలు కోర్టుకేసులు చికాకు పరుస్తాయి. గృహనిర్మాణ యత్నాలలో తొందరపాటు వద్దు. వస్త్ర లాభం.

**కన్య :** క్రయ విక్రయాలలో లాభాలు. దీర్ఘ కాలిక సమస్యల నుండి బయటపడతారు. సోదరుల కలయిక.ఉద్యోగులకు పదోన్నతులు.

**తుల :** అందరిలోనూ ప్రత్యేక గుర్తింపు పొందుతారు. కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. శుభకార్యాలలో పాల్గొంటారు. ధన లాభం.

**వృశ్చికం:** నిర్మోహమాటంగా మాట్లాడి కొందరి వ్యక్తులను దూరం చేసుకుంటారు. బంధువులను కలుస్తారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు.

**ధనుస్సు:** నూతన రచనా వ్యాసంగాల పట్ల అభిరుచి కనపరుస్తారు. వివాదాలకు దూరంగా ఉండండి. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

**మకరం:** ఆర్థిక వ్యవహారాలలో ఆటుపోట్లు తప్పవు. మాటపట్టింపులు రావచ్చు. వస్తువులు కొనుగోలు. సమస్యలు పరిష్కారాన్ని కాలానికి వదిలివేస్తారు.

**కుంభం:** స్థిరాస్తి విషయాలలో నిదానం అవసరం. పనులు నిదానంగా పూర్తి చేస్తారు. స్వల్ప ధనలాభం. నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి.

**మీనం :** కుటుంబసభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. ప్రేమ విషయాలలో పురోగతి సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రెండు కార్లు ఢీ

>> జిల్లా కీజక్కరై వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహ నాన్ని మరో కారు వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం ప్రకారం కారులో ఐదుగురు భక్తులు ఉండగా నలుగురు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పో యారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న కీజక్కరై పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టి, గాయపడిన వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారికి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమా దానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు. మృతులు విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం కోరపు కొత్తవలస, గజపతినగరం మండలం మరుపల్లి గ్రామ వాసులుగా గుర్తించారు. ఈసంఘటన మృతుల కుటుంబాలతో పాటు ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది.

**మంత్రి కొండపల్లి దిగ్భ్రాంతి, మృతుల కుటుంబాలకు సంతాపం:** తమిళనాడు రోడ్డు ప్రమాదంలో విజయనగరం జిల్లా వాసుల మృతి పట్ల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియ చేస్తూ సంతాపం వ్యక్తం చేశారు. దైవ దర్శనం కోసం బయలుదేరిన భక్తులు మృత్యువుకు గురవ్వడం మనసును కలచి వేసిందని ఆయన పేర్కొన్నారు. గాయపడినవారికి మెరుగైన చికిత్స అందించాలని ఆయన తమిళనాడు అధికారులను కోరారు. యాత్రల సమయంలో రాత్రిప్రయాణాలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

## ఆల్‌టైమ్ కనిష్టానికి దిగివచ్చిన ద్రవ్యోల్బణం

**ముంబయి, డిసెంబరు 6:** భారత్‌లో ద్రవ్యోల్బణం గత ఆరేళ్లలో ఎన్నడూ లేనంత కనిష్ఠ స్థాయికి దిగివచ్చింది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ఇది 2 శాతం స్థాయికి చేరుకుంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అంచనా వేస్తోంది. ఇది ఇటీవలి సంవత్సరాల సగటు 6 శాతం కంటే చాలా తక్కువ. అమెరికాలోనూ 2021లో 7 శాతంగా ఉన్న ద్రవ్యోల్బణం, టారిఫ్‌లు పెంచినప్పటికీ ఈ ఏడాది 3 శాతానికి తగ్గింది. ఈ తగ్గుదలకు అసలు కారణం ప్రభుత్వాల బడ్జెట్ లోటును నియంత్రించడమేనని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ద్రవ్యోల్బణానికి ఒకే ఒక్క ప్రధాన కారణం ఉంటుంది. మార్కెట్‌లో వస్తువుల ఉత్పత్తికి మించి ద్రవ్య సరఫరా (మనీ సప్లై) పెరగడమే అది. ప్రభుత్వాలు తమ బడ్జెట్ లోటును భర్తీ చేయడానికి బాండ్లను జారీ చేస్తాయి. సెంట్రల్ బ్యాంకులు వాటిని కొనుగోలు చేసినప్పుడు కొత్త ద్రవ్యంమార్కెట్లోకి వస్తుంది. తద్వారా ద్రవ్యోల్బణం పెరుగుతుంది. భారత ప్రభుత్వ బడ్జెట్ లోటు గతఐదేళ్లుగా క్రమంగా తగ్గుతూ వస్తోంది. 2020లో జీడీపీలో 9.1 శాతంగా ఉన్న లోటు, 2024 నాటికి 4.8 శాతానికి తగ్గింది.లోటు తగ్గడంతో కొత్త ద్రవ్యం మార్కెట్లోకి రావడం తగ్గి, ద్రవ్యోల్బణం అదుపులోకి వచ్చింది.

# అద్భుత సంగీత ప్రపంచానికి చిరునామా ఆంధ్రప్రదేశ్

## - సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్



విజయవాడలో కృష్ణవేణి సంగీత నీరాజనం కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

**విజయవాడ.డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** అద్భుత సంగీత ప్రపంచానికి నీరాజనం అందిద్దామని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. సంగీతం మానసికంగాను, ఆరోగ్యపరంగా మంచి ఉత్తేజాన్ని అందిస్తోందన్నారు. ప్రకృతిని సైతం పులకరింతకు గురిచేస్తోందన్నారు. సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు (సంగీత నాటక అకాడమీ), రాష్ట్ర సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 6,7 తేదీల్లో విజయవాడ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళా క్షేత్రంలో జరిగే కృష్ణవేణి సంగీత నీరాజనం వేడుకలు మంత్రి కందుల దుర్గేష్ చేతుల మీద ఘనంగా ప్రారంభం అయ్యాయి. కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలననంతరం మంత్రి మాట్లాడుతూ మూడోసారి కృష్ణా నది తీరాన జరుగుతున్న కృష్ణవేణి సంగీత నీరాజనం వేడుకలు విజయవంతం అవ్వాలని ఆకాంక్షించారు. ఇదొక అద్భుతమైన ఆధ్యాత్మిక సంగీత కార్యక్రమం అని అభివర్ణించారు. కృష్ణవేణి తరంగాల మధ్య జరుగుతున్న కృష్ణవేణి సంగీత నీరాజనం సంగీత ధ్వని అని, సంగీత ఝరి అని పేర్కొన్నారు. అజరామరమైన సంగీత ప్రవాహానికి, కళా సంస్కృతిక వైభవానికి ఆంధ్రప్రదేశ్ చిరునామ అన్నారు. శాస్త్రీయ, సంప్రదాయక సంగీతంతో పాటు, జనపద రాగాలకు మన రాష్ట్రం ప్రసిద్ధి అన్నారు. త్యాగరాజస్వామి, అన్నమయ్య, మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి సంగీత విద్వాంసులు మన రాష్ట్ర ప్రతిష్టను అజరామరం చేసారన్నారు. సంగీతం, నాట్యం, నటన తదితర కళారూపాల్లో నిష్ణాతులైన కళాకారులు రాష్ట్రవ్యాప్తంగా ఎంతోమంది ఉన్నారని గుర్తు చేసారు. సంగీత ప్రవాహాన్ని ముందుకు తీసుకెళ్లటానికి మేము సైతం అంటూ అనునిత్యం కళారూపాలని ప్రదర్శించేటువంటి కళాకారులకు, పాల్గొని విజయవంతం చేసే సంగీత ప్రియులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా కళలను ప్రోత్సహిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్, సీఎం చంద్రబాబు నాయుడు, స్వయాన కళాకారుడైన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర సంగీత విధానాలు, కళా సాంస్కృతిక రూపాలు ప్రపంచానికి పరిచయం చేయాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. వివిధ రంగాల్లో మారుతున్న విలువలను దృష్టిలో పెట్టుకొని ఆధునిక పరంపరలో కొట్టుకుపోతున్న నేటి యువతరానికి కళారూపాల ప్రాశస్త్యాన్ని తెలపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకించి కళా, సంస్కృతిక రంగాల్లో మూలాలను వివరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. నిత్యం విమర్శ, ప్రతి విమర్శలతో రగిలే రాజకీయ నాయకులకు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా ప్రజాసేవకి పునరంకితమయ్యేందుకు ప్రేరణగా ఉంటాయన్నారు. కుల, మతాలు లేని సంగీతానికి, కళారూపాలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

ప్రభుత్వం పరంగా తెలుగు జానపద కళారూపాలైన తోలుబొమ్మలాట, హరికథ, బుర్రకథ తదితర కళారూపాలను నేటి తరానికి అందిస్తామన్నారు. ఆయా కళారూపాల మాధుర్యాన్ని నేటి తరానికి తెలియచెప్పితే ప్రపంచం చెంతకు రాయబారులుగా తీసుకెళ్తారని మంత్రి దుర్గేష్ వెల్లడించారు. ఇది రెండు రోజులు కార్యక్రమం అయినప్పటికీ కూడా దీన్ని మనం నిరంతరాయంగా కొనసాగించుకునే విధంగా కార్యక్రమాలు ఉండాలన్నారు. ఏ రంగాల్లో ఉన్నప్పటికీ మన ఆచారాలు, సంప్రదాయాలు, కళా రీతుల్ని పిల్లలకు నేర్పించటాన్ని బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం కేవలం విజయవాడలోనే కాకుండా గోదావరి తీరం రాజమండ్రి, శ్రీశైలం, మంగళగిరి, శ్రీకాళహస్తి మొవ్వ తదితర ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

# ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించండి

## - కేంద్రానికి టిడిపి ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** టెట్ నుంచి ఇన్‌సర్వీస్‌లో ఉండే టీచర్లకు మినహాయింపు ఇస్తూ విద్యాహక్కు చట్టం, ఎన్‌సీటీఈ చట్టాలను సవరించాలని టీడీపీ పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం లోక్‌సభ జీరో అవర్‌లో దీనిపై మాట్లాడారు. 'మా కుటుంబం విద్యాసంస్థలు నడుపుతుంది. నేను చిన్నప్పుడు టీచర్ ఇంట్లో పెరిగాను. దేశ నిర్మాణం కోసం టీచర్లు పడే కష్టం గురించి నాకు బాగా తెలుసనన్నారు. 2010 ఆగస్టు 23 ముందు నియమితులైన టీచర్లంతా రెండేళ్ళలోపు టీచర్ అర్హత పరీక్ష పాస్ కావాలని సుప్రీంకోర్టు ఇటీవల ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా లక్షల మంది ఉపాధ్యాయుల్లో భయాందోళనలు రేపిందతి. విద్యాహక్కు చట్టం నిబంధనల్లో ఈ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇచ్చారు. ఇందులో చాలామంది ఇప్పటి వరకు 15-30 ఏళ్ళ సర్వీస్ పూర్తి చేసుకొని గ్రామీణ, గిరిజన ప్రాంత పాఠశాల వ్యవస్థకు వెన్నెముకగా నిలిచారు. ఎప్పుడో ముగిసిపోయిన ఈ సమస్యను సుప్రీంకోర్టు ఇప్పుడు మళ్ళీ తెరవడం వల్ల సర్వీసులో ఉన్న టీచర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఉద్యోగ జీవితం చివరిదశలో ఉన్నవారిని మళ్ళీ ప్రవేశపరీక్ష రాయాలని చెప్పడం వారికి భాధాకరంగా ఉంది. గడువులోగా వారు పరీక్ష పాసవ్వకపోతే ఉద్యోగాలు కోల్పోతారు. దీనివల్ల గ్రామీణ ప్రాంత పాఠశాలలు ఖాళీ అవుతాయి. అందువల్ల కేంద్రం ఆర్‌టీఈ చట్టానికి, ఎన్‌సిటీఈ చట్టానికి సవరణలు చేసి 2010 ఆగస్టుకు ముందు నియమితులైన టీచర్ల ప్రయోజనాలు కాపాడాలి. ఉపాధ్యాయులకు గౌరవం, స్థిరత్వం, భద్రత కల్పించాల్సిన భాధ్యత ప్రభుత్వానిదే' అని చెప్పారు.

# న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించేందుకు ఓ విధానంతో రండి - హైకోర్టు కీలకాదేశాలు

**విజయవాడ,డిసెంబరు6,ప్రభాతవార్తప్రతినిధి:** హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించేందుకు ఓ విధానంతో రావాలని హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు, కార్యదర్శిని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. రిజర్వేషన్ కల్పించాలంటూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ ఉత్తర్వులిచ్చినట్లు విమెన్ అడ్వోకేట్స్ తెలిపారు. ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు 1/3 వంతు రిజర్వేషన్ కల్పించేలా ఆదేశాలివ్వాలంటూ న్యాయవాది తోట సునీత హైకోర్టులో (పార్టీ ఇన్ పర్సన్ పిటీషన్)వ్యాజ్యం దాఖలు చేశారు. బార్ కౌన్సిల్ న్యాయవాదుల సంఘాల ఎన్నికల్లో మహిళా న్యాయవాదులకు రిజర్వేషన్ కల్పించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందన్నారు. ఈ విషయంలో తీర్మానం చేసి, బైలాను సవరించేలా ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘాన్ని ఆదేశించాలని కోరారు. ఈ అంశంపై జరిగిన విచారణలో న్యాయవాదుల సంఘం తరపున సీనియర్ న్యాయవాది చిదంబరం వాదనలు వినిపిస్తూ...రిజర్వేషన్ కల్పించేందుకు సిద్ధమేనన్నారు. బైలాను సవరించాల్సిన అవసరం ఉందని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి రిజర్వేషన్ కల్పనకు ఓ విధానంతో రావాలంటూ విచారణను వచ్చే బుధవారానికి వాయిదా వేశారు.

# తిరుమల సమాచారం

## బర్డ్ ట్రస్ట్‌కు రూ.10లక్షలు విరాళం



**తిరుమల,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ధార్మికసంస్థ తిరుమలతిరుపతిదేవస్థానం చేపడుతున్న అనేక పథకాలు, ట్రస్ట్‌లకు దాతలు భారీగా విరాళాలిస్తున్నారు. శనివారం తెలంగాణ హైదరాబాద్‌కు చెందిన ఏబిఆర్ కేఫ్ బేకర్స్ సంస్థ ప్రతినిధులు బాబూరావు అనుముల, శశాంక్ అనుముల బర్డ్ ట్రస్ట్‌కు 10లక్షలు విరాళం అందించారు. హైదరాబాద్‌లోని టిటిడి ఛైర్మన్ కార్యాలయంలో ఈ విరాళాల చెక్‌ను దాతలు అందజేశారు. టిటిడి బోర్డు సభ్యుడు నన్నపనేని సదాశివరావు పాల్గొన్నారు.

## వారాంతంతో పెరిగిన రద్దీ

**తిరుమల,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** వారాంతం సెలవులు రావడంతో కలియుగ వైకుంఠం తిరుమల భక్తజనసంద్రంగా మారింది. శనివారం వేకువజామునకే తిరుమలలో వైకుంఠమ్ 1,2, క్యూకాంప్లెక్స్ కంపార్టుమెంట్లన్నీ భక్తులతో నిండిపోయాయి. సాధారణ సర్వదర్శనానికి 14గంటలు సమయంపైగానే భక్తులు దర్శనానికి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. లడ్డూవితరణశాలవద్ద భక్తులు బారులుతీరి నిలబడ్డారు. రద్దీకి తగ్గట్లు టిటిడి అధికారులు భక్తులకు నిరంతరాయంగా శ్రీవారి సేవకులతో పాలు, అన్నప్రసాదాలు, తాగునీరు, కాఫీ పంపిణీ చేస్తున్నారు. భక్తులు కూడా సంయమనం పాటించాలని, తమ దర్శన సమయం వచ్చేవరకు ఓపికతో క్యూలైన్లలో సకల సౌకర్యాలు అందుకోవాలని టిటిడి అదనపు ఇఒ చిరూమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, వింగ్ విఎస్ఒ ఎస్టీవిరామ్‌కుమార్ పర్యవేక్షిస్తున్నారు. పూర్తిగా విజిలెన్స్ సిబ్బంది, తిరుమల పోలీసులు సేవాభావంతో భక్తులకు సేవలందిస్తున్నారు.

తిరుగుప్రయాణానికి భక్తులు బస్సులకోసం పడిగాపులు కాసి వచ్చిన బస్సుల్లో సీటుకోసం తంటాలు పడుతున్నారు. శనివారం సాయంత్రానికి 47వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## అఖిలాండం వద్ద భక్తుల క్రమబద్ధీకరణ

**తిరుమల,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనార్థం వస్తున్న భక్తులు దేవదేవుని దర్శనానంతరం ఆలయానికి ఎదురుగా అఖిలాండం వద్ద కర్పూరం వెలిగించి కొబ్బరికాయ కొట్టి మొక్కులు తీర్చుకుంటారు. ఇక్కడ భక్తులు పెద్దసంఖ్యలో గుమికూడినపుడు తోపులాట జరుగుతోంది. మరీ ముఖ్యంగా అఖిలాండం వద్ద కర్పూరం వెలిగించే సమయంలోనూ భక్తులు గుంపులుగుంపులుగా చేరుతారు. ఆ సమయంలో అక్కడ ఏం జరుగుతుందో తెలియని అయోమయం. ఈ విషయంపై "అఖిలాండం వద్ద నియంత్రణ ఏదీ"అనే కథనం గతనెలలో "వార్త"ప్రధానంగా ప్రచురించింది. దీనిపై స్పందించిన టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో అఖిలాండం ముందువైపు భక్తులు గుంపులు గుంపులుగా అక్కడకు చేరుకోలేకుండా స్టీల్ గ్రిల్స్ గేట్ ఏర్పాటుచేశారు.

దీంతో భక్తులు తోపులాట లేకుండా సాఫీగా వరుసక్రమంలో అక్కడకు చేరుకుని ప్రశాంతంగా మొక్కులు తీర్చుకుని తిరిగి వెనక్కువచ్చేలా విజిలెన్స్ సెక్యూరిటీ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. గత ఈ నూతన విధానం అమలుతో భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ లైంగిక వేధింపులు

**తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయంలో ఓ అసిస్టెంట్ ప్రొఫెసర్ తన విజ్ఞతను వదలి ఓ విద్యార్థినిపట్ల లైంగికంగా వేధించడమేగాక ఏకంగా గర్భిణీని చేయడం సంచలనం కలిగించింది. ఆ విద్యార్థినితో ఏకాంతంగా గడిపిన అ కీచక ప్రొఫెసర్ వికృతచేష్టలను మరో ప్రొఫెసర్ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించడం మరింత దుమారం రేపింది. జాతీయసంస్కృత విశ్వవిద్యాలయంలో సభ్యత సంస్కారం గురించి నేర్పాల్సిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మణకుమార్ మొదటి సంవత్సరం విద్యార్థినిని లైంగికంగా వేధింపులకు గురిచేశాడని, ఆపై విద్యార్థిని గర్భిణీకూడా చేయడం దుమారంరేపుతోంది. బాధిత విద్యార్థిని ఒరిస్సాకు చెందడంతో ఈ ఘటనతో విస్తుబోయి ఇంటికెళ్ళిందని విశ్వవిద్యాలయం వర్గాల సమాచారం. దీనిపై విశ్వవిద్యాలయం ఉపకులపతికి బాధిత విద్యార్థిని ఫిర్యాదు చేయడంతో అతనిని సస్పెండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బాధితవిద్యార్థిని ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచించారు. మొత్తం మీద జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో గతంలో కూడా ఇలాంటి ఘటనలు జరిగాయా అనే కోణంలో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

# అభివృద్ధి కేంద్రంగా రాష్ట్రం

## ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి సాయం త్వరగా అందేట్లు చూస్తా : మంత్రి కొల్లురవీంద్ర



**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రాన్ని అభివృద్ధి కేంద్రంగా మలచడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా తీసుకుని పని చేస్తోందని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం వద్ద ప్రజా వేదిక నిర్వహించారు. డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాణం ద్వారా ప్రజలకు హక్కులు కల్పించిన అంబేద్కర్ స్ఫూర్తిని కాపాడుకునేలా పని చేసినపుడు మాత్రమే అసలైన నివాళి అన్నారు. గ్రీవెన్స్ కు వచ్చిన పలువురి నుండి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తక్షణమే సహాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నామన్నారు. ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహించడంతో పాటుగా వాటిని సకాలంలో పరిష్కరించడం కూటమి ప్రభుత్వ పారదర్శకతకు నిదర్శనం. గత ఏడాది కాలంలో మచిలీపట్నం నియోజకవర్గంలో సుమారు 2264 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో 90 శాతం పరిష్కరించామన్నారు. ఎక్కువగా ఇళ్ల నిర్మాణాలు, టిడ్కో ఇళ్లకు సంబంధించిన దరఖాస్తులే వస్తున్నాయని, త్వరగా ఇళ్ల నిర్మాణం ద్వారా సమస్యల్ని పరిష్కరిస్తామన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఇళ్ల నిర్మాణాలను గాలికి వదిలేయడంతోనే ఇప్పుడు ప్రజలు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. నియోజకవర్గంలో 6000 ఇళ్ల నిర్మాణానికి హామీ ఇచ్చామని, వాటిని సాకారం చేసి చూపిస్తామన్నారు. ఇళ్ల స్థలాలు ఇచ్చిన చోట మోలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. గతంలో సమస్య ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ప్రజలు ముప్పుతిప్పలు పడేవారు. సచివాలయంలో ఫిర్యాదు చేస్తే వాటిని స్థానిక వైసీపీ నేతలకు పంపించి వేదింపులకు పాల్పడ్డారు. కానీ నేడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా.. ఎమ్మెల్యేలు, మంత్రులు అంతా ప్రజల్లోనే తిరుగుతున్నారు. ప్రతి వారం గ్రీవెన్స్ నిర్వహించి సమస్యల్ని పరిష్కరిస్తున్నారు. సమస్యతో వచ్చిన ప్రతి ఒక్కరికి పరిష్కారం చూపించి పంపిస్తున్నాం. రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమంలో అగ్రస్థానంలో నిలిపిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ నిర్వహించి విద్యార్థుల స్థితిగతుల్ని తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. తల్లికి వందనం ప్రతి బిడ్డకీ అమలు చేశాం. 64 లక్షల మందికి పెన్షన్లు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవతో రైతులకు అండగా నిలుస్తున్నాం. రైతులతో చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నాం. వర్షాల కారణంగా ఇబ్బందులు పడిన రైతులను కూడా ఆదుకున్నాం. భవిష్యత్తులో రైతులకు డ్రైయర్లు అందుబాటులో ఉంచబోతున్నాం.

# తప్పుచేయడంతోనే పశ్చాత్తాపంతో శ్రీవారికి గిఫ్ట్‌డీడ్ ఇచ్చా


## - ఆస్తుల్లో ఎవ్వరికీ వాటాలు ఇవ్వలేదు
## - పరకామణి చోరీకేసులో ముద్దాయి రవికుమార్



**తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** పుణ్యక్షేత్రం తిరుమలలోని పెద్దజీయంగారి మఠంలో, పరకామణిలో గుమస్తాగా పనిచేసిన తాను 2023 ఏప్రిల్ 29న చోరీచేశానని, ఆ తరువాత దేవుని సొమ్మును దొంగతనం చేయడం తప్పుగా భావించి తన ఆస్తిలో 90శాతం టిటిడికి(శ్రీవారికి)గిఫ్ట్‌డీడ్‌గా ఇచ్చానని ముద్దాయి రవికుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయంలో తన కుటుంబసభ్యులు కూడా దేవుని సొమ్ము చోరీ పాపంలో తప్పులతో ఇలా చేశానన్నారు. పరకామణిలో చేసిన తప్పును మహాపాపంగా భావించాను. ప్రాయశ్చిత్తంగా ఆ ఆస్తిలో 14కోట్లు రూపాయలు శ్రీవారికి కానుకగా ఇచ్చేశానన్నారు. ఈ వ్యవహారంలో ఎవరికీ వాటాలు ఇవ్వలేదని సంచలన వీడియోను శనివారం విడుదల చేశారు. చోరీచేసిన తొలుత కొందరు తనను బ్లాక్‌మెయిల్ చేశారని, వారిపై కేసులు కూడా నమోదు చేయించానన్నారు. అయితే ఇతరులకు నా ఆస్తినిగానీ, డబ్బులు గానీ ఎందుకు ఇస్తానని రవికుమార్ విడుదల చేసిన వీడియోలో వ్యాఖ్యలు. కొందరు ఒత్తిళ్లకు లోనయ్యానని ప్రచారం చేస్తున్నారని, ఇంకా తన శరీరంలో శస్త్రచికిత్స చేసుకున్నానని దుష్ప్రచారాలు చేయడం బాధకలిగించిందన్నారు. దీనిపై కొందరు డిబేట్లు పెట్టడం మా కుటుంబాన్ని చాలా క్షోభకు గురిచేస్తోందిన తెలిపారు. న్యాయస్థానం ఆదేశిస్తే తాను ఎలాంటి వైద్యపరీక్షలకు అయినా సిద్ధమేనని అన్నారు. ఎలాంటి శస్త్రచికిత్స చేసుకోలేదని తెలిపారు. గత నెలరోజులుగా ఎప్పుడూ ఎక్కడా సిఐడి విచారణ తరువాత నోరుమెదపని రవికుమార్ శనివారం వీడియోను విడుదల చేయడం మాత్రం హాట్‌టాఫిక్‌గా మారింది. మరీ న్యాయస్థానంలో విచారణలో ఉన్నపుడు జరిగిన వ్యవహారంపై న్యాయస్థానం ఎలాంటి తీర్పువెలువడిస్తుందోననేనా చూస్తున్నారు.

# పాట్నావాసుల చెంతకు వేంకటేశ్వరుడు!

## -10.11 ఎకరాల స్థలం కేటాయింపు - ఆలయ నిర్మాణానికి టిటిడి కార్యాచరణ



**తిరుమల,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** అఖిలాండకోటిబ్రహ్మాండ నాయకుడు, కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి అందరిదేవుడుగా ఖ్యాతిచెందాడు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించాలనే భావంతో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూచనల మేరకు ధార్మికసంస్థ తిరుమల తిరుపతిదేవస్థానం అందుకు తగిన ప్రణాళికలు రూపొందించింది. ప్రతి రాష్ట్ర ముఖ్యమంత్రికి, గవర్నర్‌లకు లేఖలు కూడా రాసింది. టిటిడి బోర్డు ఛైర్మన్ బిఆర్‌నాయుడు, టిటిడి ఇఒ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి శ్రీవారి ఆలయాల నిర్మాణంపై కసరత్తుచేపట్టారు. ప్రతిరాష్ట్ర రాజధానిలో దేవదేవుని ఆలయం నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా కన్యాకుమారి, జమ్ముకాశ్మీర్, ఢిల్లీ, నవీముంబై, అమరావతి, విశాఖపట్నం, బెంగుళూరు, చెన్నై, ఒడిస్సా, రామేశ్వరం వంటి పుణ్యక్షేత్రాల్లో గోవిందుని ఆలయాల నిర్మాణం చేపట్టింది. ఇప్పుడు తాజాగా బీహార్‌రాష్ట్ర రాజధాని పాట్నాలో టిటిడి శ్రీవారి ఆలయం నిర్మాణానికి అసవరమైన 10.11 ఎకరాల స్థలాన్ని పాట్నాలోని మోకామోఖాస్ ప్రాంతంలో కేటాయించింది. ఈ విషయాన్ని ఆ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ప్రతయఅమృత్ నుండి టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడుకు లేఖ అందింది. ఆ స్థలంలో టిటిడి ఆలయాన్ని నిర్మించేందుకు బీహార్ రాష్ట్రప్రభుత్వం ఆమోదం తెలిపింది. పాట్నాలో దేవుని ఆలయం నిర్మాణానికి సానుకూలంగా ప్రభుత్వంస్పందించడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, రాష్ట్ర మానవనరులు, విద్యాశాఖ, ఐటిశాఖల మంత్రి నారాలోకేశ్ అభినందనలు తెలిపారు. ఆ భూమిని 99సంవత్సరాలపాటు ఒకరూపాయి(1)టోకెన్ లీజు అద్దెతో ఇవ్వాలని బీహార్ రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఈ మహత్తరమైన నిర్ణయంతో బీహార్ రాష్ట్రంలో టిటిడి ధార్మిక కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశం ఏర్పడిందని టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు. ఎంఒయు చేసుకునేందుకు ఆ రాష్ట్ర పర్యాటకశాఖ అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌ను అధికారికంగా నియమించడం జరిగిం దన్నారు. త్వరలోనే టిటిడి అధికారులు సంప్రదింపులు జరిపి ఆలయ నిర్మాణానికి సంబంధించిన అవసరమైన అన్ని చర్యలు చేపడతామని ఛైర్మన్ తెలిపారు.

# నెల్లూరు టౌన్ లో మూడు స్పా సెంటర్ల మీద రైడ్

## ముగ్గురిపై కేసులు నమోదు

**నెల్లూరు క్రైమ్, డిసెంబర్ 6, ప్రభాతవార్త :** నెల్లూరు టౌన్ లో మూడు స్పా సెంటర్ల మీద రైడ్ చేసి, పదిమంది మహిళలు, ఒక విటుడుని అదుపులోకి తీసుకొని, మూడు కేసులు నమోదు టౌన్ ఇన్చార్జి డిఎస్పి గిరిధర్, జిల్లా ఎస్పీ డా.అజిత వేజెండ్ల ఐపీఎస్, ఆదేశాల మేరకు టౌన్ డిఎస్పి ఆధ్వర్యంలో స్థానిక పోలీస్ అధికారులు బృందాలుగా ఏర్పడి, నెల్లూరు టౌన్ లోని మూడు స్పా సెంటర్ల మీద రైడ్ చేసి అనుమానాస్పద కార్యకలాపాలు గుర్తింపు. వేదాయపాలెం పరిధిలోని నిప్పో సెంటర్లోని ఓ స్పా సెంటర్ మీద రైడ్ చేసి, ఐదు మంది మహిళలు అదుపులోకి తీసుకొని ఒక కేసు నమోదు చేయడం జరిగింది.

# 15 నుంచే నరసాపురం - చెన్నై వందేభారత్

## నెల ముందే అందుబాటులోకి : కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

**భీమవరం, డిసెంబర్ 6: ప్రభాత వార్త** ఈనెల 15 నుండి నరసాపురం చెన్నై వందే భారత్ రైలు సర్వీసులు ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమలశాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రకటించారు. రైల్వే శాఖ అడ్వాన్స్ రిజర్వేషన్ పిరియడ్ వల్ల జనవరి 12న ప్రారంభించాలని మొదట ప్రకటించినప్పటికీ ప్రజల విజ్ఞప్తి మేరకు పండగ కంటే ముందే రైలు సర్వీస్ ప్రారంభించాలని తాను చేసిన విజ్ఞప్తికి రైల్వేశాఖమంత్రి తోపాటు అధికారులు అంగీకరించారని ఆయన అన్నారు. శనివారం భీమవరంలోని బిజెపి నర్సాపురం పార్లమెంట్ కార్యాలయంలో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి పలు కీలక అంశాలపై మాట్లాడారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ జిల్లాకు రైల్వేలు అత్యంత ముఖ్యమైన రవాణా మార్గాలలో ఒకటి అని, రైల్వేలలో అనేక సమస్యలను పరిష్కరించడం, ముఖ్యంగా నర్సాపురం పార్లమెంట్‌కు వందే భారత్‌ను తీసుకురావడం తన ఎన్నికల హామీలలో ముఖ్యమైనది అన్నారు. నర్సాపురంచెన్నై వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (20677/20678) ఈ నెల 15న ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. పండుగకు కంటే ముందే వందే భారత్ రైలు సర్వీస్ సేవల కోసం ప్రజల నుంచి వచ్చిన అభ్యర్థనలను దృష్టిలో ఉంచుకుని తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన రైల్వే శాఖ మంత్రికి, రైల్వే అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైలు సంఖ్య 20677 (చెన్నై నుండి నరసాపురం) డా. ఎం.జీ.ఆర్ చెన్నై సెంట్రల్ నుండి ఉదయం 05.30 గంటలకు బయలుదేరి, రేణిగుంట, నెల్లూరు, ఒంగోలు, తెనాలి, విజయవాడ, గుడివాడ, భీమవరం టౌన్ స్టేషన్లలో ఆగి, మధ్యాహ్నం 14.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది అని, రైలు సంఖ్య 20678 (నరసాపురం నుండి చెన్నై) నరసాపురం నుండి మధ్యాహ్నం 14.50 గంటలకు బయలుదేరి, భీమవరం టౌన్, గుడివాడ, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో ఆగి, రాత్రి 23.45 గంటలకు డా. ఎం.జీ.ఆర్ చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది అన్నారు. జిల్లా ప్రజలకు ప్రపంచ స్థాయి సౌకర్యం, వేగవంతమైన రైలు సర్వీసు అందించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కి ధన్యవాదాలు తెలిపారు. బెంగళూరు నుండి విజయవాడ వరకు నడుస్తుందన్నారు.

# అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళి : రచయిత తంగిరాల సోని

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** కంచికచర్లలో బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం బహుజన రచయితలు వేదిక , బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కవి , రచయిత తంగిరాల సోని అధ్యక్షతన జరిగింది .ముందుగా డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహమునకు రిక్షా యూనియన్ కార్యదర్శి డోలు చిట్టి, బుద్ధి సొసైటీ ఆఫ్ ఇండియా గౌరవ సలహాదారు పిల్లి స్వామి దాసు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తంగిరాల సోని మాట్లాడుతూ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు నిజమైన నివాళిని, ఈ దేశం ప్రజాస్వామ్యంగా, దృఢంగా ఉందంటే ఆయన వలనే అని, ఎన్నో కష్టాలు నష్టాలు కోర్చుకొని చదువుకొని ప్రపంచంలోనే మహా మేధావిగా అంబేద్కర్ కొన్ని ఆడుతున్నారని, అస్పృశ్యత జీవితాన్ని ఎదుర్కొనే దానిపై ఎనలేని పోరాటం జరిపి, చదువు ద్వారా ఏదైనా సాధించని ఆయన జీవితమే ఒక నిదర్శనమని , భారత రాజ్యాంగ నిర్మాతగా భారత ప్రజల హృదయాల్లో వున్నారని పేర్కొన్నారు.

పది వేల ఏండ్ల కిందటనే మన దేశంలో వ్యవసాయం ప్రారంభమైందని చరిత్ర చెప్తున్నది. నాటి నుంచి నేటి వరకు వ్యవసాయ విత్తనాలు ఉత్పత్తి చేసిందే కానీ ఎన్నడూ విత్తనాలు కొనుగోలు చేయలేదు. హరిత విప్లవం తర్వాత హైబ్రిడ్ విత్తనాల పేర్లతో దేశంలో విత్తనాల అమ్మకం, దిగుమతి పెరిగింది. గత ఇరవై, ఇరవైఐదు ఏండ్ల కిందట ప్రతి రైతు ఇల్లు ఒక విత్తన భాండాగారమే. అప్పుడు రైతులు పండించిన పంటలో కొంత మంచి భాగాన్ని విత్తనాలుగా నిల్వ చేసుకొని అవే విత్తనాలను మళ్లీ పెట్టుకొని పెట్టుబడి లేని వ్యవసాయం చేసేవారు. కానీ కొన్నేళ్ల నుండి ప్రభుత్వం, కార్పొరేట్ విత్తన కంపెనీలు క్రమంగా రైతుల దగ్గరి నుంచివిత్తనాలను దూరం చేశాయి. ఇప్పుడు ఏ చిన్న పంట పెట్టుకోవాలన్నా రైతులు కార్పొరేట్ కంపెనీలపై ఆధారపడవలసి వస్తున్నది. తాజాగా కేంద్రం తీసుకొస్తున్న కొత్త విత్తన చట్టం బిల్లు ముసాయిదా మాత్రం రైతాంగానికి భరోసా ఇవ్వలేకపోయింది. ఈ దేశపు రైతులు, రైతు సంఘాల దశాబ్దాల డిమాండ్ దృష్ట్యా కేంద్ర ప్రభుత్వం తాజాగా తలపెట్టిన విత్తన చట్టం తాలూకు బిల్లు ముసాయిదా మూడు వారాల కింద విడుదలైంది. ఏమైనా మార్పులు,సూచనలు,సలహాలుంటే డిసెంబర్ 11 వరకు తెలియపర్చవచ్చని ముసాయిదా ప్రతిని ప్రజాక్షేత్రంలో ఉంచింది.రైతులప్రయోజనం అన్న ఆత్మలేకుండా ఉన్న ఈ బిల్లు ముసాయిదాలో ముఖ్యమైన మార్పులు తీసుకురాకుండా ఇదే రూపంలో బిల్లు ఆమోదం పొంది చట్టరూపుసంతరించుకుంటే ప్రమాదమని రైతులు, రైతు నాయకులు ఆందోళన చెందుతున్నారు. నిజానికి, రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్రజాబితాలోని అంశం. రాష్ట్రంలో జరిగే విత్తన పరిశోధనలు, పరిశోధనా కేంద్రాలు, విత్తనోత్పత్తి, పరీక్షలు, క్రయ విక్రయాలు, నాణ్యత, ధరల నిర్ణయం వంటి విషయాలపైనా రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ ఉండాలి.

# విత్తన చట్టం ఎవరి కోసం?

**సిహెచ్ వి వి రఘుబాబు**

విత్తన చట్టం తీసుకువస్తున్నది విత్తనాన్ని ఉత్పత్తి చేసి, విత్తనాన్ని వినియోగించే రైతుల కోసమా? విత్తనంతో వ్యాపారం చేసే కంపెనీల కోసమా? అన్నది ప్రశ్న. దేశంలో ఎక్కడో ఒక దగ్గర నకిలీ విత్తనాలతో నష్టపోతున్న రైతులను ఏటా చూస్తూనే ఉన్నాం. తాజాగా మెదక్ జిల్లాలోని చేగుంట మండలం రుక్మాపూర్ గ్రామంలో ఒక విత్తన కంపెనీ 45 మంది రైతులకు నకిలీ వరి విత్తనాలు విక్రయించింది. వారు సుమారు 100 ఎకరాలలో వరి పంట వేశారు. ఎకరానికి 30 క్వింటాళ్ల చొప్పున దిగుబడి రావాల్సి ఉండగా, 6,7 క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో ఆ రైతులు ఆత్మహత్యే శరణ్యమని లబోదిబోమంటున్నారు. ఈ నకిలీ విత్తనాలతో పంట దిగుబడి సరిగా రాలేదని, ఆ నకిలీ కంపెనీపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదని వారు వాపోవడం గమనార్హం. నకిలీ విత్తనాల కంపెనీలను అరికట్టే సరైన వ్యవస్థ లేకనే రైతులు నష్టపోతున్నారనేది నిర్వివాదాంశం. విత్తనాల ధర భారం అవుతుండటంతోనే రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు ఒక అంచనా. దేశవ్యాప్తంగా 540 విత్తన కంపెనీలున్నాయి. అవి ఏటా దాదాపు రూ.65 నుంచి రూ.70 వేల కోట్ల విత్తన వ్యాపారం చేస్తున్నాయని ఒక అంచనా! వ్యవ సాయానికి భూమి ఎంత ముఖ్యమైనదో విత్తనం కూడా అంతే ముఖ్యమైనది. ఇది గమనించిన విత్తన కంపెనీలు ఏటా రూ.5 వేల కోట్ల నకిలీ విత్తనాలు అమ్ముతున్నాయని తెలుస్తున్నది. ఇక కేంద్ర వ్యవసాయశాఖ విత్తన బిల్లు 2025ను ప్రవేశపెట్టనున్నది. ఇందుకోసం డిసెంబర్ 11 వరకు సూచనలు చేయవలసిందిగా రైతులు, రైతు సంఘాలను కోరుతూ కేంద్ర ప్రభుత్వం డ్రాఫ్ట్ బిల్లును పబ్లిక్ డొమైన్‌లో పెట్టింది. ఈ బిల్లు సాగుదారుల కోసమా? కార్పొరేట్ల కోసమా? అని రైతులు, రైతు సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ప్రభుత్వం నకిలీ విత్తనాలను అరికడుతుందని చెప్తూనే కార్పొరేట్ పక్షపాతం వహిస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విత్తన రంగాన్ని నియంత్రించే నిబంధనలను సమూలంగా మార్చడానికి భారత ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా విత్తనాల బిల్లు 2025 ద్వారా 1966 విత్తనాల చట్టం, 1983 విత్తన నియంత్రణ ఉత్తర్వులను భర్తీచేయడమే లక్ష్యంగా పెట్టుకున్నది. కొత్త చట్టం నాణ్యమైన విత్తనాల సరఫరాను మెరుగుపరుస్తుందని, నకిలీలను అరికడుతుందని, రైతులకు ఎక్కువ రక్షణ కల్పిస్తుందని అధికారులు చెప్తున్నారు. ఆనాటి పరిస్థితుల్ని బట్టి 1966లో వచ్చిన విత్తన చట్టం 1983లో వచ్చిన విత్తన నియంత్రణ చట్టం అమలవుతున్న క్రమంలో వ్యవసాయంలో ఎన్నో మార్పులు వచ్చాయి. వ్యవసాయ స్వరూపమే




సమగ్రంగా మారింది. మారిన పరిస్థితుల్ని బట్టి పలు విదేశీ, స్వదేశీ విత్తన కంపెనీలు మొత్తం వ్యవస్థను గుప్పెట్లోకి తీసుకున్నాయి. 1990ల నుంచి జరుగుతున్న పరిణామంలో 2004లో, 2010లో, 2017లో, 2019లో ఇలా పలుమార్లు కొత్త చట్టం తెచ్చేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. 2017లో తెలంగాణ ప్రభుత్వం చట్టం తెచ్చేందుకు చేసిన యత్నమూ విఫలమైంది. దశాబ్దాల కార్పొరేట్ శక్తుల ఒత్తిళ్లను అధిగమించి ఇప్పుడొక కొత్త చట్టం అంటూ వస్తే అది వారికి ప్రయోజనకరంగా కాకుండా రైతులకు మేలు చేసేదిగా ఉండాలి. రైతు హక్కుల్ని కాపాడి వ్యవసాయాన్ని గట్టెక్కిచ్చేదిగా ఉండాలని సమాజం కోరుకుంటోంది. కానీ, 2004, 2019లో మునుపటి ప్రయత్నాల మాదిరిగానే, ఈ బిల్లు తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నది. రైతు సంఘాలు, విత్తన నిపుణులు, పౌర సమాజ సంస్థలు సాధారణ సాగుదారుల కంటే, ముఖ్యంగా సంప్రదాయ, రసాయన రహిత వ్యవసాయంపై ఆధారపడే వారి కంటే విత్తన కంపెనీలు, వ్యవసాయ వ్యాపారాలకే ఈ చట్టం మేలు చేస్తుందంటున్నారు.అత్యవసర పరిస్థితి వచ్చినప్పుడు మాత్రమే విత్తనాల ధరల నియంత్రణకు అవకాశం (సెక్షన్ 22) ప్రతిపాదించారు. విత్తనాల విక్రయ ప్రక్రియలో మాధ్యమికంగా ఉండే డీలరు, డిస్ట్రిబ్యూటర్, సెల్లర్ వంటి వారిని జాగ్రత్తగా ప్రస్తావించిన బిల్లు ముసాయిదా విత్తన ఉత్పత్తి రైతును, పంటల్ని వాణిజ్యస్థాయిలో పండించే రైతును సదరు విత్తన కొనుగోలుదారులుగా మాత్రం ప్రస్తావించలేదు. వారి హక్కుల గురించిగాని, తగు భద్రత గురించిగాని ముసాయిదాలో ఎక్కడా లేదు. కేంద్ర వ్యవసాయోత్పత్తుల ఖర్చుల ధరల నియంత్రణ కమిషన్ తాజా ధరల నివేదిక ప్రకారం రాష్ట్రంలో, దేశంలో విత్తన ధరలు ప్రతి ఏటా వ్యవసాయ ఇతర ఖర్చులకన్నా వేగంగా పెరుగుతున్నాయి. బ్రాండెడ్ కంపెనీలకు విత్తనాలు ఉత్పత్తి చేసిచ్చే రైతులకు చెల్లించే ధరలకు, వాటిని అంతిమంగా వినియోగ రైతులకు అమ్మే ధరలకు పొంతనే ఉండడం లేదు. ఈ అంశాన్ని సంబంధాన్ని బిల్లులో నిర్దేశించాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. ఇది లేకపోవడం వల్లే ఒకవైపు విత్తనోత్పత్తి రైతులు, మరోకవైపు విత్తనాలు కొనుగోలుచేసి వాణిజ్య స్థాయిలో పంటలు పండించే రైతులు సంక్షోభం ఎదుర్కొంటున్నారు. పరిస్థితులు వికటించినప్పుడు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. అత్యవసరాల్లోనే కాకుండా సాధారణ సమయాల్లో కూడా ఈ ధరలపైన నిఘా, నియంత్రణ ఉండేలా ముసాయిదాను మార్చాలనే సూచన వస్తోంది. విత్తన లోపంవల్ల పంట నష్టపోయినప్పుడు రైతుకు నష్టపరిహారం అంశాన్ని కూడా చట్టబద్ధం చేయాలనేది గట్టి ప్రతిపాదనగా ఉంది. పరిశోధనలు, పలు ధ్రువీకరణాల తర్వాత వివిధ రకాల విత్తనాలతో పంటలు పండించే ప్రక్రియలో పాల్గొనే ఇతరేతరులే కాకుండా మౌలికమైన రైతులు వారి ప్రయోజనాల పరిరక్షణ అంశాలన్నీ చట్టంలో పొందుపర్చాలి. నకిలీ విత్తనాలను ఉత్పత్తి చేసి సరఫరా చేసిన వ్యక్తులకులేదా కంపెనీలకు కఠినమైన శిక్షలను తక్షణమే అమలు చేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం పొందడానికి సులభమైన మార్గం ఉండాలి. స్థానిక మండల వ్యవసాయాధికారి నివేదిక ఆధారంగా నష్టపోయిన రైతుకు నష్టపరిహారం ఒక నెలలోపు అందించే విధంగా చట్టం ఉండాలి. విత్తనాల ధరలపై రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. విత్తనాల ఉత్పత్తిపై ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నియంత్రణ, పర్యవేక్షణ కూడా ఉండాలి. విత్తనాలపై కృత్రిమ కొరత సృష్టిస్తే భవిష్యత్తులో ఆ కంపెనీకి అనుమతులు ఇవ్వకూడదు. దేశీయ లేదా సంప్రదాయ విత్తనాలను కాపాడుకొని భద్రపరిచే విధానం చట్టంలో ఉండాలి. రైతులు పాత పద్ధతుల్లో విత్తనాలను కాపాడుకునే పద్ధతిని ప్రోత్సహించాలి. 60 శాతంపైగా జనాభా వ్యవసాయరంగంపై ఆధారపడ్డ దేశం మనది. అలాంటి మన దేశంలో ప్రధానమైన విత్తన చట్టాన్ని సవరణ చేస్తున్న నేపథ్యంలో ప్రతి గ్రామంలో చర్చలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. రైతులు, సంఘాలు, మేధావుల నుండి అభిప్రాయాలు తీసుకొని చట్ట సవరణ చేయాలని ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. ●

కర్ణాటక

# ‘టిఫిన్’ అరిగిందా!

**ఎ.వి.వి ప్రసాద్**

ముఖ్యమంత్రి సీటు వదలనంటున్నవారొకరు, ఆ సీటే కావాలనుకొంటున్నవారొకరు.. వారిద్దరూ కలిసి రెండు సార్లు ప్రశాంతంగా ‘టిఫిన్’ చేశారు. అయిపోయి బయటకు వచ్చాక ‘అబ్బే! మామధ్య విభేదాలేం ఉన్నాయి! అంతా బాగు బాగు’ అంటూ మీడియా ముందు నవ్వు ముఖాలతో కనిపించి వెళ్లిపోయారు. అయితే ‘అసలు’ సమస్య పరిష్కారమైందా! అన్నదే అందరిలోను వదలని సందేహం. దానికి ముందు రెండు శిబిరాలలోను అనుచరగణం వాదోపవాదాలు, ఎత్తులు పై ఎత్తులతో వేడెక్కిపోయారు. ఢిల్లీ వెళ్లి కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద ఎవరి ప్రయత్నాలు వారుచేశారు.నాయకులిద్దరూ కూడా అధిష్ఠాన పెద్దలతోరెండు మూడు దఫాలుగా ప్రత్యక్ష చర్చలే జరిపారు. అలాంటి భేటీల సమయంలో రెండుసార్లు ఒక రికొకరు ఎదురు పడినా కనీసం పలుకరించుకో కుండానే ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. అప్పుడే అంతా అనుకున్నారు ఈసారి కచ్చితంగా ఏదో జరుగబోతోందని. మల్లికార్జున ఖర్గే, కెసి వేణుగోపాల్ ఏం హామీలిచ్చారో తెలియదు కానీ ఒక్కసారిగా ఇద్దరూ ‘గప్ చుప్’ అయినట్లుగా కనిపించారు. దానికి నిదర్శనంగా నవంబరు 29న ఉదయం డికె ముఖ్యమంత్రిసిద్దరామయ్య నివాసానికి వెళ్లి ‘సంతృప్తి’గా ‘టిఫిన్’ చేసి వచ్చారు. ఆ సందర్భంగా వారిద్దరూ 40 నిమిషాల పాటు చర్చించుకొన్నట్లు సమాచారం. ఇద్దరూ కలిసి తర్వాత మీడియాతో కూడా మాట్లాడారు. తమ మధ్య ఎలాంటి భేదాభిప్రాయాలు లేవనీ, ఇక ముందు రావనీ సిద్దరామయ్య స్పష్టం చేశారు. దానిపై ఆశ్చర్యపోవడం మీడియా ప్రతినిధులవంతయింది. ఏదో సంచలన ప్రకటన చేస్తారను కొంటే చాలా సాదాసీదాగా నవ్వుతూ వారిద్దరూ కనిపించడంతో ఇన్ని రోజులూ జరిగిన వివాద ప్రచారమంతా నిజమా, కాదా అనే సందేహం కూడా చాలా మందిలో కలిగింది. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామనీ, టిఫిన్ తింటూ అదే మాట్లాడుకొన్నామనీ మీడియా వారి ప్రశ్నలకు సమాధానంగా వారుచెప్పారు. అంతవరకు బాగానేఉంది. ఈ ‘టిఫిన్’ రాజకీయం వెనుక..డికె విధేయులకు మరిన్ని మంత్రి పదవులు లభిస్తాయనీ, కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షునిగా డికె కొనసాగడానికి హామీ లభించిందనే ప్రచారం జరిగింది. అయితే రెండో దఫా అధిష్ఠాన చర్చలలో బుజ్జగింపులతో పాటు హెచ్చరికలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. దాంతో ఏమనుకున్నారో ఏమో! తర్వాత నాలుగు రోజులకు డిసెంబరు 2న డికె, సిద్దరామయ్య ఇద్దరూ మళ్లీ ‘టిఫిన్’ సమావేశం జరిపారు. ‘సంతృప్తికరం’ గానే టిఫిన్ చేసినట్లు ఇద్దరూ మీడియాతో చెప్పారు. రెండోసారి టిఫిన్ కోసం డికె నివాసానికి సిద్దరామయ్య వచ్చారు. టిఫిన్ తిన్నాక ఇద్దరూ మీడియాతో మాట్లాడుతూ‘మేమిద్దరం ఒక్కటే. అధిష్ఠానం చెప్పినట్లే నడుచుకొంటాం. ఎటువంటి గందరగోళానికి ఇక తావు లేదు. మీరు కూడా ఏవేవో ఆలోచించకండి’ అని చెప్పి



సిద్దరామయ్య, శివకుమార్


నిష్క్రమించారు. అక్కడితో కథకంచికి చేరిందా, లేక ‘కావేరి’ (సిఎం అధికార నివాసం)లో మరుగుతోందా? అన్నదే తేలకుండా ఉంది. తర్వాత రెండు రోజులకు మంగుళూరులో జరిగిన ఓ సమావేశం తర్వాత అధిష్ఠాన నేత వేణుగోపాల్‌తో సిద్దరామయ్య సుదీర్ఘ భేటీ యే జరిపారు. ఆయన మరికొన్ని సూచనలేవో చేశారనీ, ఇప్పుడు వాటిపై ఉభయ నేతల అనుచరుల మధ్య వాడివేడిగా చర్చలు జరుగుతున్నాయనీ తెలుస్తోంది. అయితే ఒకటి మాత్రం వాస్తవం. డికె తన అనుచరగణంతో చేసిన ‘బల ప్రదర్శన’ కంటే సిద్దరామయ్య చేసిన ‘కుల ప్రదర్శన’ ప్రభావమే అధిష్ఠానంపై ఎక్కువ కనిపించినట్లుగా తెలుస్తోంది. డికెకు ఆర్థికంగా సంపన్నమైన అనుచరగణం గణనీయంగానే ఉంది. కానీ సిద్దరామయ్యకు ‘అహిందా’బలం అధికంగాఉంది. అంటే మైనారిటీలు, బిసిలు, దళితుల గణం. సీట్లు గెలవాలంటే వారి ఓట్లే ప్రధానం. డికెకు ముఖ్యమంత్రి సింహాసనం అప్పగిస్తే మరో రెండే ళ్లలో జరిగే ఎన్నికల్లో ఫలితాలు వికటిస్తే పార్టీ పెద్ద ప్రమాదంలో పడుతుందనే ఆలోచనతోనో, లేక సిద్దరామయ్య మరో పార్టీలోకి వెళ్తే కాంగ్రెస్ మళ్లీ బలహీనమవుతుందనో.. మొత్తానికివారిద్దరి చేత ఒకే టేబుల్‌పై టిఫిన్ తినిపించింది. రెండున్నరేళ్ల క్రితం అధిష్ఠానం తమకు హామీఇచ్చిందనీ, దాని ప్రకారం డికెను సిఎం చేయకపోతే తాము నిద్రపోమనీ అనుచరులు అంటూనే ఉన్నారు. డికె కూడా చాలా సార్లు ఆరకమైన ధోరణితోనే మాట్లాడారు. ‘భగవంతుడు ఏమను కుంటున్నాడో ఎవరికి తెలుసు!’ అనికూడా చాలాసార్లు ఆయన వ్యాఖ్యానించారు. దాని అంతరార్థం తేలికగానే అర్థమవుతుంది. సామాజికంగా వొక్కళిగల మద్దతు డికెకు ఎక్కువగా ఉంటే, ‘అహిందా’ బలం సిద్దరామయ్యకు ఉంది. ఆమధ్య జరిగిన కుల గణన ప్రకారం వొక్కళిగల జనాభా దాదాపు 9 శాతంగా తేలింది. కానీ‘అహిందా’లు 24 శాతం వరకు ఉన్నారు.అంటే అధికార పంపకం జరిగితే సమీకరణాలు మారిపోయే అవకాశం ఉంటుంది. మరో రెండు సంవత్సరాలు ‘యథాతథ స్థితి’ కొనసాగిస్తే, మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఈసారి డికెకు ముఖ్యమంత్రి పదవి ఇస్తామనీ, అప్పుడు సిద్దరామయ్య కూడా బేషరతుగామద్దతు ఇస్తారనీ అధిష్ఠానం ‘గట్టిగా’ చెప్పడం వల్లనే ‘టిఫిన్’ భేటీకి డికె వచ్చారనీ, సిద్దరామయ్య కూడా అభ్యంతరం చెప్పలేదనీ అంటున్నారు. ఇద్దరి మధ్య ‘తాత్కాలిక సంధి’ కుదిరినా, అది ఎన్నికల సమయానికి ఎటువంటి ప్రభావం చూపుతుందో ఇప్పుడే చెప్పలేం. ఈలోగా అధిష్ఠానం వైఖరి ఎలా మారుతుందో కూడా చెప్పలేం. కాంగ్రెస్ ఇప్పటికే చాలా కష్టకాలంలో ఉంది. బీహార్ దెబ్బ నుంచి బయటపడలేకపోతోంది. ఈ దశలో కర్ణాటక కూడా తలనొప్పి అయితే తట్టుకోవడం కష్టమే. అందుకే అధినాయకులిద్దరినీ ‘టిఫిన్’ కు ఒప్పించి ఉంటుంది. అయితే వారిద్దరూ తిన్న ‘టిఫిన్’ అరిగిందో, లేదో ముందు ముందు తెలుస్తుంది. ●

అమెరికా

# ఫిఫా ‘శాంతి’ కపోతం!

**గన్ని మోహన్**

నోబెల్ శాంతిపురస్కారం కోసం తహతహలాడిన అమెరికా అధ్య క్షుడు డొనాల్డ్‌ట్రంప్ కల ఎట్టకేలకు నెరవేరింది. ప్రపంచంలో ఎనిమిది యుద్ధాలను నివారించానని, దీనివల్ల కోట్లాదిమంది ప్రాణనష్టం నివారించగలిగినట్లు చెప్పుకున్న ట్రంప్ శాంతి పురస్కారం అంటూ వస్తే తనకే రావాలని పలు పర్యాయాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. కేవలం ఎనిమిది నెలల్లోనే ఎనిమిది యుద్ధాలునివారించానని, భారత్ పాకిస్థాన్‌ల మధ్య జరిగిన యుద్ధం కూడా తానే జోక్యం చేసుకుని నివారించానని ప్రకటించిన సంగతి తెలిసిందే.శాంతి నెలకొల్పేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టానని అందువల్ల నోబెల్ శాంతిపురస్కారంఅంటూ ఇస్తే తనకే ఇవ్వాల్సి ఉంటుందని కూడా చెప్పుకున్న ట్రంప్ ఆశలు నెరవేరలేదు. అలాగే వైట్‌హౌస్ కూడా శాంతిపురస్కారానికి తమ అధ్యక్షుడు ట్రంప్ అన్నివిధాలా అర్హులని ఈసారి శాంతి పురస్కారం అంటూ వస్తే అమెరికా అధ్యక్షుడికే దక్కాలని వైట్‌హౌస్ మీడియా సెక్రటరీ కూడా విన్నవించారు. అన్నింటికీ భిన్నంగా వెనిజులా ప్రతిపక్ష నేత, వెనిజులా ఉక్కుమహిళగా పేరుపొందిన మరియా కొరినా మచాడోకు దక్కింది. ట్రంప్ లాబీయింగ్ ఎక్కడా పనిచేయలేదు. పైగా నార్వేలోని నోబెల్ కమిటీ కూడా తాము లాబీయింగ్‌లను పరిగణనలోనికి తీసుకోబోమని అయితే ప్రతిపాదనలు ఎండార్స్‌మెంట్లు స్వీకరిస్తామని మాత్రమే ప్రకటించింది. ఇందుకు తగినట్లుగానే ట్రంప్‌నకు శాంతిపురస్కారం ఇవ్వాలంటూ పాకిస్థాన్, ఇజ్రాయెల్, ఆఫ్రికా ఖండంలోని మరికొన్ని దేశాలు ఇంచుమించుగా మొత్తం 15కి పైగా దేశాలు ఎండార్స్‌మెంట్ ఇచ్చాయి. ఇవేమీ పనిచేయలేదు సరికదా ట్రంప్ పేరును కనీసం పరిగణనలోనికి కూడా తీసుకోలేదు.అయితేనార్వేలోని నోబెల్‌కమిటీ పురస్కారాన్ని ప్రకటించకపోయినా ఫిఫా వరల్డ్‌కప్ కమిటీ మాత్రం ఈసారి నోబెల్‌కు శాంతిపురస్కారాన్ని ప్రకటించింది.ఫిఫా ప్రపంచ పోటీల సందర్భంగా కమిటీ ఛైర్మన్‌తన నిర్ణయాన్ని ప్రకటించారు. ప్రపంచదేశాల మధ్య యుద్ధాన్ని నివారించి ఆదేశాల్లో ప్రాణనష్టం జరక్కుండా మధ్యవర్తిత్వం నెరపి ట్రంప్ ఎనలేని కృషిచేసారని అందుకే తాము ఈ ఏడాదినుంచి ప్రవేశపెట్టిన ‘శాంతి’ పురస్కారం మొదటిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌కే ప్రధానం చేస్తున్నట్లు ప్రకటించారు. వాషింగ్టన్ డిసిలోని కెన్నడీ సెంటర్‌లో పోటీల డ్రా సందర్భంగాఫిఫా ట్రోఫీని ఆవిష్కరించారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న ట్రంప్‌ను ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో శాంతిదూతగా అభివర్ణిస్తూ ఈఏడాదిశాంతి బహుమతి ఆయనకే ప్రధానంచేస్తున్నట్లు ప్రకటించారు. ప్రపంచ ఫుట్‌బాల్ కమిటీగా ఉన్న ఫిఫా ఈ ఏడాది నుంచే తొలిసారి శాంతిబహుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఫుట్‌బాల్ ప్రపంచాన్ని ఏకం చేస్తుందని, ఫిఫాకు ఇదొక గుర్తింపుఅని గియానీ చెపుతూ ప్రపంచ శాంతి కోసం అవిరళకృషి చేసిన వారికి తన చర్యలతోప్రపంచాన్ని ఏకంచేసే వారికి ఈబహుమతి ఇస్తామని వెల్లడించారు. ఫిఫాగౌరవంతోపాటు కోట్లాది మంది ఫుట్‌బాల్ అభిమానుల తరపునఈ బహుమతి ప్రధానం జరుగుతుందని ఫిఫాచీఫ్ చెప్పుకొచ్చారు. ఎప్పటిలాగే ట్రంప్‌నకు వ్యతిరేకంగా విమర్శలు వెల్లువెత్తాయి. హ్యూమన్‌రైట్స్ వాచ్ అవార్డు ఎంపికలో పారదర్శకత లేదని, నామినీలు,జ్యూరిసభ్యులు ఎక్కడని ప్రశ్నించింది.యూరోపియన్ యూనియన్‌లోని పలుదేశాల సభ్యత్వం ఉన్న ఫిఫాఫ్రాన్స్ కేంద్రంగా పనిచేస్తుంది. అయితే ప్రస్తుతం స్విట్జర్లాండ్ నగరం జ్యూరిచ్‌కేంద్రంగా పనిచేస్తూ ప్రతిఏటా ప్రపంచకప్ పోటీలు నిర్వహిస్తుంది.ఇక శాంతి నెలకొల్పేందుకు ట్రంప్ చెపుతున్న యుద్ధాలను ఒకసారి పరిగణనలోనికి తీసుకుంటే ప్రస్తుతం కొనసాగుతున్న రష్యా ఉక్రెయిన్ యుద్ధంతోపాటు పాలస్తీనా గాజా ఇజ్రాయెల్ మారణకాండ, కాంగో రువాండాల మధ్య యుద్ధం,థాయిలాండ్ కాంబోడియా, ఆర్మేనియా అజర్ బైజాన్‌ల ఉద్రిక్తతలు, ఈజిప్టు ఇథియోపియాల్లో నెలకొన్న హింస, ఇరాన్, ఇజ్రాయెల్‌ల మధ్య దాడులు, సెర్బియా కొసావోల మధ్య దౌత్యం వంటివి చెపుతుంటారు. నిజానికి ఉక్రెయిన్ రష్యా,పాలస్తీనా గాజా ఇజ్రాయెల్ మినహా ఇతర వివాదాలన్నీ కూడా ఎక్కువశాతం కొన్ని రోజులకే పరిమితం అయ్యాయి. వీటిలోట్రంప్ జోక్యం నిజమే అయినా ఎక్కువశాతం వాటిపై ఆంక్షలు ఉంటాయని, లేదా సుంకాలు విధిస్తామనో, సైనిక చర్యలు తప్పవన్న హెచ్చరికలతోనే దారికి తెచ్చుకున్నట్లు రాజకీయ పండితులు చెపుతుంటారు. వీటిలో ట్రంప్ చెపుతున్న శాంతి కార్యాచరణ ఎక్కడా ఉండదని నయాన్నో భయాన్నో సర్దిచెప్పడం మాత్రమే ఉందని కూడా వారు విశ్లేషించారు. వారు చెపుతున్నట్లుగానే ట్రంప్ పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత ట్రెజరీ నింపే పనిలో పడ్డారు. సుంకాలపై సుంకాలు ఎడాపెడా విధిస్తూ ప్రపంచదేశాల్లో ఆర్థిక కల్లోలం సృష్టించారనే చెప్పాలి. యుద్ధాల విరమణకు ఉద్రిక్తతలు చల్లార్చేందుకు ఈ సుంకాలనే అస్త్రంగా ప్రయోగించారు. ట్రంప్ చెపుతున్నట్లు పాక్, భారత్ యుద్ధం ముగించేందుకు 200శాతం సుంకాలు వేస్తామని హెచ్చరించినట్లు తానే స్వయంగా వెల్లడించారు. సుమారు ఒక 20 పర్యాయాలకుపైగా ట్రంప్ భారత్ పాకిస్థాన్ యుద్ధంపై తానే మధ్యవర్తిత్వం చేసానని ప్రకటించుకున్నారు. అయితే భారత్ ట్రంప్ ప్రకటించిన ప్రతిసారి కూడా ఎవ్వరి జోక్యంలేదని, మూడో దేశం జోక్యం అనుమతించబోమని కూడా స్పష్టంచేసింది. అయినా ఫిఫాశాంతి బహుమతి సమయంలో కూడా మళ్లీ ట్రంప్ అదే పాట పాడారు. ఒక విధంగా చూస్తే ట్రంప్ చేసిన యత్నాలు శాంతి కార్యాచరణ కిందకు రావు. పైగా ఇరాన్ పైజరిపిన అణువిధ్వంసం తెరపైకి వస్తున్నారు. అందుకనే నార్వేనోబెల్ కమిటీ ట్రంప్ పేరును కనీసం పరిగణనలోనికి కూడాతీసుకోలేదు. మొత్తం మీద నార్వే కమిటీ ఇవ్వకపోయినాఫిఫా వరల్డ్ కమిటీ మాత్రం ‘ఫిఫా పీస్‌ప్రైజ్’ పేరిట అవార్డునిచ్చి ట్రంప్ మదిలో చిరకాలంగా దాగి ఉన్న శాంతి కలలను సాకారం చేసింది. ●



ట్రంప్

# విధి నిర్వహణ సరేసరి, హక్కుల మాటేమిటి?



**రామ కిష్టయ్య సంగనభట్ల**

ప్రదిహేడు వందల డెబ్భై రెండులో డిసెంబర్ 7వ తేదీన భారత దేశం లో పోలీసు వ్యవస్థను ఈస్ట్ ఇండియా కంపెనీప్రవేశ పెట్టింది.1857 తిరుగుబాటు తర్వాత బ్రిటిష్ ప్రభుత్వం, 17 ఆగష్టు 1860 నాడు పోలీస్ కమీషన్ ఏర్పాటు చేసింది. పోలీస్ కమీషన్ తన, నివేదికను 3 అక్టోబర్ 1860, నాడు సమర్పించింది.భారతదేశంలోని పోలీసు సంస్థలగురించిన వివరాలను సేకరించడం, పోలీసు వ్యవస్థలో కొన్ని సంస్కరణలను చేయటం, ఉన్న వాటిని అభివృద్ధి చేయటం గురించి సలహాలు ఇవ్వటం ఈ పోలీసు కమీషన్ విధులు. 22వ మార్చి, 1861న పోలీసు నియంత్రణ కోసం ఒక చట్టం అలా ఏర్పడింది. దీని ఆధారంగానే, నేటికీ అమలులో ఉన్న పోలీస్ చట్టం 1861 ఏర్పడింది. శాంతి భద్రతలను సంరక్షిస్తూ, ప్రజల జీవితాలకు,ఆస్తులకూ రక్షణ కల్పిస్తూ, నేరాలు, విధ్వంసాలూ జరగకుండా కాపాడేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన వ్యవస్థ పోలీసు వ్యవస్థ. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేము, బాధ్యత కలిగిన ప్రతి పౌరుడు పోలీసేనన్నది నగ్నసత్యం. అత్యవసర సర్వీసుల చట్టం ప్రకారం క్రమశిక్షణతో పనిచేస్తూ, శాంతి భద్రతలను పరిరక్షించాల్సిన పోలీసు వ్యవస్థలో కానిస్టేబుళ్ల కనీసం ప్రాథమిక హక్కులకు కూడా నోచుకోవడం లేదు. బ్రిటీష్ పరిపాలన అంతమై డెబ్భైఏడు వసంతాలు దాటినా వారు రూపొందించిన పోలీసు వ్యవస్థలో, ఆశించిన స్థాయిలో, ఆధునిక సమకాలీన సమాజ పరిస్థితుల కనుగుణంగా, మౌలిక మార్పులు చోటు చేసుకోకపోవడం శోచనీయం. పెరుగుతున్న జనాభా దృష్ట్యా, ఇన్నేళ్లుగా జరుగుతున్న రిక్రూట్మెంట్ తర్వాతకూడా, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది కూడా తక్కువే. ఉన్న పోలీసు ఉద్యోగులు,వ్యయప్రయాసల కోర్చి అదనపు పని గంటలలో శక్తికి మించి శ్రమిస్తున్నప్పటికీ, వీరి శ్రమకు తగిన ఫలితం లభించకపోగా, పడిన కష్టానికి కనీస గుర్తింపునకు సైతం నోచుకోవడం లేదు. ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగులవలె, పోలీసు సిబ్బందికి కనీస సెలవులు,పండగ సెలవులు కూడా వర్తింపక పోవడాన్ని బట్టి వారి ఇబ్బందులు ఎలా ఉంటాయో ఊహించుకోవచ్చు. ఈ శాఖ సిబ్బందికి కేవలం 15 క్యాజువల్ లీవులు, 15 ప్రత్యేక అనుమతి సెలవులు మాత్రమే ఉంటాయి. అయితే పై అధికారి దయాదాక్షిణ్యాలపై ఈ సెలవులను వాడుకునే అవకాశాలుంటాయి. పోలీసు శాఖ సామర్థ్యం, పనితీరు ఆ శాఖలోని క్రింది స్థాయి ఉద్యోగులైన కానిస్టేబుళ్లు, హెడ్ కానిస్టేబుల్స్ పైననే ఆధార పడి ఉంటుందనేది నగ్నసత్యం. విధి నిర్వహణ లో, ప్రత్యక్షంగా ప్రజలకు అందుబాటులో ఉండే ది వారు. ప్రజల నుండి ఎదురయ్యే ప్రతిఘట నలు, ఛీత్కారాలు, విమర్శలు, ప్రమాదాలూ అనుభవించాల్సిందే వీరే. ఎప్పుడు ఏ విధి నిర్వహణ చేయాల్సి వస్తుందో తెలియని స్థితిలో,ఎక్కడికి వెళ్లా లో, కనీసం కట్టుకున్న ఇల్లాలు, కుటుంబ సభ్యు లకు కూడా చెప్పకుండా వెళ్ళాల్సిన దుస్థితులు అనుక్షణం ఎదురవుతూనే ఉంటాయి. ఎనిమిది గంటల పని దినాలు ఈశాఖ ఉద్యోగులకుఏనాడు వర్తించవు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి, రౌడీలు, గూండాలు, దొంగలు, సాయుధులైన అజ్ఞాతుల తో ప్రాణాలకు తెగించి తలపడడం, రాత్రివేళల్లో ప్రజలంతా గాఢ నిద్రలో ఉన్న సమయంలో వీరు కర్తవ్య నిర్వహణలో భాగంగా మేల్కొని ఉండడం, గాలింపు చర్యల పేరిట అంధకారం లో, కీకారణ్యంలో, చెట్టూ, పుట్టా పట్టుకు తిరగడం అనూహ్య ప్రమాదాలకు గురికావడం పోలీసులకు నిత్యకృత్యమే అవుతున్నది. తమ ప్రాంతానికి ప్రముఖులెవరైనా వస్తే, మారుమూల గ్రామాలకు వారు వెళితే, బందోబస్తులో భాగంగా, గంటల కొద్దీ, ఒకోసారి రోజులముందే ఆ ప్రాంతానికి వెళ్లి, వి.ఐ.పి.లు వచ్చి వెళ్లే వరకూ, రాత్రి, పగలూ తేడా లేకుండా పడిగాపులు గాస్తూ, శ్రమకోర్చి, ఎండా, వానా, చలికి వెరవక ధర్మ నిష్టతో, కార్యదీక్షతో పనిచేసినా, అప్పుడప్పుడూ ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికాక తప్పని పరిస్థితులు ఎదురవడం బాధాకరం. వీటన్నింటికి తోడు అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ సొంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్లను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో,అంకితభావంతో విధులను నిర్వ ర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయ నేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో ‘ధర్మవీర కమిషన్’ సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోక పోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్టపరిరక్షణే ధ్యేయంగా, ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ‘స్వీయ రక్షణే’ నేటి పరిస్థితుల్లోకరవు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలో మమేకమవుతున్నారు. గత తెలంగాణ ప్రభుత్వం పోలీస్ వ్యవస్థ బలోపేతానికి కొంత కృషిచేసింది. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు శాంతి భద్రతల నిర్వహణ కోసం 350కోట్ల రూపాయల నిధులను కేటాయించగా, పోలీసు స్టేషన్లకు పెద్ద మొత్తంలో కొత్తవాహనాలను సమకూర్చిన ఘనత కూడా టిఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కింది. రాష్ట్రంలో ప్రతిపోలీసు స్టేషన్‌కు అధునాతన సౌకర్యాలతో కూడిన వాహనాలు ఉండాలనే ఉద్దేశ్యంతోనే మొత్తం 600టాటా సుమోలు,1600 ఇన్నోవా కార్లు, 1500 మోటారు సైకిల్ కొనుగోలుతో పాటు, ప్రతి నెల పోలీస్ స్టేషన్ నిర్వహణకు, కమిషనరేట్ పరిధిలోని పోలీసు స్టేషన్లకు 75 వేలు, జిల్లా కేంద్రంలోని పోలీసు స్టేషన్లకు 50 వేలు, పట్టణ మండల పోలీసు స్టేషన్లకు 25 వేలచొప్పున నిధులను సమకూర్చి పోలీసు వ్యవస్థను పటిష్టం పరిచారు. ఇటీవల‘హోంగార్డు’లకు జీతభత్యాలను కూడా పెంచింది. పోలీసులకు, వారాంతపు సెలవులను ప్రకటించిన తెలంగాణ ప్రభుత్వం ఆచరణపైదృష్టి సారించలేకపోయింది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవలే పోలీస్ రిక్రూట్మెంట్ చేపట్టింది. ప్రధానంగా ‘మీ వెంటే మేము న్నాం’ అంటూ వారికి అన్ని విధాలా అభయ హస్తం అందిస్తూ,‘మీసంక్షేమమే మాకుముఖ్యం’ అనే భరోసా కలిగిస్తూ, పోలీసుల సంపూర్ణ విశ్వాసాన్ని చూరగొనేలా నూతన రాష్ట్ర ప్రభుత్వం మరిన్ని కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరం అనివార్యంగా ఉంది. ●



> **అధికారుల కనుసన్నలలో మెదులుతూ, వారికి అనుకూలంగా నడుచుకుంటూ సొంత పనులు గాలికొదిలి, అధికారుల పనులను చేయక తప్పని దుస్థితులు వారికి చర్విత చర్వణాలే అవుతున్నాయి. ఇన్ని ఇబ్బందులను, సవాళ్లను ఎదుర్కొని, చిత్తశుద్ధితో, కార్యదీక్షా దక్షతతో,అంకితభావంతో విధులను నిర్వ ర్తించినా, ప్రశంసలూ, అవార్డులు, పురస్కారాలూ, బహుమానాలూ, ఎక్కువగా అధికారులకే దక్కుతాయ నేది నిర్వివాదాంశం. పోలీసు కానిస్టేబులుకు కచ్చితమైన పని గంటలుండాలని, ఎనిమిది గంటలకు మించి పని చేయిస్తే, ఆ శ్రమకు ప్రతిఫలం అందించాలని గతంలో ‘ధర్మవీర కమిషన్’ సూచించారు. అది ఏనాడు అమలుకు నోచుకోకపోవడం విచారకరం. పోలీసు వ్యవస్థలో మార్పు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని కమిషన్లను వేసినా, వాటి సూచనల అమలులో, పాలకులకు చిత్తశుద్ధి లేకపోవడం శోచనీయం. సమాజ రక్షణే ప్రథమ కర్తవ్యంగా, చట్టపరిరక్షణే ధ్యేయంగా, ప్రజా రక్షణకై నిరంతరం శ్రమిస్తున్న పోలీసులు ‘స్వీయ రక్షణే’ నేటి పరిస్థితుల్లోకరవు కాగా, త్యాగశీలులైన రక్షక భటులు తీవ్రవాదులకు టార్గెట్లుగా మారుతూ, అనుక్షణం ప్రమాదం అంచున పయనిస్తూ, విధినిర్వహణలో మమేకమవుతున్నారు.**

# ఇండిగో సంక్షోభంతో ప్రత్యేక రైళ్లు

**ఐదో రోజుకు చేరినా పరిష్కారం కాకపోవడంపై కేంద్రం సీరియస్**

**రద్దయిన విమానాల సంఖ్యను తగ్గించామంటున్న సంస్థ యాజమాన్యం**






## ఇండిగోపై సుప్రీంలో పిటిషన్ దాఖలు

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగోలో తలెత్తిన తీవ్ర సంక్షోభం ఐదో రోజుకు చేరింది. పైలట్ల కొరత, ప్రణాళికా లోపాల కారణంగా వందలాది విమానాలు వరుసగా రద్దు కావడంతో ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో నష్ట నివారణ చర్యలకు ఉపక్రమించిన ఇండిగో, ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి హృదయ పూర్వకంగా క్షమాపణలు చెప్పింది. కస్టమర్లకు చెల్లించాల్సిన రిఫండ్ల ప్రక్రియకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని శనివారం స్పష్టం చేసింది. కార్యకలాపాలను తిరిగి గాడిన పెట్టేందుకు తమ బృందాలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నాయని ఇండిగో తెలిపింది. విమానాల షెడ్యూళ్లను స్థిరీకరించడం, ఆలస్యాన్ని తగ్గించడం, ప్రయాణికులకు పూర్తిస్థాయిలో మద్దతుగా నిలవడంపై ప్రధానంగా దృష్టి సారించాం. నిన్నటితో పోలిస్తే శనివారం రద్దయిన విమానాల సంఖ్యను 850కి తగ్గించగలిగాం. రాబోయే రోజుల్లో ఈ సంఖ్యను మరింత తగ్గిస్తామని భరోసా ఇచ్చింది. ఎప్పటికప్పుడు తాజా సమాచారాన్ని టెర్మినల్స్, వెబ్‌సైట్, నోటిఫికేషన్ల ద్వారా అందిస్తున్నామని, ప్రయాణికులు ఎయిర్‌పోర్ట్‌కు బయల్దేరే ముందు తమ ఫ్లైట్ స్టేటస్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోవాలని సూచించింది. రిఫండ్లకు సంబంధించిన సహాయం కోసం కస్టమర్ సపోర్ట్‌ను సంప్రదించాలని కోరింది. మరోవైపు, ఈ వ్యవహారంపై కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. ఇండిగో యాజమాన్యానికి పలు కఠిన ఆదేశాలు జారీ చేసింది. పెండింగ్‌లో ఉన్న రిఫండ్ల మొత్తాన్ని ఆదివారం రాత్రి 8 గంటల లోపు క్లియర్ చేయాలని అల్టిమేటం విధించింది. ప్రయాణికుల నుంచి వేరుపడిన లగేజీని 48 గంటల్లోగా గుర్తించి, వారి నివాసానికి లేదా వారు కోరిన చిరునామాకు చేర్చాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఈ గడువులోగా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో చిక్కుకున్న ప్రయాణికులకు ఉపశమనం కల్పించేందుకు భారతీయ రైల్వే శాఖ ముందుకు వచ్చింది. ఆకస్మిక రద్దీని తట్టుకునేందుకు దేశవ్యాప్తంగా 37 ప్రీమియం రైళ్లకు అదనంగా 116 కోచ్‌లను జత చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయం ద్వారా మొత్తం 114 అదనపు ట్రిప్పులు అందుబాటులోకి రానున్నాయి. ఇండిగో విమానాలు రద్దు కావడంతో ఇబ్బందులు పడుతున్న వేలాది మంది ప్రయాణికులకు ఊరట లభించనుంది. మొత్తం గా ఇండిగో సంక్షోభాన్ని పరిష్కరిం చేందుకు అటు సంస్థ, ఇటు ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

**ఇండిగోపై సుప్రీంలో పిటిషన్ దాఖలు:** సంక్షోభంలో కూరుకుపోయిన విమానయాన సంస్థ ఇండిగోలో నెలకొన్న సంక్షోభంపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. గత కొన్ని రోజులుగా 1,000కి పైగా విమానాలను ఇండిగో రద్దు చేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంలో తక్షణమే న్యాయస్థానం జోక్యం చేసుకోవాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇండిగో ఆల్ ప్యాసింజర్ అండ్ అనదర్ పేరుతో న్యాయవాది నరేంద్ర మిశ్రా ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. విమానాల రద్దు, తీవ్ర జాప్యం కారణంగా ప్రధాన విమానాశ్రయాల్లో మానవతా సంక్షోభం తలెత్తిందని పిటిషన్‌లో పేర్కొన్నారు. వృద్ధులు, పసిపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారితో సహా వేలాది మంది ప్రయాణికులు ఆహారం, నీరు, విశ్రాంతి సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది పౌరుల జీవించే హక్కు (ఆర్టికల్ 21)కు తీవ్ర విఘాతం కలిగించడమేనని తెలిపారు. పైలట్ల కోసం కొత్తగా ప్రవేశపెట్టిన విమాన డ్యూటీ సమయ పరిమితి ఎఫ్‌డిటిఎల్ నిబంధనల అమలులో ప్రణాళిక లోపం వల్లే ఈ అంతరాయాలు ఏర్పడ్డాయని ఇండిగో బహిరంగంగా అంగీకరించింది. అయితే, ఈ మార్పులను ముందుగా అంచనా వేసి తగిన చర్యలు తీసుకోవడంలో ఇండిగోతో పాటు డీజీసీఏ కూడా విఫలమయ్యాయని పిటిషన్‌లో ఆరోపించారు. ఈ సంక్షోభాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కీలక మార్గాల్లో టికెట్ ధరలను రూ.50,000 వరకు పెంచి ప్రయాణికులను బందీలుగా మార్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ అంశంపై అత్యవసరంగా విచారణ చేపట్టేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. విమానాల రద్దు వల్ల చిక్కుకుపోయిన ప్రయాణికులకు ఇతర విమానాల్లో లేదా రైళ్లలో ఉచితంగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసేలా ఇండిగోను ఆదేశించాలని అభ్యర్థించారు. అలాగే డీజీసీఏ, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమగ్ర నివేదిక సమర్పించేలా ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరారు.

## లాత్వియాలో గంటల్లెక్కన అద్దెకు భర్తలు..

**పురుష జనాభా తగ్గిపోవడమే కారణమంటున్న నిపుణులు**



**లాత్వియా, డిసెంబరు 6:** ప్రపంచంలోని కొన్ని దేశాల్లో నెలకొన్న పరిస్థితులు ఆశ్చర్యం కలిగిస్తుంటాయి. వ్యసనాలతో పురుషజనాభా వారికి తగ్గిపోతుండటంతో జననాలు కూడా కష్టం అవుతున్నట్లు దేశం గుర్తించింది. అలాగే సంతానోత్పత్తి కూడా సంక్లిష్టం అవుతుండటాన్ని దేశం గుర్తించింది. అంతేకాదు ఈ చిన్న ఐరోపా దేశమైన లాత్వియాలో ఇపుడు కొత్తట్రెండ్ జోరందుకుంది. పురుషుల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడంతో అక్కడి మహిళలు వినూత్న మార్గాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా ఇంటి పనుల కోసం భర్తలను గంటల లెక్కన అద్దెకు తీసుకోవడం ఇప్పుడు అక్కడ కొత్తట్రెండ్‌గా మారింది. యూరోస్టాట్ గణాంకాల ప్రకారం లాత్వియాలో పురుషుల కంటే మహిళలు 15.5శాతం ఎక్కువగా ఉన్నారు. ఇది యూరోపియన్ యూనియన్‌లోని ఇతర దేశాల సగటు వ్యత్యాసం కంటే మూడు రెట్లు అధికం. ముఖ్యంగా 65 ఏళ్లు పైబడిన వారిలో ప్రతి ఇద్దరు మహిళలకు ఒక పురుషుడు మాత్రమే ఉన్నాడు. ఈ మగవారి కొరత రోజువారీ జీవితంలో, కార్యాలయాల్లో స్పష్టంగా కనిపిస్తోందని స్థానిక మహిళలు చెబుతున్నారు. సరైన భాగస్వామి దొరక్క చాలామంది మహిళలు విదేశాలకు వెళ్తున్నారని మరికొందరు పేర్కొన్నారు. ప్లంబింగ్, కార్పెంటరీ, రిపేర్లు, పెయింటింగ్, కర్టెన్లు బిగించడం వంటి పనుల కోసం మహిళలు ప్రత్యేక ఏజెన్సీలను ఆశ్రయిస్తున్నారు. కొమాండా24, రెమోంట్ డార్బి. ఎల్వి వంటి సంస్థలు హజ్బెండ్ ఫర్ యాన్ అవర్ (గంటకు ఒక భర్త) పేరుతో ఆన్‌లైన్‌లో సేవలు అందిస్తున్నాయి. ఫోన్ చేసిన వెంటనే నిపుణులైన పురుషులు వచ్చి పనులు పూర్తి చేస్తున్నారు. లాట్వియాలో ఈ పరిస్థితికి పురుషుల ఆయుర్దాయం తక్కువగా ఉండటమే ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. పురుషుల్లో అధిక ధూమపానం (31 శాతం), అనారోగ్యకరమైన జీవనశైలి, ఊబకాయం వంటి సమస్యలు వారి ఆయుష్షును తగ్గిస్తున్నాయి. ఈ రెంట్ ఏ హజ్బెండ్ ట్రెండ్ కేవలం లాత్వియాకే పరిమితం కాలేదు. గతంలో యూకేలో కూడా ఓ మహిళ తన భర్తను ఇలాంటి పనుల కోసం అద్దెకు ఇస్తూ వార్తల్లో నిలిచింది.

## ట్రంప్‌కు ఫిఫా పీస్ ప్రైజ్



**న్యూజెర్సీ, డిసెంబరు 6:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు అరుదైన గౌరవం లభించింది. ఫుట్‌బాల్ క్రీడను పర్యవేక్షించే అంతర్జాతీయ సంస్థ ఫిఫా కొత్తగా ఏర్పాటు చేసిన శాంతి బహుమతిని (పీస్ ప్రైజ్) తొలిసారి ట్రంప్‌నకు ప్రధానంచేసింది. 2026 వరల్డ్ కప్ డ్రా వేడుకలో ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్ఫాంటినో ఈ పురస్కారాన్ని ట్రంప్‌నకు ప్రదానం చేశారు. ప్రపంచవ్యాప్తంగా శాంతి, ఐక్యతను ప్రోత్సహించేందుకు ట్రంప్ చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు ఇస్తున్నట్లు ఇన్ఫాంటినో తెలిపారు. ఈ సందర్భంగా ట్రంప్‌కు బంగారు పతకం, ఆయన పేరుతో ప్రత్యేకంగా రూపొందించిన ట్రోఫీని బహూకరించారు. ఒక నాయకుడి నుంచి మనం కోరుకునేది ఇదే. ప్రజల గురించి ఆలోచించే నాయకుడు కావాలి. ఇది మీ బహుమతి, మీ శాంతి బహుమతి అని ఇన్ఫాంటినో ట్రంప్‌ను ఉద్దేశించి అన్నారు. ఈ పురస్కారం అందుకోవడంపై ట్రంప్ హర్షం వ్యక్తం చేశారు. ఇది తన జీవితంలో లభించిన గొప్ప గౌరవాలలో ఒకటని పేర్కొన్నారు. తన కుటుంబ సభ్యులతో పాటు, వరల్డ్ కప్ సహఆతిథ్య దేశాలైన కెనడా ప్రధాని మార్క్ కార్నీ, మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గాజాలో కాల్పుల విరమణకు ట్రంప్ చేసిన ప్రయత్నాలకు నోబెల్ శాంతి బహుమతి రావాల్సిందని ఇన్ఫాంటినో గతంలో అభిప్రాయపడ్డారు. కాగా, ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి వెనిజులా ప్రతిపక్ష నేత మరియా కొరినా మచాడోకు లభించింది. ఆసక్తికరంగా, ఆ పురస్కారాన్ని ఆమె ట్రంప్‌కు పాక్షికంగా అంకితమిస్తున్నట్లు ప్రకటించారు. కరేబియన్‌లో డ్రగ్స్ పడవలపై దాడులు, వలసదారులపై కఠిన వైఖరి వంటి అంశాలపై ట్రంప్ ప్రభుత్వం విమర్శలు ఎదుర్కొంటున్న తరుణంలో ఈ అవార్డు రావడం గమనార్హం.

## వివాహ వయసు రాకున్నా పరస్పర ఆమోదంతో సహజీవనం సబబే..

**రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు**

**జైపూర్; డిసెంబరు 6:** యువతీయువకుల సహజీవనం విషయంలో రాజస్థాన్ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. వివాహ వయస్సు రాకున్నా సరే యువతీయువకులు మేజర్లయితే పరస్పర ఆమోదంతో సహజీవనం చేయొచ్చని స్పష్టం చేసింది. వివాహ వయస్సు రాలేదన్న కారణంగా రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛా హక్కును కాదనలేమని పేర్కొంది. ఈ మేరకు 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడి సహజీవనం కేసులో కోర్టు ఈ తీర్పు వెలువరించింది. యువకుడికి వివాహ వయస్సు రాలేదన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు తోసిపుచ్చింది. యువతి కుటుంబ సభ్యుల నుంచి హాని ఉందన్న యువకుడి ఆందోళన నేపథ్యంలో ఆ జంటకు రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. యువ జంట రాజస్థాన్ హైకోర్టులో 18 ఏళ్ల యువతి, 19 ఏళ్ల యువకుడు ఓ పిటిషన్ దాఖలు చేశారు. తామిద్దరమూ పరస్పర అంగీకారంతో సహజీవనం చేస్తున్నామని అందులో పేర్కొన్నారు. అయితే, యువతి కుటుంబం దీనిని వ్యతిరేకిస్తూ తమను చంపేస్తామని బెదిరిస్తోందని, తమకు రక్షణ కల్పించాలని యువకుడు కోర్టుకు విజ్ఞప్తి చేశాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదని ఆ జంట ఆరోపించింది. ఈ జంటలో యువకు డికి వివాహ వయస్సు (21 ఏళ్లు) రాలేదని, సహజీవనం కొనసాగించేందుకు అనుమతి ఇవ్వకూడదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోర్టుకు విన్నవించారు. అయితే పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనను కోర్టు కొట్టివేసింది. పెళ్లి వయస్సు రాలేదనే కారణంతో రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కల్పించిన స్వేచ్ఛా హక్కును హరించలేమని పేర్కొంది. భారతీయ చట్టాల ప్రకారం సహజీవనాన్ని నిషేధించలేమని దీనిని నేరంగా కూడా చూడలేమని జస్టిస్ అనూప్ ధండ్ స్పష్టం చేశారు.

## పుతిన్‌మోడీల భేటీపైనే అమెరికా మీడియా ఫోకస్



**వాషింగ్టన్, డిసెంబరు 7:** ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య ఢిల్లీలో జరిగిన శిఖరాగ్ర సమావేశంపై అమెరికాలోని అమెరికా మీడియా ప్రత్యేక ఫోకస్ పెంచింది. రష్యా, పాశ్చాత్య దేశాల మధ్య భారత్ అనుసరిస్తున్న వ్యూహాత్మక సమతుల్యతకు ఈ భేటీ ఒక పరీక్ష అని పేర్కొన్నాయి. ఇంధనం, రక్షణ సంబంధాలు, వాషింగ్టన్ నుంచి వస్తున్న ఒత్తిళ్ల నడుమ ఇరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత బంధం ఈ పర్యటనను ఎలా ప్రభావితం చేసిందో తమ కథనాల్లో వివరించాయి. వాల్ స్ట్రీట్ జర్నల్ తన కథనంలో రష్యా నుంచి తక్కువ ధరకు ముడి చమురు కొనుగోలు చేస్తున్న భారత్‌పై అమెరికా ద్వితీయ శ్రేణి ఆంక్షల ఒత్తిడి పెరుగుతున్న సమయంలో ఈ భేటీ జరిగిందని పేర్కొంది. ఇంధన భాగస్వామ్యంపై ఒత్తిడి ఉన్నప్పటికీ, రష్యా నిరంతరాయంగా ఇంధనాన్ని సరఫరా చేయడానికి సిద్ధంగా ఉందని పుతిన్ హామీ ఇచ్చారని, ఇంధన భద్రత ఇరు దేశాల మధ్య బలమైన అంశమంటూ మోదీ అభివర్ణించారని తెలిపింది. వాషింగ్టన్ పోస్ట్ ప్రకారం ఈ సమావేశం భారత్ విదేశాంగ విధానంలో ఒక కీలక ఘట్టం. ఉక్రెయిన్ శాంతి చర్చల కోసం వాషింగ్టన్ ఒత్తిడి తెస్తున్నప్పటికీ, మాస్కోతో పాత సంబంధాలను కొనసాగించడానికి భారత్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది నిదర్శనమని పేర్కొంది. పుతిన్‌కు మోదీ ఆత్మీయ ఆలింగనంతో స్వాగతం పలకడాన్ని, 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచాలన్న లక్ష్యాన్ని ఈ కథనం హైలైట్ చేసింది. న్యూయార్క్ టైమ్స్ ఇరు నేతల మధ్య ఉన్న వ్యక్తిగత సంబంధాన్ని నొక్కి చెప్పింది. భారత్‌రష్యా మైత్రిని ధ్రువతారతో పోల్చారని గుర్తుచేసింది. చైనాపై అతిగా ఆధారపడ కుండా ఉండేందుకు రష్యాకు భారత్ ఒక ప్రత్యా మ్నాయంగా కనిపిస్తోందని నిపుణుల అభిప్రా యాలను ఉటంకించింది. మొత్తం మీద, అమె రికా మీడియా కథనాలన్నీ ఒకే విషయాన్ని స్పష్టం చేశాయి. భారత్ ఒకే సమయంలో తన ఇంధన ప్రయోజనాలను కాపాడుకుంటూ, వాషిం గ్టన్ ఒత్తిడిని ఎదుర్కొంటూ, మాస్కోతో చారిత్రక సంబంధాలను కొనసాగించడానికి ప్రయత్నిస్తోందని విశ్లేషించాయి.

## హెచ్1బి వీసా దుర్వినియోగంపై కఠిన చర్యలకు డిమాండ్: సెనేటర్ రూబెన్ గాలెగో

**వాషింగ్టన్, డిసెంబరు 6:** అమెరికాలో హెచ్1బీ వీసాల వినియోగంపై మరోసారి తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. అగ్రశ్రేణి టెక్ కంపెనీలు స్థానిక అమెరికన్ ఉద్యోగులను తొలగిస్తూ, వేల సంఖ్యలో విదేశీ నిపుణులను నియమించుకోవడంపై సీనియర్ సెనేటర్ రూబెన్ గాలెగో తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విధానంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు జరపాలని ఆయన ట్రంప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పరిణామం హెచ్1బీ వీసాలపై ఎక్కువగా ఆధారపడే భారతీయ టెక్ నిపుణులపై ప్రత్యక్ష ప్రభావం చూపే అవకాశంఉంది. యూఎస్‌సీఐఎస్ డైరెక్టర్, అటార్నీ జనరల్‌కు రాసిన లేఖలో గాలెగో పలు అంశాలు ప్రస్తావించారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ వృద్ధికి నైపుణ్యం కలిగిన వలసదారులు అవసరమే.కానీ, ఆ కార్యక్రమాలు అమెరికన్ ఉద్యోగులను తొలగించడానికి లేదా వారి స్థానాన్ని భర్తీ చేయడానికి ఒక మార్గంగా మారకూడదని ఆయన స్పష్టంచేశారు. కొన్ని పెద్ద టెక్ కంపెనీలు లక్షలాది మంది స్థానిక ఉద్యోగులను తొలగించాయని, అదే సమయంలో 2025 ఆర్థిక సంవత్సరంలో 30,000 మందికి పైగా విదేశీ నిపుణులకు హెచ్1బీ వీసాలు పొందాయని ఆయన ఆరోపించారు.

## త్వరలో భారత్‌కు 40 వేల 'లైట్ మెషిన్ గన్స్'



**జెరూసలేం, డిసెంబరు 6:** వచ్చే యేడాది ఆరంభంలో దాదాపు 40 వేల లైట్ మెషిన్ గన్స్ (ఎల్‌ఎంజి)ను భారత్‌కు సరఫరా చేయనున్నట్లు ఇజ్రాయెల్‌కు చెందిన రక్షణ పరికరాల సంస్థ ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ (ఐడబ్ల్యుఐ) వెల్లడించింది. వీటితోపాటు దాదాపు 1.70 లక్షల కార్బైన్‌లకు సంబంధించిన ఒప్పందం ఖరారు చివరి దశలో ఉందని తెలిపింది. పిస్టల్స్, రైఫిల్స్, మెషిన్ గన్స్ సహా ఇతర రక్షణ ఉత్పత్తులను మార్కెట్ చేసుకునేందుకు భారత హోం శాఖలోని వివిధ ఏజెన్సీలతో సంప్రదింపులు చేస్తున్నట్లు పిటిఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఐడబ్ల్యుఐ సిఇఒ షుకి స్వాట్జ్ పేర్కొన్నారు. 'గతేడాది చేసుకున్న ఒప్పందం ప్రకారం 40 వేల లైట్ మెషిన్ గన్స్‌ను తొలుత అందించే ప్రయత్నాలు చేస్తున్నాం. ఇప్పటికే పరీక్షలు, తనిఖీలు పూర్తికాగా.. ఉత్పత్తి కోసం లైసెన్స్ పొందాం. వచ్చే యేడాది ప్రారంభంలో తొలి బ్యాచ్‌ను అందించాలని ప్రయత్నిస్తున్నాం. క్లోజ్ క్వార్టర్స్ బ్యాటిల్ ( సిక్యూబి) కార్బైన్స్ టెండర్‌లో భారత్ ఫోర్జ్ ప్రైమరీ బిడ్డర్ కాగా.. తమ సంస్థ రెండో బిడ్డర్. ఈ ఒప్పందంపై సంతకాలు చేసే దశలో ఉన్నాం. ఈ యేడాది చివరి లేదా వచ్చే యేడాది ప్రారంభం నాటికి ఖరారు అవుతుందని ఆశిస్తున్నాం' అని ఐడబ్ల్యుఐ సిఇఒ వెల్లడించారు.

కార్బైన్స్‌కు సంబంధించి 60 శాతం ఆయుధాలను భారత్ ఫోర్జ్ నుంచి, మిగతా నలభై శాతం (1.70 లక్షల ఆయుధాలను) అదానీ గ్రూపు అనుబంధ సంస్థ పిఎల్‌ఆర్ సిస్టమ్స్ సరఫరా చేయనుంది. ఇక ప్రపంచంలోనే తొలి కంప్యూటరైజ్డ్ రైఫిల్ సిస్టమ్ ఆర్బెల్ టెక్నాలజీని భారత్‌కు అందించేందుకు సంబంధిత ఏజెన్సీలతో చర్చలు జరుపుతున్నామని షుకి స్వాట్జ్ పేర్కొన్నారు. యుద్ధ భూమిలో సైనికులు అత్యంత కచ్చితత్వంలో చురుగ్గా వ్యవహరించేందుకు ఇదెంతో ఉపకరిస్తుందన్నారు. ఒప్పందం పూర్తికాగానే ఇజ్రాయెల్‌తోపాటు భారత్‌లోనూ వీటి తయారీ చేపడతామన్నారు.

**ఏమిటీ అర్బెల్ టెక్నాలజీ?:** అర్బెల్ (ఎఆర్‌బిఇఎల్) టెక్నాలజీలో అధునాత సెన్సర్లు ఉంటాయి. రియల్ టైమ్ బాలిస్టిక్ కంప్యూటేషన్, లక్ష్య సముపార్జన సామర్థ్యం ద్వారా సైనికులు లక్ష్యాన్ని కచ్చితత్వంతో ఛేదించగలరు. దానిలో వాడే మైక్రో ఎలక్ట్రో మెకానికల్ సిస్టమ్ (ఎంఇఎంఎస్) అర్గారిథం ద్వారా ఆయుధం సరిగా లక్ష్యాన్ని ఛేదించగలదా లేదా? అని మిల్లీసెకన్లలో అంచనా వేస్తుంది. మొదటి షాట్ తర్వాత షూటర్ ట్రిగ్గర్‌పై వేలు అలాగే ఉంచితే షూటర్ ప్రవర్తనను విశ్లేషించి తదుపరి రౌండ్లను కూడా విడుదల చేస్తుంది.



## భారత్ బంధాలను ఎవరూ వీటో చేయలేరు..

**విదేశాంగ మంత్రి జైశంకర్**

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** ప్రపంచంలో ఏ దేశంతోనైనా సంబంధాలు ఏర్పరచుకునే హక్కు, స్వేచ్ఛ భారత్‌కు ఉన్నాయని విదేశాంగ మంత్రి జైశంకర్ అన్నారు. భారత్ బంధాలను వీటో చేసే అధికారం ఏ దేశానికీ లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచంలో ఒడుదొడుకులు కొనసాగుతున్నా భారత్, రష్యా సంబంధాలు స్థిరంగా ఉన్నాయన్నారు. శనివారం హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో జైశంకర్ మాట్లాడారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో రష్యాతో బంధం కారణంగానే అమెరికా, భారత్‌ల వాణిజ్య ఒప్పందం మరింత క్లిష్టంగా మారిందా? అని విలేకరి ప్రశ్నించారు. ఇందుకు విదేశాంగ మంత్రి బదులిస్తూ వీలైనంత ఎక్కువ దేశాలతో సహకారాన్ని కొనసాగించడం భారత్‌కు ఎంతో కీలకం. ప్రపంచంలో తన స్థానాన్ని బలోపేతం చేసుకునేందుకు ఎవరితో సంబంధాలు కొనసాగించాలని ఎంపి చేసుకునే స్వేచ్ఛ ఉంది. గత 70.80 ఏళ్లుగా ప్రపంచం చాలా ఎత్తుపల్లాలు చూసింది. కానీ, భారత్ , రష్యాల మధ్య బంధం స్థిరంగా కొనసాగుతోంది అని అన్నారు. దౌత్యం అంటే మరొకరిని సంతోషపెట్టడం కాదు అని వ్యాఖ్యానించారు. అమెరికాతో వాణిజ్య చర్చలు కొనసాగుతున్నాయన్నారు. త్వరలోనే ఓ ఒప్పందం కూడా జరుగుతుందన్నారు. భారత్ ప్రయోజనాలకు అనుగుణంగానే ఇది ఉంటుందన్నారు. తమ ప్రభుత్వానికి కార్మికులు, రైతులు, మధ్యతరగతి ప్రజల ప్రయోజనాలే ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాకిస్థాన్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ గురించి ప్రశ్న ఎదురయింది. ఇందుకు జైశంకర్ బదులిస్తూ పాక్ సైన్యంపై విమర్శలు గుప్పించారు. దాని నిజస్వరూపం మనకు తెలుసు. దానివల్లే మన దేశానికి సమస్యలు వచ్చి పడుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆపరేషన్ సిందూర్ గురించి కూడా ఆయన మాట్లాడారు. ఈ క్రమంలో సరిహద్దుల్లో శాంతి కోసం భారత్, చైనా సంబంధాలు కీలకమన్నారు. ఇటీవల ఇరుదేశాల సంబంధాలు బలపడిన విషయాన్ని ప్రస్తావించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు స్వదేశంలో మరణశిక్ష పడిన సంగతి తెలిసిందే. హసీనా అప్పగింతపై ఆయన మాట్లాడుతూ భారత్‌లో ఉండటం ఆమె వ్యక్తిగత విషయమన్నారు.

## భారత్‌లో నివాసం హసీనా వ్యక్తిగతం: జైశంకర్

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో మకాం అనేది ఆమె వ్యక్తిగత నిర్ణయమని, ఆమె దేశానికి రావడానికి దారితీసిన ప్రత్యేక పరిస్థితులే కీలక పాత్ర పోషించాయని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ అన్నారు. శనివారం జరిగిన లీడర్‌షిప్ సదస్సులో ఆయన మాట్లాడుతూ గతేడాది ఆగస్టులో బంగ్లాదేశ్‌లో జరిగిన భారీ హింసాత్మక ఘటనల నేపథ్యంలో, 15 ఏళ్ల పాటు సాగిన షేక్ హసీనా పాలన ముగిసింది. ఆ సమయంలో ఆమె భారత్‌కు పారిపోయి వచ్చారు. ఆమె కోరుకున్నంత కాలం ఇక్కడ ఉండవచ్చా అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ బదులిస్తూ, ఆమె ఒక ప్రత్యేక పరిస్థితుల్లో ఇక్కడికి వచ్చారు. ఆమె భవిష్యత్తు విషయంలో ఆ పరిస్థితులే ఒక ముఖ్యమైన అంశం. అంతిమ నిర్ణయం ఆమెనే తీసుకోవాలని వివరించారు.

## పుతిన్ విందుకు శశిథరూర్‌కు ఆహ్వానం: కాంగ్రెస్ మండిపాటు



**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** భారత్ పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు రాష్ట్రపతి భవ్‌లో విందు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. దీనికి ప్రతిపక్షంలోని రాహుల్, మల్లికార్జునఖర్గేను ఆహ్వానిం చకుండా, శశిథరూర్‌ను పిలవడంపై పెద్దఎత్తున చర్చజరుగుతుంది. ఈ విందులో పాల్గొనేందుకు థరూర్ అంగీకరించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కాంగ్రెస్ నేత పవన్‌ఖేడా విమర్శించారు. మా నాయకులను ఆహ్వానించలేదు. వాళ్లు ఎందుకు మాతో ఆటాడుతున్నారని అడగాలనుకుంటున్నా ఎవరో ఆడుతున్న ఆటలో మేము ఎందుకు భాగం కావాలి అని ప్రశ్నించారు. ప్రతి ఒక్కరికీ మనస్సాక్షి ఉంటుం దని వ్యాఖ్యానించారు. ఖేడా వ్యాఖ్యల నేపథ్యంలో ఎంపి మనోజ్ తివారీ మండిపడ్డారు. పుతిన్‌కు ఇచ్చే విందుకు థరూర్‌ను ఆహ్వానిస్తే కాంగ్రెస్‌కు సమస్య ఏంటని ప్రశ్నించారు. ఏ ప్రాతిపదికన ఆహ్వానం అం దిందని తనకు తెలియదని థరూర్ అంతకుముందు అన్నారు. ప్రతిపక్ష నాయకులను ఆహ్వానిం చకపో వడం సరైనది కాదని, అయితే తాను విందుకు హాజరవుతానని చెప్పారు.

## డీప్‌ఫేక్‌ను నియంత్రించేలా లోక్‌సభలో బిల్లు

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** ప్రస్తుత కృత్రిమమేధ యుగంలో చాలా మంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ కూడా ఒకటి. ఈ డీప్‌ఫేక్ నియంత్రణకు సంబంధించిన బిల్లు లోక్‌సభ ముందుకు వచ్చింది. ఇలాంటి కంటెంట్ కట్టడకి అవసరమైన లీగల్ ఫ్రేమ్‌వర్క్‌ను రూపొందించేలా ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రతిపాదించారు. శివసేన ఎంపి శ్రీకాంత్ షిండే ఈ డీప్‌ఫేక్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇలాంటి కంటెంట్ రూపొందించేందుకు వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి చేయాలన్నారు. వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం పెరిగిపోయింది.

## సంక్షిప్తంగా..

### ఒక్క చెన్నై జిల్లాలోనే 15 లక్షల ఓట్ల తొలగింపు?



**చెన్నై, డిసెంబరు 6:** తమిళనాడులోని చెన్నై జిల్లాలో సుమారు 15లక్షల ఓట్లు తొలగించనున్నట్లు సమా చారం. చెన్నై జిల్లా పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పనులు గతనెల 4న ప్రారంభించారు. 3,718 మంది పోలింగ్ స్టేషన్ అధికారులను నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జి, పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో, లెక్కింపు ఫారాలు పొందే అంశంపై గురువారం స్థానిక రిప్పన్ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డిఎంకె, ఎండిఎంకె, బిజెపి,కాంగ్రెస్, సిపిఎం సహా 12 గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ చెన్నై జిల్లాలోని 40.04 లక్షల ఓటర్లలో 39.59మందికి లెక్కింపు ఫారాలు అందజేశామన్నారు. వారిలో 22.79లక్షల మంది నుంచి ఫారాలు పొందామని తెలిపారు. వారిలో 2.23లక్షల మంది రెండు ఓట్లు కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు.

### నేషనల్ హెరాల్డ్ కేసులో కర్ణాటక డిప్యూటీ సిఎంకు నోటీసులు




**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు నేషనల్ హెరాల్డ్ కేసులో మరోసారి ఉచ్చు బిగుస్తోంది. ఈ కేసుకు సంబంధించి ఆర్థిక నేరాల విభాగం (ఈవోడబ్ల్యూ) పోలీసులు ఆయనకు నోటీసులు జారీ చేశారు. కేసులోని కొన్ని ఆర్థిక విషయాలు, లావాదేవీలపై వివరణ ఇవ్వాలని నోటీసులో కోరారు. విచారణకు హాజరు కావాలని కూడా ఆదేశించినట్లు తెలుస్తోంది. నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంబంధించిన ఆర్థిక వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో ఈ కేసు నడుస్తోంది. ఇప్పటికే ఈ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ సహా పలువురు విచారణ ఎదుర్కొన్నారు. ఇదే కేసులో ఇపుడు డీకే శివకు మార్‌ను ఈడీ, సీబీఐ వంటి దర్యాప్తు సంస్థలు ప్రశ్నించాయి. తాజాగా ఆర్థిక నేరాల విభాగం పోలీ సులు పంపిన నోటీసులతో ఈ కేసు మరోసారి తెరపైకి వచ్చింది.

### టేకాఫ్ అవుతున్న విమానంలో మంటలు


**బ్రాసిలియా, డిసెంబరు 6:** బ్రెజిల్ లోని గ్వారుల్హోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పెను ప్రమాదం తప్పింది. రన్ వే పై టేకాఫ్ కు సిద్ధమైన విమానంలో మంటలు చెలరేగాయి. వెంటనే అప్రమత్తమైన విమానాశ్రయ సిబ్బంది.. ప్రయాణికులను కిందకు దించేసి మంటలను ఆర్పివేశారు. ఆ సమయంలో విమానంలో 180మంది ఉన్నారని, అయితే ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని అధికారులు తెలిపారు. లాటమ్ ఎయిర్‌లైన్స్ కు చెందిన ఎయిర్ బస్ ఏ320 విమానం 180 మంది ప్రయాణికులతో టేకాఫ్ అయ్యేందుకు సిద్ధమైంది. ఇంతలో క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. విమానం నుంచి పెద్దఎత్తున మంటలు, పొగ వెలువడ్డాయి. ప్రయాణికులను సిబ్బంది దించేయగా, ఫైరింజన్లతో రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. కాగా, విమానంలో మంటలు చెలరేగలేదని, లగేజీ ఎక్కించే లోడర్‌లో అగ్నిప్రమాదం జరిగిందని లాటమ్ ఎయిర్‌లైన్స్ ఓ ప్రకటనలో వెల్లడించింది.

### ఆసిమ్ మునీర్‌ను అరెస్టు చేయాల్సింది: మైఖేల్ రూబిన్



**వాషింగ్టన్, డిసెంబరు 6:** పాకిస్థాన్‌తో అమెరికా సంబంధాలపై పెంటగాన్ (అమెరికా రక్షణ వ్యవహారాల కేంద్రం) మాజీ అధికారి మైఖేల్ రూబిన్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత జులైలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్‌లకు అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ అధికారిక నివాసంలో ఆతిథ్యం ఇవ్వడాన్ని రూబిన్ తప్పుబట్టారు. పదే పదే అంతర్జాతీయ నియమాలను ఉల్లం ఘిస్తూ ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తుందని ఆరోపణలు ఎదుర్కొంటున్న దేశంతో అమెరికా వ్యవహరిస్తున్న తీరు సరిగాలేదన్నారు. పాకిస్థాన్‌ను వెంటనే ఉగ్రవాద దేశంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆసిమ్ మునీర్ కు ఆతిథ్యం ఇవ్వడం కాదు, అరెస్టు చేసి ఉండాల్సిందని రూబిన్ పేర్కొన్నారు.

### 'ఇండియా' కూటమి వెంటిలేటర్‌పై ఉంది: ఒమర్ అబ్దుల్లా



**శ్రీనగర్, డిసెంబరు 6:** బీహార్ సిఎం నితీశ్ కుమార్‌ను మళ్లీ ఎన్డీయే వైపు తామే నెట్టేసినట్లు అనిపిస్తోందని జమ్మూకశ్మీర్ సిఎం, ఎన్సి నేత ఒమర్ అబ్దుల్లా అన్నారు. ఇండియా కూటమి పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుందని వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికల అనంతరం పరిస్థితి మరింత దిగజారిం దన్నారు. ఎన్నికల్లో బిజెపి పోరాడే తీరుపై ప్రశంసలు కురిపించారు. అయితే తనకు ఆ పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేదని, బిజెపి రాజకీయాలను వ్యతిరేకిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. ఇండియా కూటమి కోసం గతంలో నితీశ్‌కుమార్ చేసిన ప్రయత్నాలను ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు.

# ఎపి షార్ట్ ఫిలిం ఫెస్టివల్ విధి విధానాలు



మీడియాతో మాట్లాడుతున్న దిలీప్ రాజా తదితరులు

**గుంటూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఔత్సాహిక యువతీయువకులకు ప్రోత్సహకరంగా జనవరి 4 న తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ఎంతో ప్రతిష్టాత్మగా ఎలాంటి ప్రవేశ రుసుం లేకున్డా నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ విధి విధానాలను పోటీలను నిర్వహిస్తున్న ఖిమాఎపిఖి సంస్థ విడుదల చేసింది. ఈ మేరకు పోటీల కన్వీనర్,సినీ దర్శకుడు దిలీప్ రాజా స్థానిక మాఎపీఖి కార్యాలయంలో శనివారం మీడియాతో మాట్లాడారు. నియమ నిబంధనలు తెలియ చేశారు. న్యాయపరమైన వివాదాలు రాకుండా కథ తన స్వీయ రచన అని, ఎక్కడనుండి కాపీ చేయలేదని రచయిత ధృవీకరణ పత్రాన్ని పోటీల్లో పాల్గొనే సంస్థలు పంపిం చాలన్నారు. కాపీ రైట్ ఉన్న మ్యూజిక్ ట్రాక్స్ ని షార్ట్ ఫిల్మ్ లో రీ రికార్డింగ్ కు ఉపయోగించితే తదుపరి పరిణామాలకు ఆయా ప్రొడక్షన్ యూనిట్లే భాద్యత వహించవలసి ఉంటుందని దిలీప్ రాజా వివరించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజన్స్ ద్వారా రీ రికార్డింగ్ మ్యూజిక్ పొందవచ్చని ఆయన సలహా ఇచ్చారు.

చట్టపరమైన సమస్యలు తెచ్చుకోవద్దని ఆయన హితవు పలికారు . గతంలో యూట్యూబ్, ఇన్స్టాగ్రామ్ , సోషల్ మీడియాలో ప్రసారం చేసిన షార్ట్ ఫిల్మ్ లు ఈ పోటీలకు అనర్హతగా ప్రకటించడమైనదన్నారు. షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ కో కన్వీనర్ దర్శకుడు అచ్చన శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ 15 నిమిషాల నిడివి మించకుండా పెన్ డ్రైవ్ ద్వారా వ్యక్తిగతంగా కానీ రిజిస్టర్ పోస్టులోగానీ మాఎపి కార్యాలయం,ఆలపాటి నగర్, సుల్తానాబాద్ ,

తెనాలి 522 202, గుంటూరు జిల్లా చిరునామాకు ఈనెల 25 లోగా పంపించవలస్నిదిగా ఆయన తెలిపారు.

## పరకామణి చోరీ అంశంలో రాజీ చేయడాన్ని వ్యతిరేకించాం

### - బిజెపి రాష్ట్ర చీఫ్ పివిఎన్ మాధవ్

**విజయవాడ,డిసెంబరు 5,పభాతవార్త ప్రతినిధి:** పరకామణి చోరీ అంశంలో రాజీ చేయడాన్ని వ్యతిరేకించినట్లు ఏపీ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. దేవుడి సొత్తు విషయంలో రాజీ చేయడం సరికాదని పేర్కొన్నారు. పరకామణి చోరీ కేసు విచారణను జగన్ స్వాగతించాలని కోరారు. ఈ వ్యవహారంలో సీసీ పుటేజ్ ఎలా తొలగించారో బయటకు రావాలని పేర్కొన్నారు. కల్తీ నెయ్యి,పరకామణి ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరగాలన్నారు. జగన్ ప్రభుత్వంలో చేసిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ధర్మం కోసం మాత్రమే తితిదే నిధులు కేటాయించాలని కోరారు.

## విద్యుత్ చార్జీల తగ్గింపునకు సౌరవిద్యుత్ ఉపయోగపడాలి : సిపిఎం బాబురావు



**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** పెద్ద పెద్ద కంపెనీలు, ఫ్యాక్టరీలకు మేలు చేసి...సామాన్యులపై భారాలు వేసేలా సోలార్, ఇతర సంప్రదాయే తర విద్యుత్తు విధివిధానలు రూపొందించడం దారుణమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు పేర్కొన్నారు. కాలుష్య నివారణకు విద్యుత్ ఛార్జీల తగ్గింపునకు సౌరవిద్యుత్తు ఉపయోగపడాలన్నారు. అటువంటి ప్రభుత్వ విధానాల కారణంగా ప్రజలపై భారం పడేలా ఉండకూడదన్నారు. కేంద్రం వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్తును అందించే కుసుమ్ 3 పథకం టారిఫ్‌పై బాబురావు ఒక ప్రకటన విడుదల చేసారు.. సెకీ ద్వారా అదానీ సంస్థ నుంచి 7వేల మెగావాట్ల విద్యుత్తును యూనిట్‌కు రూ.2.49 చొప్పున కొనుగోలు చేయడం భారమని విమర్శలుండగటా, వ్యవసాయ పంపుసెట్లకు వినియోగించే విద్యు త్‌ను రూ.3.18 చొప్పున కొనాలని ప్రభుత్వం ప్రతిపాదించడం దుర్మార్గమన్నారు. పారదర్శకంగా అన్ని సంస్థలూ పోటీలో పాల్గొనే అవకాశం లేకుండా ఎంపిక చేసిన సంస్థలకే టెండర్‌లో పాల్గొనే అవకాశం కల్పించడం తగదన్నారు. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం 17 నెలల్లోనే రూ.23,884 కోట్ల భారాలు మోపిందని దుయ్యబట్టారు. మిగులు విద్యుత్ పేరుతో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిపివేస్తున్నారని అయినా ఫిక్స్‌డ్ ఛార్జీల పేరుతో ఆ భారం వినియోగదారులపై మోపుతున్నారని దుయ్యబట్టారు. ప్రజా ప్రతినిధుల అండ ఉన్న కంపెనీల నుంచి సౌర విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని..కంపెనీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు కుమ్మక్కై వినియోగదారులపై సోలార్ భారం పెంచుతున్నారన్నారు.

# పోలీస్ వృత్తి సమాజ రక్షణ

### - తిరుపతి ఎస్పీ సుబ్బరాయుడు



**తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** ఒంటిపై ఖాకీయూనిఫామ్ ధరించి పోలీస్ వృత్తి సమాజ రక్షణబాధ్యతతో కూడిన పవిత్రసేవగా భావించాలని , ఆవిషయం గుర్తుపెట్టుకోవాలని తిరుపతి జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు సూచించారు. ప్రజలకు సేవచేయడం ఒకవరమని, ప్రజలు కూడా మన కుటుంబసభ్యులే అనే భావనతో పనిచేయాలన్నారు. క్రమశిక్షణ పోలీసుశాఖలో ప్రతి అధికారికి ప్రాణం వంటిదన్నారు. అనంతపురం రేంజి పరిధిలో తిరుపతి జిల్లాకు కేటాయించబడిన నూతన ప్రొబేషనరీ ఎస్ఐలకు పోస్టింగ్‌లిచ్చే కార్యక్రమం శనివారం పోలీస్అతిధిగృహంలో చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు నూతన ఎస్ఐలకు దిశానిర్ధేశం చేశారు. తిరుపతి పుణ్యక్షేత్రమని,యాత్రాస్థలమని ఇక్కడ విధి నిర్వహణ ఎంతో పుణ్యంగా భావించాలన్నారు. పోలీస్‌శాఖలో కొత్తగా నియమితులైన ఎస్ఐలతో విధి నిర్వహణ పట్ల అనుసరించాల్సిన విధానాన్ని స్పష్టంగా తెలిపారు. విధుల్లో క్రమశిక్షణ, సమయపాలన, నిబద్ధత, నైతికవిలువలు తప్పనిసరి అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే సేవలో చిన్నపాటి నిర్లక్ష్యం కూడా పెద్ద సమస్యకు దారితీసే అవకాశం ఉందని తెలిపారు. ప్రతి ఎస్ఐ బాధ్యతగా వ్యవహరించి ప్రజలకు సేవచేయాలన్నారు.

## మున్సిపల్ చైర్మన్ సహా వైఎస్సార్సీ సభ్యులను కార్యాలయంలో ఉంచి తాళాలు వేసిన కూటమి సభ్యులు

ప్రధాన సమస్యపై చర్చ లేకుండా వాయిదా వేసినందుకే..

**నరసాపురం ప్రభాతవార్త:** నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శనివారం ఆద్యంతం ఉద్రేకంగా సాగింది. సమావేశం ప్రారంభం నుండి పలు గొడవలు బయటాయింపులు చివరకు ఆఫీసుకు తాళాలు వేసేంతవరకు వెళ్ళింది. కమిషనర్ చెబుతున్న సమాధానాలు సరిగా లేవని ఆయన అన్ని అబద్ధాలే చెబుతున్నారని మున్సిపాలిటీ చివరకు ప్రతి వీధి కూడా కంపోస్ట్ యార్డ్ గా మారిపోయాయని చైర్పర్సన్ బి వెంకటరమణ సభ్యులు ఎస్ సురేష్ వి శ్రీనివాస్ కొత్తపల్లినానీ కోటిపల్లి సురేష్ తదితరులు నిరసన వ్యక్తం చేసారు. కమిషనర్ను గవర్నమెంట్ కు సరెండర్ చేయాలని సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేసి పంపాలని బర్రె జయరాజు సూచించారు. బాక్స్ టెండర్ల రూపంలో కమిషనర్ లక్షలాది రూపాయలు దుర్వినియోగం చేశారని పలువురు సభ్యులు ఆరోపించారు. ప్రజాధనాన్నిఈ విధంగా ఖర్చు చేసేస్తే ఇక కౌన్సిల్కు ఏమి విలువ ఉంటుందని నిలదీశారు. బాక్స్ టెండర్ల విషయంలో సభ్యులు కేసరి గంగరాజు వన్ ఎం రెడ్డి శ్రీనివాస్ మధ్య తీవ్ర వివాదం జరిగింది. తనను అవమానకరంగా మాట్లాడార ని ఆరోపిస్తూ గంగరాజు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంలో వైకాపా సభ్యులు పోడియం ముందు బైఠాయించారు. కంపోస్ట్ యార్డ్ సమస్యను దాటవేస్తూ తీర్మానం చేయకపోవడం పట్ల కూటమి సభ్యులు మెయిన్ గేటుకు తాళాలు వేశారు. సభ్యులు లోపల ఇరుక్కుపోయారు. కూటమి సభ్యుల చర్యలను చైర్ పర్సన్ సహా వైకాపా సభ్యులుమీడియా సమావేశంలో ఖండించారు.

## కాలానికనుగుణంగా వ్యాపార ప్రణాళికలు రూపొందించుకోవాలి :ఆచార్య మాధురి పరదేశి



**తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:** మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థినులు కొత్తగా వ్యాపార ప్రణాళికలను రూపొందించుకోవడం ద్వారా వ్యాపారాన్ని ప్రారంభించే అవకాశం కలుగుతుందని పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య మాధురి పరదేశి తెలిపారు. విద్యపరిశోధన వంటి అంశాలకు అన్వయించు కోవచ్చని తెలిపారు. విద్యార్థినులు కొత్త ఆలోచనలతో వినూత్నంగా వ్యాపారంలో రాణించాలన్నారు. పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ,ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆద్వర్యంలో శనివారం ఇన్నోవేటివ్ ఆలోచనలపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐఐసి సభ్యులు డాక్టర్ వై.అనిత,డాక్టర్ సువర్ణలత పాల్గొన్నారు.

## ఎపి ఎంపిలంతా ప్రధాని నరేంద్ర మోడీ మెప్పు కోసం పనిచేస్తున్నారు : పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఎంపీలు రాష్ట్ర ప్రయోజనాలను పక్కనపెట్టి, ప్రధాని నరేంద్ర మోదీ మెప్పు కోసం పనిచేస్తున్నారని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆరోపించారు.విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడుతూ పార్లమెంటులో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై నోరు మెదపకుండా, బీజేపీకి బినామీలుగా, మోదీ చేతిలో కీలుబొమ్మలుగా మారారని ఆమె తీవ్ర ఆరోపణలు చేశారు. శీతాకాల పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ఎంపీల వైఖరిపై ఆమె మండిపడ్డారు. షర్మిల స్పందిస్తూ, “రాష్ట్ర విభజన జరిగి 11 ఏళ్లు గడిచినా, విభజన హామీలు ఇప్పటికీ నెరవేరలేదు. పార్లమెంటులో మన ఎంపీలు బుద్ధిమంతుల్లా కూర్చుంటున్నారు. మోదీ మాట్లాడితే చప్పట్లు కొట్టడానికి పోటీ పడుతున్నారు. వారికి రాష్ట్ర ప్రయోజనాల కన్నా సొంత ప్రయోజనాలే ముఖ్యమయ్యాయి. పేరుకు వేర్వేరు పార్టీల ఎంపీలు అయినా, వారంతా బీజేపీకి రబ్బర్ స్టాంపుల్లా మారిపోయారు. బీజేపీ ప్రవేశపెట్టే బిల్లులకు గొర్రెల్లా తలలూపడం తప్ప వారికి ఏమీ చేతకావడం లేదు“ అని విమర్శించారు. విభజన హామీలను ప్రజలకు ఇచ్చిన చెక్కుతో పోల్చిన షర్మిల, “2014 నాటికే విభజన హామీల విలువ రూ. 5 లక్షల కోట్లు. ఆ చెక్కు మన చేతిలో ఉన్నా, దాన్ని ఎన్‌క్యాష్ చేసుకోలేని దుస్థితిలో ఉన్నాం. పోలవరం ఎత్తును 41 మీటర్లకే పరిమితం చేస్తున్నా, అమరావతికి కేంద్రం సాయం చేయలేదని పార్లమెంటరీ కమిటీ చెప్పినా, మన ఎంపీలు మౌనంగా ఉండి గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతున్నారు“ అని ఎద్దేవా చేశారు.“రాష్ట్రంలో 25 మంది లోక్‌సభ, 11 మంది రాజ్యసభ సభ్యులు ఉన్నారు... మీరు నిజంగా తెలుగు బిడ్డలే అయితే, మీలో ప్రవహించేది తెలుగువాడి రక్తమే అయితే, మీకు ఓట్లు వేసిన ప్రజల మీద కృతజ్ఞత ఉంటే,



ఇప్పటికైనా విభజన హామీలపై నోరు విప్పండి. ప్రధాని మోదీ మోసాలను పార్లమెంటు వేదికగా నిలదీయండి“ అని కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు. పోలవరం జాతీయ హోదా కలిగిన ప్రాజెక్ట్ పోలవరాన్ని ప్రాజెక్ట్ కాస్త రిజర్వాయర్ గా మార్చారు గ్రావిటీ ప్రాజెక్ట్ ను లిఫ్ట్ ఇరిగేషన్ చేశారని ఈ మీడియా సమావేశంలో షర్మిల ఆరోపించారు. 45 మీటర్ల నుంచి 41 తగ్గిస్తే ఒక్క ఎంపీ కూడా మాట్లాడటం లేదు.

## కాపులకు 12శాతం రిజర్వేషన్లివ్వాలి: కెఆర్‌పిఎస్ డిమాండ్

**విజయవాడ, డిసెంబర్ 6, ప్రభాతవార్త :** బిసిలకు, ఈడబ్ల్యుసి లోని ఓసిలకు ఇబ్బంది లేకుండా కాపు, బలిజ, తెలగ, ఒంటరి కులాలవారికి విద్య. ఉపాధి, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టులు, నామినేటెడ్ వర్కుల్లో సత్వరం రిజర్వేషన్లు కల్పించాలని కె.అర్.పి.యస్ రాష్ట్ర చైర్మన్ చనమల్ల ప్రసాదరావు, రాష్ట్ర వర్కింగ్ చైర్మన్ మాసాబత్తుల శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. మా జనాభా ప్రకారం వాటా మాకు ఇవ్వాలి. బి.సి.లకు స్థానిక సంస్థలలో 34 రిజర్వేషన్లు కల్పిస్తామంటూ కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీ వెంటనే అమలు చేయాలన్నారు. టి.డి.పి. 2014 మేనిఫెస్టోలో ఒకసారి బి.సి.(ఎఫ్) ద్వారా 5 కాపులకు రిజర్వేషన్లని, మరొక సారి టి.డి.పి.

ప్రభుత్వం వారు మోసం చేయడంతో 2019 ఎన్నికలలో టి.డి.పి. ఓడి పోయిందన్నారు.

## జాతీయ రహదారి-65పైనే రోడ్డు ప్రమాదాలు అధికం

### 58 శాతం ప్రమాదాలు, 41 శాతం మరణాలు చోటు చేసుకుంటున్నాయి : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



రహదారి భద్రత కమిటీ (డి ఆర్ ఎస్ సి) సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ,విజయవాడ పోలీసు కమీషనర్ రాజేంద్రబాబు

**విజయవాడ, డిసెంబరు 6.ప్రభాతవార్తప్రతినిధి:** జాతీయరహదారి -65పై ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఏపీ రాజధాని ప్రాంత హెడ్ క్వార్టర్ డిస్ట్రిక్ ఎన్టీఆర్ జిల్లా రహదారి భద్రత కమిటీ (డి ఆర్ ఎస్ సి) సమావేశం వెల్లడింది.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీ ్మశ మాట్లాడుతూ గతేడాది కంటే ప్రమాదాలు, మరణాల సంఖ్య తగ్గిందన్నారు.ఎక్కువగా ద్విచక్ర వాహనాల వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రహదారులపై వేగ పరిమితులు తెలిపే సైన్ బోర్డులు ఏర్పాటు చేయడం కీలకమన్నారు.ఓవర్ లోడింగ్ వాహనాలపై చర్యలు చేపట్లాన్నారు. 2026 లో రోడ్డు ప్రమాద మరణాలను బాగా తగ్గించాలన్నారు...కొన్ని ప్రాంతాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు..ఐదు పోలీస్ స్టేషన్ల పరిధిలోనే అధిక రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులలో శిక్షలు పడేలా చూడాలన్నారు. స్థానిక కలెక్టరేట్లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ (డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ) సమావేశంలో విజయవాడ పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు తో కలసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ జి. లక్షి ్మశ మాట్లాడుతూ..2024లో రోడ్డు ప్రమాదాల సంఖ్య 1343 ఉండగా, ఈ సంవత్సరంలో 918 కి తగ్గిందని చెప్పారు. మరణాలలోనూ తగ్గుదల కనిపించిందని, 432 నుంచి 317 కి తగ్గాయని తెలిపారు. వివిధ శాఖలు సమన్వయంతో కలిసి చేపట్టిన చర్యల వల్ల ఈ పురోగతి సాధ్యమైందన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల మధ్య అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో మూడోవంతు ప్రమాదాలు, మరణాలు ద్విచక్ర వాహనాల వల్లే జరుగుతున్నాయని చెప్పారు. జాతీయ రహదారిలో ఎన్ హెచ్ 65 లో 58 శాతం ప్రమాదాలు, 41 శాతం మరణాలు చోటు చేసుకుంటున్నాయని తెలిపారు. రహదారులపై వేగ పరిమితులను (స్పీడ్ లిమిట్స్) తెలిపే సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఓవర్ లోడ్ తో వెళుతున్న వాహనాలను నియంత్రించాలని, సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలలో బాధితులను రక్షి ంచిన వారిపై (గుడ్ సమారిటన్) ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయరని, పోలీసు విచారణ పేరిట ఇబ్బందులు ఉండవని చెప్పారు. అలాంటి ప్రాణదాతలను సత్కరించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. రహదారి ప్రమాదాల నివారణలో ఎన్జీవోలు భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ... భవానిపురం, ఇబ్రహీం పట్నం, పటమట, కంచికచర్ల, కృష్ణలంక పోలీస్ స్టేషన్ల పరిధిలో అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెప్పారు. బస్టాండ్, బెంజ్ సర్కిల్, రామవరప్పాడు మొదలైన ప్రాంతాలలో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఏర్పాటు చేయాలన్నారు. తరచూ ప్రమాదాలు సంభవించే బ్లాక్ స్పాట్స్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. పౌరులకు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చేయడానికి కొత్త యాప్ ను తీసుకొస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ బైపాస్ అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయన్నారు. రోడ్డు ప్రమాదాలలో మృతి చెందిన వారిలో ద్విచక్ర వాహనదారులు 202 మంది ఉన్నారన్నారు.

# అమెరికాలో హెచ్ 1 బి వీసాలపై ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులకు భరోసా కల్పించాలి

### - మంత్రి నారా లోకేష్‌కు సిపిఎం శ్రీనివాసరావు లేఖ

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్తప్రతినిధి:** అమెరికాలో హెచ్ 1 బి వీసాలపై ఉంటున్న ఉద్యోగులు, ఇతర విద్యార్థులకు భరోసా కల్పించేందుకు విద్యా శాఖ మంత్రి లోకేష్ పర్యటన దోహదపడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఈ మేరకు నారా లోకేష్‌కు వి.శ్రీనివాసరావు బహిరంగ లేఖ రాశారు. నేటి నుండి 10వ తేదీ వరకు మంత్రి లోకేష్ అమెరికాలో పర్యటించనున్నట్లు మీడియా ద్వారా తెలుసుకున్నానన్నారు. తెలుగువారి నుండి పెట్టుబడులు ఆహ్వానించనున్నట్లు ప్రకటించారు.. మంచిదే.. కానీ అదే అమెరికాలో నేడు లక్షలాది మంది తెలుగు (ప్రత్యేకించి మన రాష్ట్రానికి చెందినవారు) వారు ఐటి తదితర ఉద్యోగాలు చేస్తున్నవారు, చదువు(ఎంఎస్) కుంటున్నవారు అభద్రతా భావంతో జీవిస్తున్నారని లేఖలో వివరించారు. వారికి ఉద్యోగ భద్రత, జీవన భద్రత కోసం అమెరికా ప్రభుత్వంతో కూడా మాట్లాడాలని కోరుతున్నా నన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు గారిని అరెస్టు చేసిన సందర్భంలో మొదటగా గళమెత్తినవారు వీరేనని గుర్తు చేశారు. 2024 ఎన్నికల్లో కూడా సెలవులు పెట్టి టిడిపి పార్టీ విజయం కోసం కృషి చేశారని.. అలాంటి వారు నేడు మీ నుండి తగిన భరోసా, స్పందన రాక బాధతో ఉన్నారని తెలిపారు. నిత్యం జెన్‌జెడ్ లేదా యువతరం, ఐటి అంటూ మాట్లాడే ప్రధాని మోడీ ఒక్కసారి కూడా ఈ సమస్యపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడలేదు.. కనీసం అమెరికా ప్రభుత్వంతో సంప్రదించలేదు.. అని చెప్పారు. నేడు అనేక పెద్ద ఐటి కంపెనీలు (గూగుల్, మైక్రోసాఫ్ట్, ఐబియం, మెటా, అమెజాన్ తదితర) వేల సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయన్నారు. టిఎపిఎస్, విప్రో, ఇన్ఫోసిస్ తదితర భారతీయ కంపెనీలు కూడా పెద్ద సంఖ్యలో ఉద్యోగుల్ని తొలగిస్తున్నాయని, అనేక కంపెనీలు ఆంధ్రాకు వచ్చి కొత్తగా ఉద్యోగాలిస్తామని భ్రమపెడుతున్నాయని.. మీరు అలాంటి కంపెనీలకు పెద్ద ఎత్తున రాయితీలు, సౌకర్యాలు కల్పిస్తున్నారు. కానీ వారి నుండి మన రాష్ట్రం వారికి ఉద్యోగాలిచ్చేందుకు ఎలాంటి హామీ తీసుకోవడం లేదు అని అన్నారు. పైగా వారిని సులభంగా తొలగించడానికి చట్ట సవరణ (లేబర్ కోడ్స్) చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని సవరించి అదనపు గంటలు పనిచేయాలని నిర్దేశించారు అని చెప్పారు. మధ్యంతర వయస్సులో ఉన్నవారు అప్పులు చేసి ఇల్లు, కార్లు కొనుకున్నారు. పిల్లల చదువులు మధ్యలో ఉన్నాయి. ఇప్పుడు వారికి ఉద్యోగాలు పోతే (లే ఆఫ్, రిక్రూట్‌మెంట్) కనీసం ఇయంఐలు కూడా కట్టుకోలేక కట్టుబట్టలతో వీధిన పడతారు అని వివరించారు. వీరు ఇంత సంక్షోభంలో ఉన్నా మీ (మంత్రి) నుండి స్పందన, సానుభూతి వ్యక్తం కాలేదు అని, ఆపే ప్రయత్నం చేయలేదు అని అన్నారు. అమెరికాలో ఉంటున్నవారు తిరిగి ఇక్కడకు వస్తే వారికి ఉద్యోగాల కల్పన చేయలేకపోతే తీవ్ర నిస్పృహకు గురవుతారని తెలిపారు. కాబట్టి మీరు (మంత్రి) చొరవ తీసుకొని వీరికి ఉద్యోగ భద్రత కల్పించేందుకు, తొలగింపులు ఆపేందుకు భారత ప్రభుత్వం, అమెరికా అధ్యక్షుడు,

వివిధ కంపెనీల అధికారులతో మీకున్న సంబంధ బాంధవ్యాలను ఉపయోగించగలరని కోరుతున్నానన్నారు.

# కార్యకర్తల సంక్షేమమే ప్రధానం : మంత్రి నారాయణ

### - వీధి వ్యాపారులకు తోపుడు బండ్లు - 303 మంది కార్యకర్తలకు 76 లక్షల 25 వేల రూపాయలు చెక్కులు పంపిణీ

**నెల్లూరు, డిసెంబర్ 6, ప్రభాతవార్త-వైద్యం** కార్యకర్తలకు అండగా ఉంటూ పురిటి గడ్డ రుణం తీర్చుకుంటామని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా నెల్లూరులోని గోమతి నగర్ క్యాంపు కార్యాలయంలో సిటీ నియోజకవర్గానికి సంబంధించి కార్యకర్తల సంక్షేమ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం పండుగలా నిర్వహించారు. తెలుగు దేశం పార్టీ క్యాంపు కార్యాలయం పసుపుమయంగా మారింది. కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ మొదటి ప్రాధాన్యత ఇస్తానని మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. వారి సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. ఏడాదికి 10 కోట్ల సొంత నిధిని కార్యకర్తల సంక్షేమానికి కేటాయించిన ఆయన ఈ విడతలో 303మందికి ఒక్కొక్కరికి 25 వేల వంతున కుమార్తె షరణితో కలిసి 76,25 లక్షల రూపాయల చెక్కులను కార్యకర్తలకు అందజేశారు. ఇప్పటి వరకు మూడు కోట్ల అరవై లక్షల రూపాయల చెక్కులను అందజేసినట్లు వెల్లడించారు. తనను గెలిపించిన ప్రజలకు, తనను భుజాలపై మోసే కార్యకర్తలకు జీవితాంతం రుణపడి ఉంటానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. చెక్కులు అందుకున్న కార్యకర్తలందరూ మంత్రి పొంగూరు నారాయణతో పాటు, షరణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలను గుర్తుపెట్టుకుని, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్న ఏకైక మంత్రి పొంగూరు నారాయణ అంటూ వారు కొనియాడారు. కుటుంబ సభ్యుల సహకారంతో కార్యకర్తలకు ఆర్థిక సాయం చేస్తున్నట్లు మంత్రి నారాయణ వెల్లడించారు. అనంతరం మంత్రి కుమార్తె శరణి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సాయం చేయడం మాత్రమే తన తండ్రికి తెలుసని, పేదరికంలో పుట్టాడు కాబట్టే.. నిరుపేదల కష్టాలను తెలుసుకున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని తన తండ్రి తూచా తప్పకుండా నెరవేరుస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలతో పాటు, ఇవ్వని హామీలను సైతం నెరవేరుస్తున్నారని వెల్లడించారు. 2024 ఎన్నికల ప్రచారంలో తన తండ్రిని చాలా మంది చాలా మాటలన్నారని ఆమె గుర్తు చేశారు. మా నాన్న మాటల మనిషి కాదని, చేతల మనిషని ఇప్పుడు అందరికి అర్థం అవుతుందన్నారు. నెల్లూరు నగరాన్ని మెట్రోపాలిటిన్ సిటీ చేసే దిశగా ముందుకు సాగుతున్నారని వివరించారు. ఎన్నికల




ఫలితాలు రాకముందే కార్యకర్తల కోసం ఏడాదికి పది కోట్లు కేటాయించాలని తమ కుటుంబం నిర్ణయించిందన్నారు. ఆ నిధి నుంచి కార్యకర్తలకు విడతల వారీగా సహాయం చేస్తున్నామని అన్నారు. దేశంలో ఏ నేతా చేయని విధంగా కార్యకర్తలకు తన తండ్రి ఆర్థిక సహాయం చేస్తున్నారని అన్నారు. తోపుడు బండ్లు, సహాయనిధి చెక్కులు తీసుకొన్న వారి కళ్ళలో ఆనందం చూస్తే సంతోషంగా ఉందన్నారు. 63 మందికి తన చేతుల మీదుగా తోపుడు బండ్లు, ఇస్త్రీ బండి,

7 ట్రై సైకిళ్ల పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. చిన్న తనంలో తన తండ్రి ఎన్నో ఇబ్బందులు పడ్డాని, కష్టపడి చదివి ఈ స్థాయికి వచ్చారని అన్నారు. పుట్టిన గడ్డ రుణం తీర్చుకోవాలని నాయకుడయ్యారని శరణి తెలిపారు.

## కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కల్యాణోత్సవం

**రాపూరు (నెల్లూరు), డిసెంబర్ 6, ప్రభాతవార్త :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30 కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం గోపూజ, పూలాంగి సేవ నిర్వహించారు. ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్, సిబ్బంది నరసింహా, వెంకటసుబ్బయ్య, తదితరులు పర్యవేక్షించారు. స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక



స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

# హైదరాబాద్‌లో 'ఆపరేషన్ కవచ్'

## నగరంలో శుక్రవారం రాత్రి 150 చోట్ల ముమ్మరంగా సోదాలు

## నాకాబందీలో పాల్గొన్న సిపి సజ్జనార్, ఇతర పోలీసు అధికారులు

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** జంట నగరాలలో శాంతి భద్రతల పరిరణక్ష, అసాంఘీక శక్తులపై నిరంతరం నిఘా వుంచేందుకు పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నార్ ఆపరేషన్ కవచ్ పేరిట శుక్రవారం రాత్రి నాకా బందీ నిర్వహించారు. నగర వ్యాప్తంగా 150 చోట్ల రాత్రి పదిన్నర గంటల నుంచి తెల్లవారుజామున ఒంటి గంట వరకు సాగిన నాకా బందిలో కమిషనర్ సజ్జన్నార్ సహా అందరు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరైన పత్రాలులేని వాహనాలను జప్తు చేయగా కొందరు అనుమానితులను అదుపు లోకి తీసుకున్నారు. కొన్నిచోట్ల గంజాయి పట్టుబడింది.
జంటనగరాల్లో చాలాకాలం తరువాత రాత్రివేళలో ఆకస్మిక తనిఖీ కార్యక్రమం (నాకాబందీ) జరిగింది. గతంలో ఈ తరహా కార్యక్రమాలను చాలా మంది కమి షనర్లు నిర్వహించారు. కొంతకాలంగా ఈ పథకం అమలవడం లేదు. కొత్త కమిషనర్ సజ్జన్నార్ దీనిని మళ్లీ ప్రారంభించారు. కొని న్న రోజులుగా రౌడీలను, అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారి భరతం పడుతున్న కమిషనర్ వారి ఇళ్లకు అర్ధరాత్రి వేళ వెళ్లి మరీ వార్నింగ్ ఇవ్వడం తెలిసిందే. దీంతో పాటు 300 మందికి పైగా రౌడీలను తన కార్యాలయంలో కోర్టు నిర్వహించి మరీ బైండోవర్ చేయడం విదితమే. దీనికి భి న్నంగా శనివారం నాటి బ్లాక్ డేకు ఒక్కరోజు ముందు నగర వ్యాప్తంగా ఎంపిక చేసిన 150 చోట్ల ఆపరేషన్ కవచ్ పేరిట నాకా బందీ నిర్వహించారు.
పాతబస్తీతో పాటు పశ్చిమ, దక్షిణ, పశ్చిమ, తూర్పు మండలాలలోని సున్నిత, అతి సున్నిత ప్రాంతాలలో ఈ నాకా బందీ జరిగింది. ఐదు వేల మంది పోలీసు సిబ్బంది ఈ నాకా బందీలో పాల్గొనగా కొత్వాల్ సజ్జన్నార్ టోలిచౌకితో పాటు పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ సహా మరికొన్నిచోట్ల పాల్గొన్ని వాహన దారుల తనిఖీలో పాలుపంచుకున్నారు.
ఆయనతోపాటు శాంతి భద్రతల జాయింట్ సిపి తఫ్సీర్ ఇక్బాల్ ఇతర ఉన్నతాధికారులు ఆయా ప్రాంతాలలో నాకా బందీలో పాల్గొన్నారు. నాకా బందీలో శాంతి భద్రతలతో పాటు సాయుధ బలగం, టాస్క్‌ఫోర్స్, ట్రాఫిక్ విభాగాల సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల 15 వేల వాహనాలను తనిఖీ చేయగా పరైన పత్రా లు లేని 1600 వాహనాలను జప్తు చేశారు. ఎనిమిది మంది అనుమానితులను అదుపులోకి తీసుకు న్నారు. అరకిలో గంజాయిని జప్తు చేశారు. 105 పెట్టి కేసులను నమోదు చేశారు.



నగరంలో శుక్రవారం రాత్రి స్వయంగా వాహనాల తనిఖీలో పాల్గొన్న పోలీసు కమిషన్ సజ్జనార్ తదితరులు

**ఎంట్రీలు, ఎగ్జిట్ పాయింట్లు టార్గెట్‌గా సాగిన నాకాబందీ**

ఇదిలా ఉండగా శుక్రవారం రాత్రి నగర వ్యాప్తంగా సాగిన నాకా బందీ ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు లక్ష్యంగా జరిగింది. ప్రవేశ ప్రాంతాలు, నిష్క్ర మణ ప్రాంతాలను ముందుగానే ఎంపిక చేసుకుని అక్కడ నాకా బందీ నిర్వహించారు.
బ్లాక్ డే వుండడంతో పాతబస్తీతో పాటు పశ్చిమ, దక్షిణ ప శ్చిమ మండలాలను ఇందుకు ఎంచుకున్నారు.
నాకా బందీని కమిషనర్ కమాండ్ కంట్రోల్‌లోని సిసి కెమెరాల కేంద్రలో పరిశీలించారు.

# హైకోర్టు న్యాయసేవల కమిటీ చైర్మన్‌గా జస్టిస్ రవినాథ్

**విజయవాడ,డిసెంబరు 6,ప్రభాతవార్త ప్రతినిధి** :హైకోర్టు న్యాయసేవల కమిటీ చైర్మన్‌గా న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి నియమితులయ్యారు. హైకోర్టు సిజె ఏపీ న్యాయసేవాధికార సంస్థ పాట్రన్ ఇన్ ఛీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ నియమానికి సంబంధించి ప్రభుత్వం గెజిట్ ప్రచురించింది.

# వైద్య విద్యలో విద్యార్థినులదే హావా

## ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి

**విజయవాడ,డిసెంబరు 6.ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య విద్య(ఎంబిబిఎస్) ప్రవేశాల్లో విద్యార్ధినీలే ఎక్కువగా చేరారని ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆమె వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు అందించిన నివేదికలో వెల్లడించారు. ఈ వివరాలను అనుసరించి ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యకళాశాలల్లో ఈ ఏడాది ఎంబిబిఎస్ ప్రవేశాల వివరాలను అనుసరించి గత రెండేళ్లతో పోల్చితే 202526 విద్యాసంవతంలో 3.66శాతం అమ్మాయిల ప్రవేశాలు పెరిగాయని తెలిపారు. 2024- 25తో పోల్చితే విద్యార్థుల ప్రవేశాలు 3.66శాతం తగ్గాయని వివరించారు. 2023-24లో 57.06శాతం, 2024-25లో 57.96శాతం, 202526లో 60.72శాతం చొప్పున విద్యార్థినీలు ఎంబిబిఎస్‌లో చేరినట్లు వెల్లడించారు. ఈ పరిణామం పట్ల అమ్మాయిల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రుల్లో వస్తున్న మార్పుకు సంకేతమని మంత్రి సత్యకుమార్ యాదవ్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాల విద్య నుంచే అమ్మాయిలు నీట్‌లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు పుస్తకాలతో మమేకమవుతున్నారని తెలిపారు. అందువల్లే వారికి నీట్‌లో ఉత్తమ ర్యాంకులు వస్తున్నాయని తెలిపారు. కన్వీనర్, యాజమాన్య కోటాలోనూ బాలికల ప్రవేశాలు అధికంగా ఉండడం గమనార్హమని పేర్కొన్నారు. ఈ ఏడాది మొత్తం 6430 సీట్లలో కన్వీనర్ కోటా కింద అమ్మాయిలు 2617 సీట్లు, అబ్బాయిలు 1638 చొప్పున సీట్లు దక్కించుకున్నారని వెల్లడించారు. యాజమాన్య కోటాలో 1287 సీట్లు అమ్మాయిలు, 888 సీట్లు అబ్బాయిలు పొందారని వివరించారు.

# లోక్ అదాలత్‌లతో కోర్టులపై భారం తగ్గుతుంది: జస్టిస్ పి.శ్యామ్‌కోషి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్, డిసెంబరు 6:** లోక్ అదాలత్‌లతో కోర్టులపై భారం తగ్గుతుందని రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటి ఎగ్జిక్యూటివ్ చైర్మన్ జస్టిస్ పి.శ్యామ్‌కోషి అన్నారు. శనివారం రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయంలో ఈ నెల 21న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై డిజిపి శివధర్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనర్లు, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్), ఎక్సైజ్ కమిషనర్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ఆర్టీసీ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండబుల్, ఎక్సైజ్, ఆర్టీసి, చెక్ బౌన్స్, ఇతర కేసులతో సహా వివిధ వర్గాల కేసుల పరిష్కారానికి ప్రతి ఒక్కరూ చొరవ చూపాలన్నారు. ఈ నెల 21వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించడానికి మరిన్ని కేసులను గుర్తించాలని ఎక్సైజ్ కమిషనర్‌ను ఆదేశించారు. త్రిపుర, జార్ఖండ్‌లలో అనుసరించిన విధానంలో బాగంగా కాంపౌండింగ్ ఫీజును తగ్గించడానికి చర్యలు తీసుకోవాలని తెలియజేశారు. కాగా, రాష్ట్ర కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కాంపౌండబుల్ కేసులను తగ్గించడంలో తమ పూర్తి మద్దతు, సహకారాన్ని అందిస్తామని డిజిపి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని అన్ని పోలీసు అధికారులకు అవసరమయిన అన్ని సూచనలను జారీ చేస్తామని డిజిపి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిఎస్ఎల్ఎస్ఏ సభ్య కార్యదర్శి సిహెచ్ పంచాక్షరి, అడిషనల్ డిజిపిలు మహేష్ భగవత్, చారు సిన్హా , అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఎం. రాజు తదితరులు పాల్గొన్నారు.

# మే 17న జెఇఇ అడ్వాన్స్‌డ్-2026

## తేదీని ప్రకటించిన ఐఐటీ రూర్కీ

## మొదటి విడతకు 14.50 లక్షల దరఖాస్తులు

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** దేశంలోని ప్రతిష్టాత్మకమైన ఐఐటీల్లో ప్రవేశాల కోసం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామ్(జెఈఈ) అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను వచ్చే ఏడాది మే 17న నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి పరీక్ష తేదిని ఐఐటీ రూర్కీ ప్రకటించింది. జెఈఈ మెయిన్ రెండు విడతల్లో అర్హత పొందిన 2.50 లక్షల మంది విద్యార్థులకు దేశవ్యాప్తంగా మే 17న జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించనున్నట్లు ఐఐటీ రూర్కీ ప్రకటించింది. పేపర్-1ను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, పేపర్-2ను మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహించ నున్నారు. 2025లో జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను మే 18న ఐఐటీ కాన్పూర్ నిర్వహించింది. జెఈఈ అడ్వాన్స్‌డ్-2026 పరీక్షను ఐఐటీ రూర్కీ నిర్వహించనుంది. జెఈఈ మెయిన్ మొదటి విడత దరఖాస్తు గడువు నవంబర్ 27తో ముగిసింది. దేశ వ్యాప్తంగా 14.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరికి జనవరి 21 నుంచి 30 వరకు పరీక్షలను నిర్వహించనున్నారు. గత ఏడాదిలో నిర్వహించిన జెఈఈ మెయిన్ మొదటి విడత కంటే ఈ ఏడాది ఎక్కువ దరఖాస్తులు వచ్చాయి. గత ఏడాది 13.11 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా.. ఈ ఏడాది అదికాస్త 14.50 లక్షలకు చేరింది. ఈ ఏడాది తెలంగాణలో కొత్తగా ఆదిలాబాద్, పెద్దపల్లి, కోదాడలో పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేసినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఏ) ప్రకటించింది. జెఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలను ఏప్రిల్‌లో నిర్వహించ నున్నారు. జెఈఈ మెయిన్ రెండు విడతల్లో అర్హత సాధించిన 2.50 లక్షల మందికి మే 17న జెఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను నిర్వహించనున్నారు. పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని ఐఐటీ రూర్కీ ప్రకటించింది. దరఖాస్తు తేదిలతోపాటు హాల్ టికెట్ డౌన్‌లోడ్, పరీక్ష కేంద్రాల వివరాలను త్వరలో ప్రకటించనుంది.

# గ్రేటర్‌పరిధిలో హారన్ల మోతకు చెక్

## ముంబయి తరహాలో హాంక్ మోర్.. వెయిట్ మోర్ ఫార్ములా అమలు

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** జంట నగరాలు, శివార్లలో సిగ్నళ్ల వద్ద అదేపనిగా పెరిగిపోతున్న శబ్ద కాలుష్యాన్ని నివారించేందుకు పోలీ సు శాఖ సరికొత్త ప్రయత్నాలు చేపట్టింది. శబ్ద కాలుష్యం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుండడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రభావం చూపుతు ండంతో అదేపనిగా హారన్ మోగించే వారిపై కొరడా ఝుళిపించేందుకు ముంబాయి తరహాలో హాంక్ హారన్... వెయిట్ మోర్ అనే పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల ప్రకారం పట్టణ ప్రాంతాలలో పగటిపూట 55 డెసిబుల్స్, రాత్రి వేళల్లో 45 డెసిబుల్స్ వరకు ధ్వని వెలువరించే వీలుంది. అంతకు మించితే కాలుష్యం కింద పరిగణిస్తారు. ఇదే సున్నిత ప్రాంతాలలో అయితే పగటిపూట 50 డెసిబుల్స్, రాత్రి వేళల్లో 40 డెసిబుల్స్‌కు మించకూడదు. కానీ గ్రేటర్ పరిధిలో చాలాచోట్ల ఇది పగటిపూట 80 డెసిబుల్స్, రాత్రి వేళల్లో 70 డెసిబుల్స్ వరకు వుంటోంది. కొన్నిసార్లు ఇది 110 డెసిబుల్స్ అంతకు మించి వుంటోంది. దీనివల్ల ఆసుపత్రులు, నివాస సముదాయాల ప్రాంతా లలో ఇది తీవ్ర ఇబ్బందికరంగా వుంటోంది. ఇదే సమయంలో కుర్రకారు మోటారు సైకిళ్లను ఇష్టానుసారంగా నడుపుతుండడం కూడా శబ్ద కాలుష్యం పెరిగేందుకు దోహదం చేస్తోంది. మరికొన్ని ఘటనల్లో యువకులు ద్విచక్ర వాహనాల సైలెన్సర్లను తీసివేస్తూ విపరీతమైన ధ్వనితో వేగంగా వెళుతు న్నారు. ఈ సందర్భంగా శబ్ద కాలుష్యం తీవ్రతకు అంతే లేకుండా పోతోంది. పోలీసులు వచ్చేలోపు వీరంతా సందుల్లో దూరి పారిపోతున్నారు.

**ముంబయి తరహాలో హాంక్ మోర్.. వెయిట్ మోర్ పథకం అమలుకు నిర్ణయం**

ఇదిలా ఉండగా ముంబాయిలో శబ్ద కాలుష్యం నివారించేందుకు అమల్లో వున్న హాంక్ మోర్.. వెయిట్ మోర్ పథకం గ్రేటర్ పరిధిలో అమలు చే యాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ముఖ్యంగా చౌరస్తాల వద్ద హాంక్ మోర్...వెయిట్ మోర్ పథకం ముంబాయిలో మంచి ఫలితాలను ఇస్తుండడ ంతో ఇక్కడ దీనిని ప్రయోగాత్మకంగా కొన్నిచోట్ల అమలు చేయాలని పోలీసు శాఖ నిర్ణయించింది. ఆ తరువాత అన్ని ప్రాంతాలలో అమలు చేయా లని యోచిస్తోంది. చౌరస్తాల వద్ద రెడ్ సిగ్నల్ పడిన సమయంలో ఇష్టానుసారం హారన్ మోగిస్తే సిగ్నల్స్‌లో వున్న ప్రత్యేక వ్యవస్థ దీనిని గమనించి రెడ్ సిగ్నల్ గడువును ఆటోమెటిక్‌గా మరికొన్ని సెకన్ల పాటు పెంచుతుంది. హారన్ మోగించడం ఆగిన తరువాతే సిగ్నల్ మామూలు స్థితికి చేరుకుం టుంది. ముంబాయిలో 2020 నుంచి అమల్లో వున్న ఈ పథకం మంచి ఫలితాలను ఇస్తోంది. ఇందుకోసం అక్కడి పోలీసులు ప్రత్యేక సౌండ్ సెనా ్సర్లను ఏర్పాటు చేశారు. ఈ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిన తరువాత ముంబాయిలో చౌరస్తాలతో పాటు ఇతరచోట్ల అనసవ రంగా హారన్లు మో గించడం 70 శాతం తగ్గినట్లు పోలీసుల పరిశీలనలో వెల్లడయ్యింది.

# గ్లోబల్ సమ్మిట్‌కు హార్యానా సిఎం నాయబ్‌సింగ్ సైనీ

## ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్



**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్న నేపథ్యంలో.. హార్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ కూడా హాజరుకానున్నారని ఎస్‌సి, ఎస్‌టి, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. పంజాబ్ ఆర్థిక శాఖ మంత్రి హర్పాల్ సింగ్ కూడా హాజరవుతున్నట్టు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025" కు ఆహ్వానాల కార్యక్రమంలో భాగంగా, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ శనివారం హార్యానా, పంజాబ్ రాష్ట్రాలను సందర్శించారు. సమ్మిట్ ప్రాముఖ్యత, తెలంగాణ భవిష్యత్ అభివృద్ధి పథం, పెట్టుబడుల అవకాశాలు, రాష్ట్రాల మధ్య సహకార వేదిక వంటి కీలక అంశాలపై ఇరురాష్ట్రాల నాయకులతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హార్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీని మర్యాదపూర్వకంగా కలిసి ఈ నెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరగనున్న సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వాన పత్రాన్ని అందించారు. రాష్ట్ర పెట్టుబడుల వాతావరణం, టిస్- ఐపాస్ ద్వారా లభిస్తున్న వేగవంతమైన అనుమతులు, విదేశీ పెట్టుబడులను ఆకర్షిస్తున్న విధానం, ఐటీ-ఫార్మా-ఎలక్ట్రానిక్స్ రంగాల్లో తెలంగాణ సాధిస్తున్న పురోగతిపై ఆయన హార్యానా సీఎం సైనీకి వివరించారు. తెలంగాణ అభివృద్ధి వేగం, పెట్టుబడులను ఆకర్షించే దూరదృష్టి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కొత్త అవకాశాలను హార్యానా సీఎం ప్రశంసించారు. దేశంలోని రాష్ట్రాలు పరస్పర సహకారంతో ముందుకు సాగాల్సిన అవసరాన్ని కూడా ఇరువురు నాయకులు చర్చించుకున్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనలో ఉండటంతో ఆ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హర్పాల్ సింగ్‌ని కలిసి సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానం అందించారు. పంజాబ్-తెలంగాణ రాష్ట్రాల మధ్య వ్యవసాయ ప్రాసెసింగ్, అగ్రిటెక్, ఎంఎస్ఎంఈ, స్టార్టప్ సహకారాలు, పర్యాటక- సాంస్కృతిక మార్పిడి, గ్రీన్ ఎనర్జీ రంగాల్లో భాగస్వామ్యం కల్పించే అవకాశాలపై విస్తృతంగా చర్చించినట్టు మంత్రి తెలిపారు. పంజాబ్ తరఫున తెలంగాణతో కలిసి పనిచేయాలనే ఆసక్తి వ్యక్తం చేసినట్టు మంత్రి తెలిపారు. తెలంగాణ రైజింగ్-2047 దార్శనిక పత్రాన్ని ఈ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్న విషయం తెలిసిందే.

# ఐదేళ్లలో 100మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి

## 2047 నాటికి 15 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్

## గ్లోబల్ సింగరేణి లిమిటెడ్‌గా ఏర్పాటు

## సింగరేణి విజన్ డాక్యుమెంట్ విడుదల

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** వచ్చే ఐదేళ్ల నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో సింగరేణి ఉంది. అలాగే మొత్తం 5,850 మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు, 2047 నాటికి 15 వేల మెగావాట్ల థర్మల్ విద్యుత్తు, 25 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి చేయాలని నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047 కు అనుబంధంగా సింగరేణి కూడా తన విజన్ 2030-2047 డాక్యుమెంట్‌ను ప్రకటించింది. హైదరాబాద్ సింగరేణి భవన్‌లో సంస్థ సిఎండి ఎన్. బలరామ్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుతోపాటు రాష్ట్ర, దేశ అవస రాలకు అనుగుణంగా కంపెనీని బొగ్గు, తదితర రంగాల్లోకి పెద్దఎత్తున విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొం దించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా వివిధ రకాల పునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి భారీ ఎత్తున ప్రణాళికలు తయారు చేశామని, దేశవిదేశాల్లో కీలక ఖనిజ రంగంలో ప్రవేశించడానికి సింగరేణికి అనుబంధం గా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ను ఏర్పాటు చేయ నున్నట్లు ప్రకటించారు, విజన్ డాక్యుమెంట్ లోని స్వల్ప, మధ్యకాలిక ప్రణాళికలో సింగరేణి 100 మిలి యన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం కోసం ప్రస్తుత లీజు ప్రాంతంలోనే కాక, వెలుపల ఉన్న కొత్త బ్లాకులను, వివిధ రాష్ట్రాలలోని కొత్త బ్లాకులను కూడా చేపట్టాలని నిర్ణయించింది. అలాగే ప్రస్తుత 1,200 మెగావాట్ల థర్మల్ విద్యుత్తు ఉత్పాదనను 4,400 మెగావాట్లకు పెంచనుంది. ప్రస్తుతం 245.5 మెగావాట్ల సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తున్న సింగరేణి 2030 నాటికి 2,000 మెగావాట్ల సోలార్ విద్యుత్తును ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకు రాజస్థాన్ లో త్వరలో 1,500 మెగావాట్ల సోలార్ ప్లాంట్ ను ఏర్పాటు చేయబోతుంది. అంతేకాకుండా రాష్ట్రంలో 800 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నది. ఎత్తైన ఓపెన్ కాస్ట్ డంపుల పైన 100 మెగావాట్ల పవన విద్యుత్తు ఉత్పత్తి కోసం ప్లాంట్లను ఏర్పాటు చేయబోతోంది. 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి లక్ష్యంగా తొలి దశలో మూతబడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని వద్ద 250 మెగావాట్ల ప్లాంటును ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. పగిడేరు వద్ద 200 మెగావాట్ల జియో థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేయనుంది. ఇది కాక ఎఫ్.డి.ఆర్.ఈ హైబ్రిడ్ ఆర్టీసి విభాగాలలో కలిపి మరో 1,500 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేయాలని, 700 మెగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టంలను వివిధ సోలార్ ప్లాంట్ల వద్ద ఏర్పాటు చేయా లని కూడా ప్రణాళికలు రూపొందించింది. దీనితో మొత్తం మీద 2029 30 నాటికి సింగరేణి 5.85 గిగా వాట్ల (5,850 మెగావాట్ల) పునరుత్పాదక విద్యుత్తును ఉత్పత్తి చేయాలని విజన్ డాక్యుమెంట్ లో స్పష్టం చేసింది. సింగరేణి సంస్థ కేవలం బొగ్గు, థర్మల్ విద్యుత్, పవన విద్యుత్, సోలార్ విద్యుత్ రంగాలలోనే కాకుండా రాగి, బంగారం అన్వేషణలో ముందుకు పోనున్నట్లు చెప్పారు. మహిళా ఉద్యోగుల సేవలను ఓపెన్‌కాస్ట్, భూగర్భ గనుల్లోని కీలక విభాగాల్లో వినియోగించడం వం టి చర్యలను విజన్ డాక్యుమెంట్‌లో పేర్కొన్నారు.

# గుమ్మడి నర్సయ్య పై బయోపిక్ ప్రారంభం

## ఆదర్శప్రాయుడైన ఎమ్మెల్యేపై చిత్రం

## సాహసోపేత నిర్ణయం : మంత్రి కోమటిరెడ్డి

## వ్యవస్థలో మార్పునకు ఇలాంటి సినిమాలు రావాలి: హీరో శివరాజ్‌కుమార్, ఎమ్మెల్సీ కవిత



**కొత్తగూడెం, డిసెంబరు 6, ప్రభాతవార్త:** నిస్వార్థ సేవకు నిలువెత్తు నిర్దర్శంగా నిలి చిన మహోన్నత వ్యక్తి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి... తన స్వలాభం కాకుండా ప్రజాసంక్షేమమే ధ్యేయంగా నడుంబిగించి.. ఎలాంటి సుఖ వైభోగా లకు లొంగకుండా సాధారణ జీవితాన్ని గడిపి అందరికీ ఆదర్శప్రాయుడిగా నిలిచిన మాజీఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య.. జీవిత చరిత్రను అందరికీ తెలిసేలా చిత్రాన్ని రూపొందించడం సాహసోపేతమైన నిర్ణయం. ఈ మహో న్నతమైన ఘట్టాన్ని ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభించడం పాల్వంచకే కొత్త వైభవాన్ని తీసుకొచ్చింది. రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదగా తొలి షూటింగ్ ప్రారంభోత్సవం అంగరంగ వైభవం గా జరిగింది. భద్రాద్రి త్రగూడెం జిల్లా పాల్వంచ మండలం పెద్దమ్మగుడిలో ముందుగా పూజా కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం హెచ్‌కన్వెన్షన్హాల్లో తొలిషూటింగ్న రాష్ట్ర రోడ్లు, భవనాల, సినిమా ఫోటోగ్రాఫి శాఖామంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సినీ నిర్మాణ నల్లా సురేష్ రెడ్డి సతీమణి నల్లా పవల్లిక, నందిని మల్లు, కన్నడ సూపర్ స్టార్ హీరో శివరాజ్కుమార్, సతీమణి గీత, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య పాల్గొని ప్రారంభించారు. తొలి సన్ని వేశాన్ని కన్నడ సూపర్‌స్టార్ శివరాజ్‌కుమార్ సతీమణి గీత, సినీ నిర్మాత సురేష్‌రెడ్డి సతీమణి ప్రవల్లిక క్లాప్ కొట్టగా, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. చిత్ర కథానాయకుడు కన్నడస్టార్ శివరాజ్‌కుమార్, గుమ్మడి నరసయ్య చేతుల మీదగా అంబేద్కర్‌కు పూలమాల వేశారు. అనంతరం పట్టణ ప్రజల మధ్యలో భారీ ర్యాలీతో పెద్దమ్మతల్లి గుడికి చేరారు. నల్ల సురేష్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి అమ్మవారి పూజలో పాల్గొన్నారు. మంత్రి మాట్లా డుతూ... ఐదుసార్లు ఎమ్మె ల్యేగా గెలిచినా సాధారణ జీవితం గడుపుతున్న ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య జీవితం ఆధారంగా సినిమా ప్రారంభం అభినందనీయమని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచలో ఘనంగా ప్రారంభోత్సవం చేయ డం సంతోషంగా ఉందని చెప్పారు. గుమ్మడి నర్సయ్య 'ప్రజల మనిషి', 'పేదవారి దేవుడు'గా అభివర్ణించారు. ఎమ్మెల్యే జీతం, ఆస్తులను దానం చేయ డం, సైకిల్‌ను వాహనంగా ఉపయోగించడం వంటి నర్సయ్య నిరాడంబరతను కోమటిరెడ్డి ప్రస్తావించారు. ప్రతి ఎమ్మెల్యే, సర్పంచ్ నుండి ముఖ్యమంత్రి వరకు నర్సయ్య జీవిత చరిత్రను చూడాలని మంత్రి కోరారు. ఈ సినిమా ద్వారా ప్రజా ప్రతినిధులలో మార్పు వచ్చి, అవినీతి తగ్గుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. సినిమాకు సబ్సిడీ ఇప్పించేందుకు ముఖ్యమంత్రితో మాట్లాడతానని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మాట్లా డుతూ.. అవినీతిరహిత, మానవత విలువలను కాపాడుతూ ప్రజలకు ఎలా సేవలు చేయాలో ఎప్పుడు మాట్లాడినా సరే.. మనం గుమ్మడి నర్స య్యనే ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ సినిమాలో గుమ్మడి నరసయ్య పాత్రకు హీరో శివరాజ్‌కుమార్ ప్రాణం పోశారని అన్నారు.

# రవిని ఏడు రోజుల కస్టడీకి ఇవ్వండి

## కోర్టులో పోలీసుల పిటిషన్

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** పైరసీ కేటుగాడు ఐ బొమ్మ రవి వ్యవహారంలో ట్విస్ట్ నెలకొంది. రవిని మూడు కేసుల్లో మూడు రోజుల పాటు కస్టడీ విచారణకు కోర్టు అనుమతించడం తెలిసిందే. కోర్టు అనుమతితో శనివారం నుంచి మూడు రోజుల పాటు రవిని పోలీసులు కస్టడీలోకి తీసుకోవాల్సి వుంది. అయితే పోలీసులు అనూహ్యంగా రవిని కస్టడీలోకి తీసుకోకుండా అతన్ని వారం రోజుల కస్టడీకి ఇవ్వాలని శనివారం మధ్యాహ్నా ం నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రవి చేసిన నేరం చిన్నది కాదని, దేశ వ్యాప్తంగా అనేక భాషల సినిమాలను పైరసీ చేసి తన వెబ్‌సైట్ల లో ఉచితంగా ప్రదర్శించాడని. ఇందుకుగానూ అతనిపై ఐదు కేసులు నమోదయ్యాయని, ఒక్క కేసులోనే ఇప్పటి వరకు విచారించామని, మిగతా నాలుగు కేసుల్లో విచారించాల్సి వుందన్నారు.

# హన్మకొండ అడిషనల్ కలెక్టర్ ఇంట్లో నోట్ల కట్టలు

**హన్మకొండ బ్యూరో, డిసెంబరు 6:** హనుమకొండ అడిషనల్ కలెక్టర్ వెంకట్ రెడ్డి నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. నిన్న రూ.60 వేలు లంచం తీసుకుం టూ ఏసీబీ అధికారులకు పట్టుబడిన విషయం తెలిసిందే. కాగా, శని వారం ఉదయం నుంచి హనుమకొండలోని వెం కట్ రెడ్డి నివాసంలో సోదాలు జరిపి రూ.30 లక్షల నగదు, పెద్ద ఎత్తున ల్యాండ్ డాక్యు మెంట్లు, లాకర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మరో వైపు వెంకట్ రెడ్డి బాధితులు ఏకంగా హన్మకొండ కలెక్టరేట్ కార్యాలయం ముందే టపాసులు పేల్చి సంబరాలు జరుపు కున్నారు. వెంకటరెడ్డి బాధితులు మా పాపం పండింది అని వాపోతున్నారు. అదే సమయంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో సీఐలు శనివారం, తనిఖీలు నిర్వహించారు. నగదు భారీ మొత్తం అయన ఇంట్ల దొరకడం అయన లంచ గొండి తనానికి నిదర్శనం అయ్యింది అని నగర వాసులు అనుకుంటున్నారు.

# కుల నిర్మూలనతోనే నిజమైన ప్రజాస్వామ్యం

## అంబేద్కర్ చూపిన దారిలో అణగారినవర్గాల హక్కుల పరిరక్షణ

### వర్ధంతిలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నివాళులు

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** భారతరత్న అంబేద్కర్ వర్ధంతిని సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కులవివక్ష దేశ అభివృద్ధికి అతిపెద్ద అడ్డంకి అని, దాన్ని నిర్మూలించడం ప్రజాస్వామ్య పరిరక్షణకు తప్పనిసరి కర్తవ్యమని పేర్కొన్నారు. సమాజంలో మళ్లీ తలెత్తుతున్న కుల వాదపు ప్రమాదకర ధోరణులను ఆయన తీవ్రంగా ఖండించారు. అంబేద్కర్ చూపించిన శాస్త్రీయ దృక్పథమే ఈ దేశ భవిష్యత్తుకు నిజమైన దిక్సూచి అని అన్నారు. అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మంత్రి తన సందేశాన్ని విడుదల చేశారు. శతాబ్దాలుగా భారత సమాజాన్ని విభజించి, అణగదొక్కి, అభివృద్ధి అవకాశాలనుంచి దూరం చేసిన కులవ్యవస్థను అంబేద్కర్ నిర్భయంగా సవాలు చేసిన మహానుభావుడని మంత్రి కొనియాడారు. కులంపై ఆధారపడి మనిషిని అవమానించే ఏ వ్యవస్థకూ ప్రజాస్వామ్యంలో స్థానం లేదని అంబేద్కర్ చూపించిన అసమాన ధైర్యం నేటి తరాలకు మార్గదర్శనమన్నారు. కులాంతర వివాహాలపై దాడులు, సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న విద్వేషపూరిత ప్రచారాలు, కులవాదానికి కొత్త రూపంగా కనిపిస్తున్న ప్రమాదకర పరిస్థితులపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న విద్య, ఉపాధి, సామాజిక రక్షణ రంగాల కార్యక్రమాలు అంబేద్కర్ కలల సాధన దిశలో ముందడుగు వేస్తోందన్నారు. కులవివక్ష నిర్మూలనకు చట్టాలున్నా, సమాజంలో అవగాహన పెంపొందితేనే మార్పు సాధ్యమవుతుందన్నారు.



## అంబేద్కర్ చిత్ర పటానికి నివాళులు అర్పించిన సిఎం రేవంత్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, డిసెంబరు 6:** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.. జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తదితరులు

## అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించిన భట్టి విక్రమార్క

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 6, ప్రభాతవార్త:** రాజ్యాంగ నిర్మాత, భారత రత్న బి.ఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతి కార్యక్రమం శనివారం ట్యాంక్ బండ్ వద్దగల ఆయన విగ్రహాం ఎదుట జరిగింది. అంబేద్కర్ విగ్రహానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్‌రావు, హర్యానా మాజీగవర్నర్ బండారు దత్తాత్రేయ, సినీనిర్మాత దిల్ రాజ్, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, కౌన్సిల్ సభ్యురాలు ఎస్.ఛాయాదేవి, వివిధ మాల, దళిత, ప్రజా సంఘాలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అంబేద్కర్ బలమైన రాజ్యాంగాన్ని రక్షించి, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేశారని కొనియాడారు. అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించి ప్రపంచ దేశాల ముందు భారతదేశ ఔన్నత్యాన్ని నిలబెట్టిన మహోన్నతమైన వ్యక్తి ఆయన అని అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు మాట్లాడుతూ దేశంలో రాజ్యాంగం ప్రకారం పాలన కొనసాగుతున్నదని, దేశానికి దిశ, నిర్దేశం చేసిన మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ అని కొనియాడారు.

**డిసిఎం భట్టి విక్రమార్కకు మాలల నిరసన**

అంబేద్కర్ విగ్రహం వద్దకు నివాళులు అర్పించడానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు వ్యతిరేకంగా మాల సంఘాల నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జెఎసి ఛైర్మన్ బేర బాలకిషన్, రాష్ట్ర మాల సంఘాల జెఎసి ఛైర్మన్ చెరుకు రాంచందర్, బిఎస్ఎన్ఎల్ యూనియన్ నాయకుడు కె.బాలకృష్ణ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వల్ల నష్టపోతున్న మాలలకు, ఉపకులాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## బోగస్ ఉద్యోగులకు ఖజానా వేతనాలు

### విజిలెన్స్ విచారణకు సర్కార్ ఆదేశం

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాల్లో పనిచేస్తున్న బోగస్ ఉద్యోగులపై ప్రభుత్వం నజర్ పెట్టింది. ఉద్యోగులు లేకుండానే ఖజానా నుండి వేతనాలు పొందుతున్న కుంభకోణంపై విజిలెన్స్ విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ప్రతీ నెలా వేతనాలకు సంబంధించిన బిల్లులు, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగుల్లో భారీ తేడాలు వెలుగుచూసిన నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ విధంగా ఏడాదికి దాదాపు 700 కోట్ల రూపాయల మేర ప్రభుత్వ ఖజానాకు చిల్లుపడింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఉద్యోగులు, వారి ఆధార్ కార్డులతో అనుసంధానం చేయాలని ఆదేశించడంతో అసలు విషయం వెలుగు చూసింది. ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారే బినామీ కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తూ, నాన్ మస్టర్ రోల్‌లో ఉంటూ పనిచేస్తున్నట్లు వేతనాలు తీసుకుంటున్నారు. చాలా మంది అధికారులు ఉద్యోగులు తప్పుడు లెకనకలు చూపించి సర్కార్ సొమ్మును స్వాహా చేస్తున్నట్లు ఖరారైంది.

### బిసి రిజర్వేషన్ల కోసం ఆత్మహత్యకు పాల్పడిన

## సాయిఈశ్వర్‌చారి అంత్యక్రియలు పూర్తి

**హైదరాబాద్ (జగద్గిరిగుట్ట), డిసెంబరు 6, ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్‌లపై కాంగ్రెస్, బీజేపీ పార్టీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని మనస్తాపానికి గురైన జగద్గిరి గుట్ట నివాసి సాయిఈశ్వర్‌చారి గురువారం పీర్జాదిగూడలోని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయం ముందు పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. శనివారం జగద్గిరి గుట్ట లోని సాయిఈశ్వర్‌చారి నివాసంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత.. సాయిఈశ్వర్‌చారి భౌతికకాయానికి నివాళులర్పించి, మృతుడి భార్య, తల్లి, పిల్లలను ఓదార్చారు. మాజీమంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనచారి, ఎంపి ఆర్. కృష్ణయ్య, పల్లె రవి కుమార్, క్రాంతి, వకుళాభరణం కృష్ణమోహన్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, గణేష్‌చారి, హరిశంకర్‌గౌడ్, కిషోర్ ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం గుబురుగుట్ట స్మశానవాటికలో అంత్యక్రియలు జరిగాయి.

## అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తోన్న కేంద్ర సర్కారు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం భారతరత్న, రాజ్యాంగ నిర్మాత అయిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను కాలరాస్తోందని సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ విమర్శించారు. సామాజికోద్యమ నేత, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆయనను స్మరిస్తూ శనివారం హైదరాబాదు ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి, నివాళులు అర్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగాన్ని బలహీనపరిచి, మనుధర్మ శాస్త్రాన్ని అమలు చేస్తోందని జాన్‌వెస్లీ మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామిక, లౌకిక, ప్రజాతంత్ర, సామాజిక న్యాయం కోరే శక్తులన్ని ఏకమై పోరాడాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చారు. అటువంటి పోరాటాల్లో సీపీఐ(ఎం) ముందుభాగాన నిలబడుతుదన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా మాట్లాడుతోందని, గ్రామీణ ప్రాంతాల్లో కుల వివక్ష, దళితుల మీద దాడులు, దౌర్జన్యాలు, అత్యాచారాలు, సాంఘిక బహిష్కరణలు జరుగుతున్నా, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ యాక్ట్‌ను కఠినంగా అమలు చేయడం లేదన్నారు. కులం పేరుతో దాడులు, దౌర్జన్యాలు మరింత పెరిగిపోయాయని, మరీ ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దారుణమైన పరిస్థితులు ఉన్నాయన్నారు.

దేశంలో రాజ్యాంగ హక్కులకే ప్రమాదం ఏర్పడిందని జాన్‌వెస్లీ ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ అమలు కోసం అన్ని పార్టీలతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేసినప్పటికీ, కేంద్రం దీన్ని అడ్డుకుంటున్నదని, రిజర్వేషన్ల అమలుపై నిరాశ చెంది ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్న దుర్ఘటనకు పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనన్నారు. ఇకపై ఎవ్వరూ ఆత్మహత్యలకు పాల్పడ వద్దని, అటువంటి చర్యలు పూలే, అంబేద్కర్ ఆశయాలకు విరుద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బండారు రవికుమార్, ఎండి అబ్బాస్, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, హైదరాబాద్ సెంట్రల్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం దశరథ్, ఎం మహేందర్ పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ ఎంపి వి.హనుమంతరావు తదితరులు

## బాబాసాహెబ్ అంబేద్కర్‌కు పిసిసి చీఫ్ మహేశ్ నివాళులు

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షుడు మోతా రోహిత్ పిసిసి కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ కోసం ఎవరు ఆత్మహత్యలు చేసుకోవద్దని, బీసీ రిజర్వేషన్ కోసం ఆత్మార్పణ చేసుకున్న సాయిఈశ్వర్‌చారి మృతికి సంతాపం తెలిపిన నాయకులు వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి చిత్తశుద్ధితో ఉందని కాంగ్రెస్‌ను శంకించాల్సిన అవసరం లేదు రాహుల్‌గాంధీ పార్లమెంటులో బీసీ రిజర్వేషన్ కోసం పోరాడుతారు. హనుమంతరావు మాట్లాడుతూ.. కేంద్రంలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్‌గాంధీ ప్రధాని కావడం ఖాయమని, బీసీ రిజర్వేషన్లు సాధించుకుందామని అన్నారు.

## డిజిపి కార్యాలయంలో ఘనంగా హోంగార్డుల దినోత్సవం




**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** డిజిపి కార్యాలయంలో శనివారం హోంగార్డుల దినోత్సవం ఘనంగా జరిగింది. 30 యేళ్లుగా హోంగార్డులుగా సేవలిందిస్తున్న వారిచే డిజిపి కేక్ కట్ చేయించారు. అనంతరం డిజిపి కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డులతో కొద్దిసేపు భేటీ అయి వారి సమస్యలను విన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ డిసెంబరు ఆరవ తేదీన దేశ వ్యాప్తంగా హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం జరుపుకుంటారని, దీనికి ఓ ప్రత్యేకత వుందని అన్నారు. హోంగార్డుల దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న హోంగార్డులకు డిజిపి శుభాకాంక్షలు తెలిపారు. హోంగార్డుల దినోత్సవం పురస్కరించుకుని హైదరాబాద్ సహా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామని ఆయన తెలిపారు. శాంతి భద్రతలతోపాటు ట్రాఫిక్ నిర్వహణ, నేరాల నియంత్రణలో పోలీసులకు హోంగార్డులు ఎంతగానో సహకరిస్తున్నారని డిజిపి కొనియాడారు. హోంగార్డుల క్రమశిక్షణను డిజిపి అభినందించారు. హోంగార్డులకు అందిస్తున్న గౌరవ వేతనం తెలంగాణలోనే ఎక్కువగా వుందని, ఇతర అలవెన్సులు కూడా ఎక్కువగానే వుందని ఆయన తెలిపారు. విధి నిర్వహణలో చనిపోయిన హోంగార్డులకు బీమా సౌకర్యం వుందని, గాయపడ్డ వారికి, అనారోగ్యం పాలైన వారికి వైద్య సహాయం అందిస్తున్నామని, దీంతో పాటు మరికొన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. నూతన హోం గార్డుల నియామకం, రాజీవ్ ఆరోగ్యశ్రీ అమలు, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్ల కేటాయింపు వంటి అంశాలు పరిశీలనలో వున్నాయని ఆయన తెలిపారు. హోంగార్డులు తమ సమస్యలను ఉన్నతాధికారులకు నేరుగా చెప్పుకునే అవకాశం కల్పించామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్, హోంగార్డుల అదనపు డిజి స్వాతి లక్రా, సిఐడి అదనపు డిజి చారు సిన్హా, ఐజిలు చంద్రశేఖర్ రెడ్డి, రమేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఎఎస్ అధికారి డాక్టర్ ఎంవి.రెడ్డి. చిత్రంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు డా. పద్మనాభరెడ్డి తదితరులు

## 'కోతుల బెడద నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగుచర్యలు తీసుకోవాలి'

**హైదరాబాద్ (సైఫాబాద్), డిసెంబరు 6, ప్రభాతవార్త:** గ్రామాల్లో, పట్టణాల్లో బీభత్సాన్ని సృష్టిస్తున్న కోతుల బెడద నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగుచర్యలు తీసుకోవాలని రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ఎంవి.రెడ్డి, తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఇండియా అధ్యక్షుడు పద్మనాభరెడ్డి కోరారు. కోతుల వల్ల ఒక్క పంటలకు నష్టమే కాకుండా మనిషి ప్రాణాలకు కూడా ముప్పు ఉందని, వాటి వల్ల భయంకరమైన వ్యాధులు వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని, గత యేడాది పదివేల మంది ఆరోగ్యం దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కోతులు దేశవ్యాప్తంగా ఉన్నాయని, రాష్ట్రంలో 10 లక్షల నుంచి 20 లక్షల వరకు కోతులు ఉన్నాయని, కోతుల వల్ల రైతులు వాణిజ్య పంటలు, పండ్ల పంటలు, తోటలు, కూరగాయాలు కూడా పండించలేక పోతున్నారని, వీటి వల్ల ప్రతి ఏడాది 50 వేల కోట్ల నుంచి లక్ష కోట్ల వరకు నష్టం వాటిల్లుతున్నదని చెప్పారు. కోతుల బెడదను నివారించడానికి రైతులు, ప్రజలు, ప్రభుత్వం, అన్ని పార్టీలు కృషి చేయాలని, ప్రభుత్వం డెడికెటేడ్ కమిషన్‌ను వేసి కోతుల బెడదను నివారించడానికి తగుచర్యలు తీసుకోవాలని వారు సూచించారు.

## తెలంగాణలో విదేశీ యూనివర్సిటీలను అనుమతించొద్దు

### ఉన్నత విద్యామండలి ఛైర్మన్‌కు ఎస్ఎఫ్ఐ విజ్ఞప్తి

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** రాష్ట్రంలో విదేశీ యూనివర్సిటీలకు అనుమతి ఇవ్వొద్దని భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధులు శనివారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గ్లోబల్ సమ్మిట్ పేరుతో విద్యారంగం అభివృద్ధి కోసం అంటూ విదేశీ యూనివర్శిటీలను తెలంగాణ రాష్ట్రానికి తీసుకుని రావడం మానుకోవాలని, విదేశీ యూనివర్శిటీలను అనుమతించొద్దని విజ్ఞప్తి చేశారు. ఛైర్మన్‌ను కలిసిన వారిలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజుతో పాటు రాష్ట్ర నాయకులు డి.కిరణ్, కె.అశోక్‌రెడ్డి ఉన్నారు.

రాష్ట్రంలో ఉన్న ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలను ప్రపంచస్థాయి యూనివర్సిటీలతో పోటీపడేలాగా చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఆస్ట్రేలియా, జర్మనీ, యూకె నుంచి అక్కడ యూనివర్సిటీలను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి అనుమతులు ఇవ్వడం అంటే ఈ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యను కార్పొరేట్, విదేశీ కబంధహస్తాలకు అప్పజెప్పడమే నన్నారు. ఇక్కడ వనరులు, మానవ వనరులు విదేశీ యూనివర్శిటిలకు తాకట్టు పెట్టవద్దన్నారు. అలాగే ఇక్కడకు వచ్చే యూనివర్శిటీలు అక్కడ వాటి ర్యాంకులు, క్యాంపస్ వివరాలు ఏమి తెలియకుండా ఒప్పందం చేసుకోని మన రాష్ట్ర విద్యారంగాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడవద్దని కోరారు.

## 2036 ఒలింపిక్స్‌లో భారత్ క్రీడా విభాగంలో తెలంగాణ అథ్లెట్లు

### ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్

**హైదరాబాద్ (నాంపల్లి), డిసెంబరు 6, ప్రభాతవార్త :** 2036 ఒలింపిక్ క్రీడల్లో భారతదేశం పాల్గొనే ప్రతీ క్రీడావిభాగంలో తెలంగాణ అథ్లెట్లు ఉండేలా చూడాలన్న లక్ష్యాన్ని రాష్ట్రం నిర్దేశించుకున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ తెలిపారు. శనివాకం టీ-హబ్‌లో జరిగిన స్పోర్ట్స్ టెక్ పోడియం-2025 కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ స్పోర్ట్స్ పాలసీ రూపొందించే దశ నుండే మా ఒలింపిక్ లక్ష్యం స్పష్టంగా ఉందని, ప్రతీ క్రీడావిభాగంలో నిష్ణాతులైన అథ్లెట్లను తయారుచేసి 2036 ఒలింపిక్స్‌లో భారత్ తరపున తెలంగాణ ప్రాతినిధ్యం ఉండడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. గ్రాస్ రూట్స్ టు గ్లోబల్ .. ఇండియాస్ స్పోర్ట్స్ టెక్ రైజ్ అనే చర్చలో ముఖ్యఅతిథిగా పాల్గొన జయేష్‌రంజన్ రాష్ట్రం స్పోర్ట్స్ సామర్థ్యాన్ని పునాదిస్థాయి నుండే ఎలా అభివృద్ధి చెందిందో పేర్కొన్నారు. ఒకరోజుపాటు జరిగిన ఈ సదస్సులో స్టార్టప్స్, అన్వెస్టర్లు, టెక్ నాయకులు, కార్పొరేట్లు, అథ్లెట్లు, ఫెడరేషన్లు, పాలసీ మేకర్స్ అధికసంఖ్యలో పాల్గొన్నారు. స్పోర్ట్స్ టెక్ పోడియం కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ప్రముఖ వెంచర్ ఫండ్లు, ఏంజెల్ నెట్‌వర్క్లు, యూనివర్సిటీలు, జాతీయ ఇన్నోవేషన్ సంస్థలు మద్దతు ఇస్తున్నాయని, దీని ద్వారా హైదరాబాద్ భారతీయ స్పోర్ట్స్ టెక్, ఇన్నోవేషన్ రాజధానికిగా ఎదుగుతుందన్నారు. డిసెంబరు 8, 9 తేదీల్లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌లో దుబాయ్ స్పోర్ట్స్‌సిటీ, జీఎంఆర్ స్పోర్ట్స్ మధ్య పెద్దస్థాయి స్పోర్ట్స్‌సిటీ కోసం ముఖ్యమైన ఒప్పందం కుదరనుందని ఆయన విశదీకరించారు. ఈ సందర్భంగా జయేష్ రంజన్ స్పోర్ట్స్ యాక్సిలేటర్-స్ప్రింట్‌ఎక్స్ లోగోను ఆవిష్కరించారు. గేమ్ పాయింట్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఆదిత్యరెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో స్పోర్ట్స్‌టెక్ తొలి తరంగం గ్రాస్‌రూట్స్ స్థాయిలోనే ప్రారంభమైందని, ఇప్పుడు పనితీరు, విశ్లేషణ, ప్రసారాల వంటి లోతైన టెక్నాలజీ స్పోర్ట్స్‌లో సమగ్రంగా చేరుతున్నదని చెప్పారు.




కార్యక్రమంలో పాల్గొన్న జయేష్‌రంజన్, ఆదిత్యరెడ్డి తదితరులు

## మీనాక్షి నటరాజన్‌కు సహాయకులుగా ప్రవీణ్, వేణు నియామకం

**హైదరాబాద్, డిసెంబరు 6,ప్రభాతవార్త:** ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉన్న మీనాక్షి నటరాజన్‌కు సహాయకులుగా టిపిసిసి ప్రధాన కార్యదర్శి కొప్పుల ప్రవీన్‌కుమార్, టిపిసిసి ఎన్ ఆర్ఐ సెల్ కన్వీనర్ గంప వేణులను నియమించినట్లు టిపిసిసి చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్ తెలిపారు. ఈ ఇద్దరు పార్టీ శ్రేణుల తో వివిధ ప్రజా సంబంధిత అంశాలు, పార్టీ కార్యక్రమాలలో సమన్వయపడుటకు ఈ ఇద్దరి నియమకం తోడ్పాటు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపారు. తమ పై ఉంచిన నమ్మకం, ఇచ్చిన ప్రత్యేకబాధ్యత ని నిష్ఠగా పాటిస్తామని కొప్పుల ప్రవీణ్‌కుమార్, గంప వేణుగోపాల్ తెలిపారు. అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌కు పార్టీ ఇన్‌చార్జి, మీనాక్షి నటరాజన్ ధన్యవాదాలు తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య తదితరులు

## 10న ఢిల్లీలో ఎఐసిసి ఎదుట నిరసన ప్రదర్శన

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10న ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపడుతున్నామని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. బిసిల హక్కులు, ఆత్మగౌరవ సాధన కోసం చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం విద్యానగర్‌లోని బిసి భవన్‌లో సంఘం జాతీయ కార్యదర్శి బాణాల అజయ్, నేతృత్వంలో సంఘం నేతలు డాక్టర్ ర్యాగ అరుణ్‌కుమార్, గుజ్జ సత్యంతో కలిసి 'చలో ఢిల్లీ' వాల్‌పోస్టర్‌ను ఆర్.కృష్ణయ్య ఆవిష్కరించి మాట్లాడారు. 10న ఢిల్లీలోని కానిస్టిట్యూషన్ క్లబ్‌లో జరిగే ఒబిసిల సదస్సును విజయవంతం చేయాలని సంఘం జాతీయ కార్యదర్శి బాణాల రేఫ్రిత్ కోరారు.

# పతంజలి యోగాపీఠంతో రష్యా అవగాహన ఒప్పందం

### ఆధ్యాత్మిక, మత, ఆర్థిక, సామాజిక దృక్కోణాలతో రష్యాతో స్నేహబంధం : రామ్‌దేవ్‌బాబా



**హైదరాబాద్, డిసెంబరు 6, ప్రభాతవార్త:** పతంజలి గ్రూప్‌తో రష్యా ప్రభుత్వం ఆధ్యాత్మిక, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాలతో అవగాహన ఒప్పందం కుదరడం చారిత్రాత్మక అంశమని పతంజలి గ్రూప్ అధినేత రామ్‌దేవ్‌బాబా తెలిపారు. ఇండోరష్యా బిజినెస్ కౌన్సిల్ ఛైర్మన్ రష్యా వాణిజ్య మంత్రి మిస్టర్ సెర్గీ చెరెమిన్ పతంజలి రూపొందించిన ఎమ్ఒయుపై సంతకం చేశారు. రామ్‌దేవ్‌బాబా మాట్లాడుతూ ఈ అవగాహన ఒప్పందం ఆరోగ్య సంరక్షణ, ఆరోగ్య పర్యాటకం, నైపుణ్యం కలిగిన మానవ వనరుల మార్పిడి, పరిశోధన సంబంధిత కార్యక్రమాలు మరింత సమర్థవంతంగా రెండు దేశాల ప్రతినిధుల మేథోమదనంతో కొనసాగుతాయని తెలిపారు. రష్యాలోని ప్రజలు యోగా, ఆయుర్వేదం, ప్రకృతివైద్యాన్ని అభ్యసించడానికి వీలవుతోందని వివరించారు. ఋషుల యొక్క ఈ వెల్‌నెస్ సైన్స్‌ను ప్రపంచవ్యాప్తంగా దాదాపు 200 దేశాలకు తీసుకెళ్లడమే మా ముందున్న లక్ష్యమని ఆయన చెప్పారు. రష్యాతో ఇది మొదలైందని ఆయన అన్నారు. రష్యాలో పతంజలి వెల్‌నెస్ సేవలను విస్తరించడం ఈ అవగాహన ఒప్పందం మొదటి ప్రధాన లక్ష్యం. రష్యాతో కలిసి, వృద్ధాప్యాన్ని తిప్పికొట్టడం, దీర్ఘాయువును పెంపొందించడంపై లోతైన పరిశోధనలు నిర్వహించబడతాయని అన్నారు. ప్రధానమంత్రి స్కిల్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద, పతంజలి రెండు లక్షల మందికిపైగా శిక్షణనిచ్చిన ఏకైక ప్రైవేట్ భాగస్వామి. నైపుణ్యం కలిగిన యోగులను శిక్షణ పొందిన కార్మికులను పతంజలి రష్యాకు సరఫరా చేస్తుందని వివరించారు. కొంతమంది ప్రభావవంతమైన వ్యక్తులు భారతదేశం, రష్యా మధ్య స్నేహం పట్ల అసంతృప్తిగా ఉన్నారు, కానీ అన్ని పరిస్థితుల్లో, రష్యా భారతదేశానికి స్నేహితుడిగా ఉంది, అలాగే ఉంటుందని చెప్పారు. ఆధ్యాత్మిక, మత, ఆర్థిక, రాజకీయ, సామాజిక దృక్కోణాల నుండి భారతదేశం, రష్యా విడదీయరాని స్నేహితులు, అలాగే కొనసాగుతాయనీ తెలిపారు. పతంజలితో తమ భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటామని ఈ సందర్భంగా రష్యా మిస్టర్ సెర్గీ చెరెమిన్ తెలిపారు. పతంజలి యోగా, ఆయుర్వేదం, ప్రకృతివైద్యాన్ని అవలంబించడం ద్వారా, రష్యా ప్రజల జీవనశైలిని మార్చడం జరుగుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

# నాన్‌వెజ్ పచ్చళ్లు

ఎన్ని కూరలున్నా.. మనసు పచ్చళ్ల మీదకే పోతుంది. ఆవకాయ, గోంగూర, నిమ్మకాయ, ఇలా ఏదైనా పచ్చడితో రెండు ముద్దలు తిన్నామంటే చాలు. ఆహా అనిపించకమానదు. అదే నాన్‌బజ్ పచ్చడి అనుకోండి.. మరింత స్పెషల్ కదూ! అందుకే తేలికైన పద్ధతిలో అద్భుతంగా కురిదే ఈ పచ్చళ్లు చేసేయండి!

## చపాచప్ చికెన్



బోన్‌లెస్ చికెన్‌కిలో, పల్లీ నూనె 600, కారం 150 గ్రా, మెత్తటి ఉప్పు- 60గ్రా, వెల్లుల్లి పేస్టు -2 ఆవాలు, అల్లం, వెల్లుల్లి పేస్టు-2 చెంచాల చొప్పున, నిమ్మకాయలు-2, పసుపు-అర చెంచా, మెంతులు-చెంచా.

**తయారీ:** చికెన్ శుభ్రంగా పలుచని వస్త్రంలో మూట కట్టి నీరు కారిపోయేలా వెత్తగాలి వెల్లుల్లిపాయలుగా సూరాలి. వీటిని వెడల్పాటి గిన్నెలో వేసి పసుపు, చెంచా ఉప్పు చికెన్‌లో కలపాలి. కడాయిలో నూనె కాగనిచ్చి. కొద్దిగా చికెన్ ముక్కలు వేస్తూ దోరగా వేయించాలి. వాటిని తీసి. అదే నూనెలో వెల్లుల్లి ముద్ద, అదివేగగానే అల్లం వెల్లుల్లి పేస్టు వేయాలి. రెండూ వేగాక సెగ తీసేసి.. ఆవాలు-మెంతులు పొడి, కారం, ఉప్పు కలపాలి. నూనె చల్లారిన తర్వాత చికెన్ ముక్కలు, నిమ్మరసం వేసి కలియబెట్టాలి. అందే ఘుమఘుమలాడే స్పైసీ చెకెన్ పచ్చడి రెడీ.

## మటన్ మస్లీ

కావాల్సినవి : మటన్-కిలో, మెంతులు-చెంచా, ఆవాలు-2 చెంచాలు, నిమ్మకాయలు, వెల్లిల్లి-2 చొప్పున, అల్లం వెల్లుల్లి పేస్ట్-2 చెంచాలు పసుపు-అర చెంచా, ఉప్పు-60గ్రా, పల్లి నూనె-600 మి.లీ. తయారీ : మాంసాన్ని శుభ్రంగా కడిగి వస్త్రంలో వేసి చుట్టి. నీరంతా పోయేలా చేయాలి. అరగంట తర్వాత పొడివస్త్రం మీదికి తీసి ఆరబెట్టాలి. ఆవాలు, మెంతులు వేయించి పొడి చేసుకోవాలి. వెల్లుల్లి నూరి పక్కనుంచాలి. కడాయిలో నూనెవేడిచేసి.. కొన్ని కొన్ని చొప్పున మాంసం ముక్కలు వేస్తూ దోరగా వేయించాలి. ముక్కలు సరిగా వేగకపోతే పచ్చడి నిల్వ ఉండదు. ఆ ముక్కలను మరో గిన్నెలోకి తీయాలి. సెగ తగ్గించి ముందు వెల్లుల్లి ముద్ద.. అది కాస్త వేగాక అల్లం వెల్లుల్లి పేస్టు జతచేసి వేయించాలి. దోరగా వేగాక సెగ తీసేసి.. మాంసం ముక్కలు ఆవాలు-మెంతులు పొడి, కారం, ఉప్పు జోడించాలి. చల్లారిన తర్వాత నిమ్మరంస కలపాలి. అంతే రుచికరమైన మటన్ పచ్చడి తయార్.



## గుడ్డు పచ్చడి

**కావాల్సినవి :** కోడిగుడ్లు-15, కారం-50నరగా, ఉప్పు-20నరగా, నిమ్మకాయలు-2, పసుపు-అరచెంచా, ఆవాలు-2 చెంచాలు, మెంతులు-చెంచా, పెద్ద వెల్లుల్లిపాయ-1, పల్లీ నూనె-150 మి.లీ. **తయారీ :** కోడిగుడ్లు ఉడకబెట్టి పెంకు ఒలిచి చాకుతో గాట్లు పెట్టలి. అడుగు మందంగా ఉన్న కడాయిలో నూనె వేడిచేసి సన్నని సెగ మీద గుడ్లను వేయంచాలి. సరిగానగ వేగకపోతే పచ్చడి నిల్వ ఉండదు. వేగిన గుడ్లను తీసి పక్కనుంచాలి. అదే కడాయిలో వెల్లుల్లి ముద్ద వేయించాలి. సెగ తీసేసి.. కారం, ఉప్పు, ఆవాలు మెంతుల పొడి వేసి కలపాలి. నూనె పూర్తిగా చల్లారాక.. గుడ్లు, నిమ్మరసం వేసి కలియబెట్టాలి. పచ్చడిలోని గుడ్లు ఎంతో కమ్మగా ఉంటాయి. ఇది సుమారు పదిహేను రోజులు పాడవ్వకుండా ఉంటుంది. □



# రాత్రి ఉద్యోగం, పగలు సమాజ సేవ

**డిజిటల్ తెరలు, వర్చువల్ రియాలిటీ పాఠాలు... నగరాల్లోని విద్యార్థులకు కొత్తేమీ కాదు. గ్రామీణ విద్యార్థులకీ వాటిని అందించాలనుకుంది హర్షిణి కిషోర్, అలా అని దానికే పరిమితం కాలేదు. వ్యాపారాలు, ఇంటర్నెట్‌లో జాగ్రత్తగా వ్యవహరించడం వంటివీ నేర్పిస్తోంది. ఇంతకీ ఎవరీమె?**



ప్యాకెట్ మనీ కోసం కాదు... పనిచేయడం ద్వారా కొత్త విషయాలు నేర్చుకోవచ్చు 14 ఏళ్ల నుంచే పార్ట్ టైం ఉద్యోగాలు చేసేది హర్షిణి. ఈమెది మదురై 16 ఏళ్లకే ఐరెన్సీ గిఫ్టింగ్‌లు చేసి వ్యాపారాన్ని ప్రారంభించింది. కాకపోతే కొంత నష్టాన్ని చవిచూసింది. అలాగని నిరాశ పడలేదామె.. దాని గురించి ఇంకా అవగాహన పెంచుకోవాలి అనుకుని బీబీఏ ఆంత్రప్రెన్యూర్‌షిప్ చదివింది. అది చదివేటప్పుడు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా అనాథ పిల్లలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు బోధించారు. అప్పుడే వాళ్లెంత వెనకబడి ఉన్నారో అర్థమైందామెకు. అతిపిన్న ఉద్యోగిని.. 18 ఏళ్లకే రూ.9లక్షల ప్యాకేజీతో బెంగళూరులో గూగుల్ ఆపరేషన్స్ సెంటర్‌లో ఉద్యోగం సంపాదించింది. అక్కడ అతిపిన్న ఉద్యోగిని హర్షిణీనే. దీంతోపాటు ఇతర ఉద్యోగాలూ చేసింది ఆ వచ్చిన మొత్తంతో, సేకరించిన విరాళాలతో టెక్నికల్ సామగ్రిని సమకూర్చుకుంది. ప్రభుత్వ పాఠశాలల వీఆర్‌ల పరికరాలతో టెక్ పాఠాలతోపాటు ఇంటర్నెట్ సేఫ్టీపైనా తరగతులు తీసుకుంటోంది. 'ఈ తరం పిల్లలకి ఇంటర్నెట్ సురక్షితంగా ఉపయోగించడమే కాదు, ఆన్‌లైన్ వేదింపుల బారిన పడితే తమనితాము ఎలా రక్షించుకోవాలో తెలియడమూ ముఖ్యమే' అంటెందీమో, దీరినఒపం పంబంధిత కోర్సునీ చేసింది. గ్రామీణ విద్యార్థులకోసం మొబైల్ లైబ్రరీ, వీఆర్ , రొబోటిక్స్ టూల్స్‌ని సమకూరుస్తోంది. 2024లో రూరల్ టెక్ రైజ్ పేరుతో సంస్థను ప్రారంభించి ఈ పల్లె పిల్లలకు ప్రత్యేక కరిక్యుల వాళ్ల స్థానిక భాషలోనే రూపొందించబడింది. వ్యాపారాల దిశగా పిల్లలను ప్రోత్సహి స్తోంది. 'షార్క్ ట్యాంక్' తరహాలో రూపొందించి, బాగున్న ఆలోచనలకు కావాల్సిన పెట్టుబడినీ అందిస్తోంది. తన టీమ్‌లో 10మంది కీలక సభ్యులు. వీళ్లూ పల్లె నేపథ్యాల వాళ్లే. హర్షిణి వాళ్లకి శిక్షణ ఇచ్చి మరీ తీర్చిదిద్దింది. 'కేవలం తరగతులు పూర్తిచేసుకుంటూ వెళ్తే సరిపోదు. మారు తున్న కాలానికి తగ్గట్టుగా సిద్ధమవ్వాలి. అప్పుడే కొత్త ఆవిష్కరణలు సృష్టించగలరు... ' లోకంతో పోటీపడగలరు అనే 22 ఏళ్ల హర్షిణి అంత ర్జాతీయ సంస్థలతో ఒప్పందాలకు ప్రయత్నిస్తోంది. అప్పుడు సేవలను విస్తృతం చేయొచ్చు. పిల్లలకు బహుమతులు ఇచ్చి ప్రోత్స హించొచ్చు అంటుందీమె. ఇప్పటికీ రాత్రుళ్లు ఉద్యోగం చేస్తూ పగలు సమాజ సేవకు కేటాయిస్తోంది. అలా తన సేవల్ని తమిళనాడు, కర్ణాటకల్లోని 5 వేలకు పైగా పిల్లలకు చేరువ చేసింది. పైగా ఇదంతా కష్టమనుకోను. ఉదయం నలుగురికి సాయపడొచ్చన్న ఆలోచన మరియ ఉత్సాహంగా పనిచేసేలా చేస్తుంది. సభ్యుల సంఖ్యను పెంచుకోవాలి. మా సేవల్ని మరింతమందికి చేరువ చేయాల న్నదే నా లక్ష్యమంటోన్న తన ప్రయత్నాన్ని అభినందించకుండా ఉండగలమా? □



# దేవాలయంలో గొప్ప సేవ చేసిన అన్న !

'ఆషేరు గోత్రికురాలును పనూయేలు కుమార్తె యునైన అన్న అను ఒక ప్రవక్త్రి యుండెను. ఆమె కన్యాత్వము మొదలు ఏడేండ్లు పెనిమిటితో సంసారముచేసి బహుకాలము గడిచినదై, యెనుబది నాలుగు సంవత్సరములు విధవరాలై యుండి, దేవాలయము విడువక ఉపవాస ప్రార్థనతో రేయింబవళ్లు సేవచేయు చుండెను' (లూకా:36,337) ప్రస్తుతం ప్రపంచమంతా క్రిస్మస్ సీజన్‌లో ఉంది. కేరల్స్ పాడుతూ, బహుమానాలు ఇచ్చిపుచ్చుకుంటూ, కొత్త బట్టలుకొంటూ, పిండివంటలు.. ఇలా అన్నింటి కోసం క్రైస్తవులు సిద్ధపడుతున్నారు. ఈ సీజన్‌లో యేసుప్రభువు జననం గురించి, తల్లి అయిన మరియ, యోసేపు, గొర్రెల కాపరులు, దేవుడి దూతలు ఇలా ఈ సీజన్‌లో అందరి గురించి సేవకులు తమ సువార్తల్లో బోధిస్తుంటారు. కానీ అన్న గురించి చాలామంది పట్టించుకోరు. కానీ యేసుక్రీస్తు జననంలో ఈ పాత్ర కూడా చాలా ఉంది. ఎనిమిది రోజుల శిశువు అయిన యేసుక్రీస్తును తల్లిదండ్రులైన మరియ, యోసేపు దేవాలయానికి తీసుకొని వచ్చినప్పుడు అన్న దేవాలయంలోకి వచ్చి దేవుడిని కొనియాడింది. అంతేకాదు ఈమె గొప్ప ప్రార్థన యోధురాలు. ఎలాంటి ప్రార్థన చేసింది అంటే ఉపవాసంతో రేయింబగళ్లు దేవుడి సేవ చేసింది. అన్న ఒక విధవరాలు, పిల్లలు కూడా లేరు. ఈమె తన పుట్టింటికాని, అత్తింటికాని వెళ్లి తన జీవితాన్ని గడపవచ్చు. కానీ ఈ రెండు స్థలాలకంటే దేవాలయానికి వెళ్లాలనే కోరిక ఆమెలో పుట్టింది. వెళ్లి, తన జీవితకాలమంతా అక్కడే ప్రార్థన చేస్తూ, దేవుడి సేవలో గడిపింది. పైగా ఈమె ఒక ప్రవక్త్రిని. దాదాపు నాలుగవందల సంవత్సరాలు ప్రవక్తలు లేని కాలంలో, నిశ్శబ్ద కాలంలో ఈమె ఒక ప్రవక్త్రినిగా ఉంది. రక్షకుడి కోసం ఎదురు చూస్తూ, దేవుడిని ఆరాధిస్తున్నది. ఈమె పరిచర్య ఎవరికి తెలియనిది, కానీ దేవుడి దృష్టిలో ఈమె గొప్ప పరిచారకురాలిగా జీవించింది. దీర్ఘకాలం దేవుడి మందిరంలోనే ఉంటూ సేవచేసింది. మనం కూడా అన్న లాగా దేవుడి సేవలోను, పరిచర్య లోను పట్టుదల, విశ్వాసంతో ముందుకు సాగిపోదాం. అందుకు దేవుడు మనకు సాయం చేయునుగాక..

-పి.వాణిపుష్ప



అంతర్వాణి

## ముగ్గులకు ఆహ్వానం

'ధనుర్మాసం అంటే ముగ్గుల మాసంకదా! ఈ నెలంతా ముగ్గులు వేస్తారు. ఈ సందర్భంగా 'చెలి' పేజీలో ముగ్గుల ప్రచురణ కోసం ఆహ్వానం పలుకుతున్నాం.

**సూచనలు :**

★ గతంలో ప్రచురించిన ముగ్గులను పంపవద్దు. కొత్తముగ్గులు మాత్రమే పంపించగలరు. ★ ఇటీవల తీసుకున్న పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటోను జతచేయ గలరు. పాతఫొటోలను పంప వద్దు. ★ మీ పూర్తి చిరునామా, ముగ్గుల సంఖ్యను రాయాలి.
★ ఏ4 పేజీలో ఒకసైడు మాత్రమే ముగ్గుల్ని వేయాలి. ★ ముగ్గులు క్లీయర్‌గా, రంగులతో కనిపించాలి.
★ మీ ముగ్గు లను మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు.

**మా చిరునామా**

**ఎడిటర్, 'చెలి' వార్త, నం.396, లోయర్‌ట్యాంక్ బండ్, డిబిర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**Gmail:cheli@vaartha.com**

# ఒత్తిడి చిత్తు చేయాలంటే !



కారణంగా సౌందర్యంపై ఇంతలా పడు తుంది కాబట్టి ఇలాంటి మానసిక సమస్యలకు దూరంగా ఉండకూడదని నిపుణులు ఈ చిన్న చిట్కాను పాటించాలి. ✦ ఖాళీగా ఉంటే ఏవేవో ఆలోచనలతో మనసంతా అయోమయంగా ఉంటే ఇలాంట ప్పుడు ఏపనైతే ఇష్టంగా చేయాలంటే ఆ పనిలో మారిపోమంటున్నారు నిపుణులు. ✦ మనం రోజూ తీసుకునే ఆహారం ద్వారా కూడా ఒత్తిడిని అదుపు చేసుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు. ఈ క్రమంలో డార్క్ చాక్లెట్ గుడ్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు ఎక్కువగా ఉండే చేపలు, చామొమైల్ టీ.. వంటివి చక్కగా పనిచేస్తాయట! వీటిలో ఉండే పోషకాలు యాంటీ ఆక్సిడెంట్లే అందుకు ప్రధాన కారణమంటున్నారు నిపుణులు. ఒత్తిడిని కలుగజేసే కార్టిసాల్ హార్మోన్ స్థాయుల్ని అదుపులో ఉంచడంలో వ్యాయా మం, యోగా, ధ్యానం.. వంటివి చక్కగా దోహం చేస్తాయంటున్నారు నిపుణులు. అందుకే రోజూ ఉద యం లేదా సాయంత్రం ఓ అరగంట పాటు మీకు నచ్చిన వ్యాయామాలు చేస్తే ఒత్తిడికి దూరంగా ఉండచ్చంటున్నారు. ✦ ఒత్తిడిగా అనిపించి నప్పుడు కుటుంబ సభ్యులు, ఫ్రెండ్స్ మీ మనసుకు నచ్చిన వారితో కాసేపు సమయం గడిపి చూడండి. మంచి ఉపశమనం లభిస్తుంది. ఈ చిట్కాలన్నీ పాటించినా ఒత్తిడి ఆందోళన చేస్తే మాత్రం వెంటనే మానసిక నిపుణులను సంప్రదించదు ఉత్తమురా మొదట్లోనే సమస్య నుంచి డచ్చు కాబట్టి ఇతర సమస్యలలో కూరుకు పోకుండా జాగ్రత్త పడండి. □

## క్యాబేజీ రోలర్

మిగతా కూరగాయలన్నింటినీ తరగడం ఒకెత్తు. కానీ క్యాబేజీ, క్యాలీఫ్లవర్ లాంటి వాటిని సన్నగా కట్ చేయడం మరొకెత్తు. ఆ శ్రమ లేకుండా మల్టీ ఫంక్షన్ రోలర్‌ను తీసుకురండి. క్యాబేజీని శుభ్రం చేశాకె రెండు చిన్న ముక్కలుగా చేసుకుని పై భాగంలో ఉన్న బాస్కెట్‌లో వేసి,హ్యాండిల్‌ను తిప్పితే సరి. సన్నని ముక్కలుగా బయటకు వచ్చేస్తాయం. అవికూడా మనకు కావాల్సిన ఆకారాల్లో వచ్చే బ్లేడ్‌లను ఏర్పాటుచేసుకునే వీలూ ఉంటుంది. దీంతో బంగాళాదుంపలు, క్యారెట్ సొరకాయ.. లాంటి ఇతర కూరగాయలూ కట్ చేయొచ్చు. □





## యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్

యూరోపియన్ సినిమాను భారత ప్రేక్షకులకు పరిచయం చేస్తూ ఈ ఫెస్టివల్ 50 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకుంది. హైదరాబాద్‌లో ఈ స్థాయి ఫెస్టివల్‌ను నిరంతరం నిర్వహించడంలో సారథి స్టూడియోస్ మద్దతు ఎంతో కీలకం," అని నిర్వాహకులు వెల్లడించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి సారథి స్టూడియోస్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ MSRV ప్రసాద్, నిగీ ప్రతినిధి బృందం, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు రీ.జు. రావు, ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ, Alliance Fran aise డైరెక్టర్ మోద్ మీక్వావు, ఇండియన్ బ్యాంక్ జోనల్ మేనేజర్ కె. శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. సారథి స్టూడియోస్ చైర్మన్ MSRV ప్రసాద్,మాట్లాడుతూ: హైదరాబాద్ అంటే బ్లాక్‌బస్టర్ సినిమాలకు చిరునామా. యూరోపియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను మరోసారి మా నగరానికి తీసుకురావడం ఆనందంగా ఉంది. మా సారథి స్టూడియో భాగస్వామ్యంతో 23 చిత్రాలను ప్రదర్శిస్తున్నాం," అని చెప్పారు.


## 'ఇట్స్ ఓకే గురు' అందరినీ అలరిస్తుంది



సాయి చరణ్, ఉషశ్రీ హీరో హీరోయిన్స్ గా నటిస్తున్న చిత్రం 'ఇట్స్ ఓకే గురు'. మణికంఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని క్రాంతి ప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రీరిలీజ్ ఈవెంట్ లో దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ.. 'ఇట్స్ ఓకే గురు' టైటిల్ చాలా బాగుంది. అందరికీ రీచ్ అయింది. కంటెంట్ చూస్తుంటే లవ్ స్టోరీలా అనిపిస్తుంది. విజువల్స్ మ్యూజిక్ అన్ని బాగున్నాయి. డైరెక్టర్ మెహర్ రమేష్ మాట్లాడుతూ.. ఈ సినిమా చూస్తుంటే నాకు మంచి సబ్జెక్టు ఉన్నట్టు అనిపిస్తుంది. డైరెక్టర్ మణికంఠ, టీం అందరికీ ఆల్ ది వెరీ బెస్ట్. మ్యూజిక్ డైరెక్టర్ మోహిత్ మాట్లాడుతూ.. ఇది నా ఐదో సినిమా ఇందులో అన్ని పాటలు చేశాను. మా మ్యూజిక్ టీమ్ అందరికీ థాంక్యూ ప్రొడ్యూసర్ క్రాంతి ప్రసాద్ మాట్లాడుతూ.. చాలా మంచి టీం తో చేస్తున్న సినిమా ఇది. నేను స్వతహాగా మార్షల్ ఆర్ట్స్ ట్రైనర్ ని. 30 గోల్డ్ మెడల్స్ కూడా వచ్చాయి. మన దైనందిన జీవితంలో చిన్న విషయాలకు కూడా డిప్రెషన్ లోకి వెళ్లిపోతుంటాము. హీరో సాయి చరణ్ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. రమేష్ గారికి థాంక్యూ. ఇట్స్ ఓకే గురు టైటిల్ నా లైఫ్ లో చాలా కనెక్ట్ అయింది, రవి బాబు గారితో నా ఫస్ట్ సినిమా చేసిన తర్వాత ఎమోషనల్ గా మెంటల్ గా చాలా లో అయ్యాను. హీరోయిన్ ఉషశ్రీ మాట్లాడుతూ.. అందరికి నమస్కారం. మెహర్ రమేష్ గారి సినిమాలో ప్రభాస్ గారికి సిస్టర్ గా చేశాను. నాకు చైల్డ్ ఆర్టిస్ట్ గా అవకాశం ఇచ్చిన డైరెక్టర్ ఈరోజు మెయిన్ లీడ్ గా నేను చేస్తున్న సినిమాకి గెస్ట్ గా రావడం చాలా ఆనందంగా ఉంది.

# తెర

## 'సిగ్మా'లో కేథరీన్ థ్రెసా స్పెషల్ సాంగ్



విజనరీ సుబాస్కరన్ నేతృత్వంలోని లైకా ప్రొడక్షన్స్, అద్భుతమైన సాంకేతిక నైపుణ్యం, వరల్డ్ వైడ్ ఎట్రాక్షన్ వుండే బిగ్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించే చిత్రాలని చేస్తోంది. జాసన్ సంజయ్ దర్శకత్వంలో యాక్షన్‌అడ్వెంచర్ కామెడీ సిగ్మాను నిర్మాణ సంస్థ ప్రస్తుతం చిత్రీకరిస్తోంది. ఇందులో సందీప్ కిషన్ హీరో పాత్ర పోషిస్తున్నారు. షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది. ఫరియా అబ్దుల్లా, రాజు సుందరం, అన్బు థాసన్, యోగ్ జాపీ, సంపత్ రాజ్, కిరణ్ కొండా, మగలక్ష్మి సుదర్శనన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో కొన్ని ప్రత్యేక అతిథి పాత్రలు వున్నాయి. బిగ్ స్కేల్, యూత్ వైబ్‌తో, సిగ్మా మోస్ట్ ఇంటెన్స్ యాక్షన్ అడ్వెంచర్ గా మారుతోంది. ఈ చిత్రంలో హీరోయిన్ కేథరీన్ థ్రెసా, సందీప్ కిషన్‌తో కలిసి డ్యాన్స్ చేయనుంది. అద్భుతమైన సౌండ్‌ట్రాక్‌లు, నేపథ్య స్కోర్‌లకు పేరుగాంచిన ఎస్ థమన్ పవర్ ఫుల్ ట్రాక్‌ను కంపోజ్ చేశారు, ఇది సినిమాకి ఒక హైలైట్‌గా ఉంటుందని హామీ ఇస్తుంది. భారీ, కలర్ ఫుల్ సెట్‌లో చిత్రీకరించబడిన ఈ పాటలో సందీప్ కిషన్, కేథరీన్ థ్రెసా హైఎనర్జీ తో స్క్రీన్‌ను ఉర్రూతలూగిస్తుంది. సిగ్మా లో సందీప్ కిషన్‌ను ఇంతకు ముందు ఎప్పుడూ చూడని యాక్షన్ పెర్సోనా లో కనిపించనున్నారు ఇటీవల విడుదలైన ఫస్ట్‌లుక్ పోస్టర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది.

## 'సైక్ సిద్ధార్థ' చాలా బావుంది



పెళ్లి చూపులు, కేరాఫ్ కంచరపాలెం తర్వాత అంత స్పెషల్ గా అనిపించిన సినిమా 'సైక్ సిద్ధార్థ' సినిమా చాలా బావుంది. అందరికీ నచ్చుతుంది: సాంగ్ లాంచ్ ఈవెంట్ లో ప్రొడ్యూసర్ సురేష్ బాబుయంగ్ హీరో శ్రీ నందు తన అప్ కమింగ్ మూవీ ఖిసైక్ సిద్ధార్థఖికు రానా దగ్గుబాటి స్పిరిట్ మీడియా బ్యాకింగ్ తో వస్తున్నారు. ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్ స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థ లో హై ఎనర్జీ ఎంటర్టైన్మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మోనిక కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రైలర్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. డిసెంబర్ 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ సినిమా నుంచి ధుమ్ ఠకుమ్ సాంగ్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్ లో నిర్మాత సురేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.సాంగ్ లాంచ్ ఈవెంట్ లో నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ.. అందరికీ హాయ్. స్పిరిట్ మీడియాలో తేజ అనే ఆయన మాతో కలిసి వర్క్ చేస్తుంటారు. ఒక సినిమా ఉంది... అందరికీ థాంక్యూ.

## 'ఈషా' భయపెడుతుంది: శ్రీనివాస్ మన్నె

ప్రముఖ కథా నాయిక జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన ఖికథఖి చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు శ్రీనివాస్‌మన్నె, కొంత విరామం తరువాత ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. ఇటీవల లిటిల్‌హార్ట్స్, రాజు వెడ్స్ రాంబాయి లాంటి సూపర్‌హిట్ కల్ట్ చిత్రాలను ప్రేక్షకులకు అందించిన బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ హారర్ థ్రిల్లర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకరాబో తున్నారు. వంశీ నందిపాటి ఎంటర్ టైన్ మెంట్స్, బన్నీ వాస్ వర్క్స్ బ్యానర్స్ పై వంశీ నందిపాటి, బన్నీ వాస్ గ్రాండ్‌గా ఈ చిత్రాన్నిడిసెంబరు 12న థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల రాజు వెడ్స్ రాంబాయి చిత్రంతో సూపర్‌హిట్ కొట్టిన అఖిల్‌రాజ్‌తో పాటు త్రిగుణ్ హీరోలుగా నటిస్తున్న ఈ చిత్రంలో హెబ్బాపటేల్ కథానాయిక. సిరి హనుమంతు, బబ్లూ, పృథ్వీరాజ్ ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని హెచ్‌వీఆర్ ప్రొడక్షన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కేఎల్ దామోదర ప్రసాద్ సమర్ప ణలో హేమ వెంకటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబరు 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది ఈసందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మన్నె శుక్రవారం పాత్రికేయులతో ముచ్చటించారు. విశేషాలివి.



**కథ చిత్రం తరువాత ఇంత విరామం తీసుకోవడానికి రీజన్ ఏమిటి?** -నాకు సినిమా అనేది డ్రీమ్.. నేను ఎప్పుడూ అప్‌డేట్‌లోనే ఉంటాను. ఈ గ్యాప్‌లో కథలు సిద్ధం చేసుకున్నాను.నేను కొరియన్, హాలీవుడ్‌సినిమాలు చూస్తుండేవాడ్ని. ఇప్పుడు సినిమా టెక్నికల్ గాకూడా చాలా మార్పులొచ్చాయి.

**ఇప్పటి వరకు వచ్చిన హారర్ థ్రిల్లర్స్‌తో పోలిస్తే ఈ సినిమాలో ఉన్న కొత్తదనం ఏమిటి?**


- హారర్‌తో పాటు మన జీవితాల్లో ఉన్న చావులు పుట్టుకలు, అండర్ కరెంట్‌లో దైవత్వం, సృష్టి చేసే పనులు ఇలా అన్ని అంశాలు ఉంటాయి. సృష్టి అన్నింటిని బ్యాలెన్స్ చేస్తుంది. ఈ చిత్రంలో స్ట్రాంగ్‌గా కంటెంట్‌గా ఉంటుంది. ఈ సినిమాలో అన్ని అంశాలను టచ్‌చేశాం. టెక్నికల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉండే సినిమా ఇది. మేకప్, కాస్ట్యూమ్, లైటింగ్, సౌండ్ డిజైనింగ్ అన్నింట్లో కేర్‌తీసుకున్నాం.

## 'పోలీస్ కంప్లెయింట్' షూటింగ్ పూర్తి



గ్లామర్ పాత్రలతో హీరోయిన్‌గా కెరీర్ స్టార్ట్ చేసిన వరలక్ష్మి శరత్ కుమార్.. లేడీ విలన్ పాత్రలకు కేరాఫ్ అడ్రస్‌గానూ పేరు తెచ్చుకుంది. ఇక ఇప్పుడు ఆడియన్స్‌ను థ్రిల్‌కు గురి చేసే క్యారెక్టర్‌తో రాబో తోంది. వరలక్ష్మి శరత్ కుమార్ నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో దర్శకుడు సంజీవ్ మేగోటి రూపొంది స్తున్న 'పోలీస్ కంప్లెయింట్' మూవీ ఇటీవల షూటింగ్ పూర్తిచేసుకుంది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది.ఈ సినిమాలో వరలక్ష్మి పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనుందని, తొలిసారి పూర్తిగా వినోదాత్మకమైన రోల్‌లో నటించడం ప్రత్యేక ఆకర్షణ అని, సూపర్ స్టార్ కృష్ణ గారిపై చిత్రీకరించిన ప్రత్యేక గీతం సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ సందర్భంగా దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ చైన్ రియాక్షన్ ఆఫ్ కర్మ అనే ఆసక్తికరమైన కాన్సెప్ట్‌పై 'పోలీస్ కంప్లెయింట్' సినిమా నిర్మిస్తున్నాం. మనం చేసే ప్రతి చర్య తిరిగి మనకే ఫలితంగా వస్తుందన్న భావనను హారర్ థ్రిల్లర్‌గా కొత్త కోణంలో చూపించనున్నాం.

ఆట



# బెడిసికొట్టిన ఆసీస్ వ్యూహం

## డబ్ల్యుటిసి పాయింట్స్‌లో కోత

**న్యూఢిల్లీ:** ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా వ్యూహం బెడిసి కొట్టింది. బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ఈ పింక్ బాల్ డే/నైట్ మ్యాచ్‌లో స్పిన్నర్ లేకుండా బరిలోకి దిగిన ఆసీస్ భారీ మూల్యం చెల్లించుకుంది. స్పిన్నర్ నాథన్ లయన్‌పై వేటు వేసిన ఆసీస్ ఐదుగురు పేసర్లతో బరిలోకి దిగింది. స్పిన్నర్ లేకపోవడంతో ఆసీస్ నిర్ణీత సమయంలో బౌలింగ్ పూర్తి చేయలేకపోయింది. స్లో ఓవర్‌రేట్‌కు కారణ మైంది. తొలి ఇన్నింగ్స్‌లో నిర్ణీత సమయం కంటే 8 ఓవర్లు తక్కువగా వేసింది. స్లో ఓవర్ రేట్‌కు కారణమైన ఆసీస్‌పై ఐసీసీ చర్యలు తీసుకోనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్స్‌లో కోత పడనుంది. ఓవర్‌కు ఒక పాయింట్ చొప్పున కోత విధించనున్నారు. ఈ లెక్కన ఆసీస్ డబ్ల్యూటీసీ పాయింట్స్‌లో 8 పాయింట్ల కోతకు గురవ్వనున్నాయి. ఆసీస్ ఆటగాళ్ల మ్యాచ్ ఫీజులో కూడా కోత పడనుంది. రెండో ఇన్నింగ్స్‌లో కూడా స్లో ఓవర్ రేట్ కారణమైతే మరికొన్ని పాయింట్లకు కోతకు గురవుతాయి. ఈ జరిమానా ఆసీస్ ఫైనల్ చేరే అవకాశాలను సంక్లిష్టం చేయనుంది. స్పిన్నర్ లేకపోవడంతోనే ఆసీస్ నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయలేకపోయింది. ఐదుగురు పేసర్లు బౌలింగ్ చేయడంతో ఆలస్యమైంది. అంతేకాకుండా ఇంగ్లండ్ స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయగలిగింది. తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులకు ఆలౌటైంది. జోరూట్(206 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. జాక్ క్రాలీ(76) హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/75) ఆరు వికెట్లు తీయగా, మిచెల్ నెజర్, స్కాట్ బోలాండ్, బ్రెండన్ డగ్గెట్ తలో వికెట్ తీసారు. స్పిన్నర్ లేకుండా బరిలోకి దిగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 2011 తర్వాత నాథన్ లయన్ సొంతగడ్డపై టెస్ట్ మ్యాచ్ ఆడకపోవడం ఇది రెండోసారి మాత్రమే. మ్యాచ్ ప్రారంభానికి గంట ముందే అతనికి ఈ విషయం తెలిసిందని, టీమ్ మేనేజ్‌మెంట్ నిర్ణయంపై చాలా కోపంగా ఉన్నాడని వార్తలు వస్తున్నాయి.

# ఆస్ట్రేలియా భారీ స్కోర్

## ఇంగ్లండ్‌పై 177 పరుగుల ఆధిక్యం

**న్యూఢిల్లీ:** ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో ఆస్ట్రేలియా భారీ స్కోర్ సాధించింది. ఇంగ్లండ్‌ను 334 పరుగులకు పరిమితం చేసిన ఆస్ట్రేలియా ఆ తర్వాత బ్యాటింగ్‌లో సత్తా చాటి 511 పరుగులు సాధించింది. తద్వారా 177 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. బ్రిస్బేన్ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో బంతితో రాణించిన స్టార్క్ (141 బంతుల్లో 77, 13 ఫోర్లు) ఆసిస్‌కు భారీ స్కోర్ అందించాడు. ఆసీస్ ఇన్నింగ్స్‌లో స్టార్క్ స్కోరే అత్యధికం. మరో నలుగురు కూడా అర్ధ సెంచరీలు చేశారు. జేక్ వెదరాల్డ్ 72, లబూషేన్ 65, స్టీవ్ స్మిత్ 61, అలెక్స్ క్యారీ 63 పరుగులు చేశారు. ట్రవిస్ హెడ్ (33), గ్రీన్ (45) కూడా ఫర్వాలేదనిపించారు. మిగిలిన బ్యాటర్లలో ఇంగ్లీస్ 23, నెసర్ 16, బోలాండ్ 21 (నాటౌట్), డాగెట్ 13 పరుగులు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్ 4 వికెట్లతో సత్తా చాటగా, స్టోక్స్ 3, ఆర్చర్, ఆట్కిన్సన్, జాక్స్ తలో వికెట్ తీశారు. అంతకు ముందు ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో జో రూట్ (138) అద్భుతమైన సెంచరీతో చెలరేగగా, జాక్ క్రాలీ (76), ఆర్చర్ (38) రాణించారు. మిచెల్ స్టార్క్ 6 వికెట్లతో సత్తా చాటాడు. కాగా ఐదు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి టెస్టులో ఇంగ్లండ్‌న్ ఆస్ట్రేలియా చిత్తు చేసింది.





## ఇండియన్ స్క్వాష్ టూర్‌లో
# అనాహత్, వెలవన్‌లకు టైటిల్స్

**న్యూఢిల్లీ:** ఇండియన్ స్క్వాష్ టూర్ 4లో అనాహత్ సింగ్, వెలవన్ సెంథిల్ కుమార్ టైటిల్స్ సాధించారు. అనహత్ వరుసగా రెండో టోర్నమెంట్‌లో ఫైనల్‌లో అనుభవజ్ఞురాలు జోష్నా చిన్నప్పను ఓడించింది. మహిళల సింగిల్స్‌లో, అనాహత్ జోష్నతో జరిగిన మరో ఐదు గేమ్‌ల పోటీని ఎదుర్కొంది, అక్కడ ఆమె జోష్నను 11-8, 11-13, 11-13, 11-6, 11-8తో వెనుకబడి ఓడించింది. కెనడియన్ ఓపెన్ సెమీఫైనల్స్, డాలీ కాలేజ్ ఇండియన్ ఓపెన్‌లో టైటిల్ విజయం తర్వాత పిఎస్‌ఎ టూర్‌లో అనాహత్ వరుసగా మూడో టాప్4 ముగింపును సాధించింది. అదే సమయంలో, వేలవన్ ఈజిప్టుకు చెందిన ఆడమ్ హావాల్‌ను ఓడించి 2025లో తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. టాప్ సీడ్ వేలవన్ టోర్నమెంట్ మొత్తంలో కేవలం 2 ఆటలను మాత్రమే కోల్పోయి విజయాన్ని నమోదు చేశాడు, అతని 10వ పిఎస్‌ఎ ఛాలెంజర్ టైటిల్‌ను గెలుచుకున్నాడు. మరోవైపు, రెండో సీడ్ వీర్ చోత్రానీ నిరాశపరిచే క్వార్టర్ ఫైనల్లో నిష్క్రమించాడు. ఫైనలిస్ట్ హవాల్ చేతిలో వరుస గేమ్ మ్యాచ్‌లో ఓడిపోయాడు.

## మహిళల ప్రపంచ కప్:
# భారత్ విజయం

### 4-0తో ఐర్లాండ్ ఓటమి

**న్యూఢిల్లీ:** జూనియర్ మహిళల ప్రపంచ కప్‌లో తమ చివరి పూల్ సి మ్యాచ్‌లో భారత జూనియర్ మహిళల హాకీ జట్టు ఐర్లాండ్‌పై 4-0 తేడాతో ఆధిపత్యం చెలాయించింది. పూర్ణిమ యాదవ్ (42వ నిముషం, 58), కనికా సివాచ్ (12), సాక్షి రాణా (57) భారత్ తరపున గోల్స్ చేశారు. శాంటియాగోలో జరిగిన తొలి క్వార్టర్‌లో భారత్ అద్భుతమైన ఆరంభం చేసింది. మ్యాచ్ మొదటి 12 సెకన్లలోనే పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. పదవ నిమిషంలో వారి రెండవ పెనాల్టీ కార్నర్‌ను గెలుచుకుంది. అయితే సాక్షి రాణా కనికా సివాచ్ (12)కి సరైన పాస్ ఇచ్చింది.

17వ, 23వ నిమిషాల్లో వరుసగా రెండు పెనాల్టీ కార్నర్‌లను గెలుచుకుని భారత్ ఆధిపత్య ఫామ్‌ను పెంచుకుంది. కానీ ఐర్లాండ్ గోల్ కీపర్ లూసీ మెక్‌గోల్డ్రిక్ తన గోల్‌ను కాపాడుకోవడానికి రెండు బలమైన సేవ్‌లు చేసింది. ఐర్లాండ్ గోల్ కోసం మొదటి ప్రయత్నం మ్యాచ్ 24వ నిమిషంలో జరిగింది. దాన్ని భారత గోల్ కీపర్ ఎదుర్కొంది. మొదటి అర్ధభాగాన్ని ఒక గోల్ ఆధిక్యంతో ముగించారు. మూడవ క్వార్టర్‌లో భారత్ ఐరిష్‌ను నియంత్రించడం కొనసాగించింది. 42వ నిమిషంలో, భారత్ మరో పెనాల్టీ కార్నర్ ను గెలుచుకుంది, ఈసారి సాక్షి శుక్లా పూర్ణిమ యాదవ్ (42) కు బలమైన పాస్ ఇచ్చి



బంతిని నెట్ లోకి మళ్లించి భారత్ ఆధిక్యాన్ని పెంచింది. నాల్గవ క్వార్టర్‌లో ఐర్లాండ్ తిరిగి పోరాడింది. ఈభా కుర్రాన్ గోల్ సాధించి షాట్ తీసినా నందిని బ్లాక్ చేయడం ద్వారా నిలువరింప చేసింది. 57వ మరియు 58వ నిమిషాల్లో, భారత్ వరుసగా గోల్స్ చేసి తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుంది. సఖి రాణా (57), పూర్ణిమ యాదవ్ (58) మ్యాచ్‌లో రెండవ గోల్స్ చేశారు.

# టైక్వాండో ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో అంకిత్, నితేష్‌కు కాంస్య, రజతం





**న్యూఢిల్లీ:** భారత్ తొలిసారిగా టైక్వాండోలో రెండు ప్రపంచ ఛాంపియన్‌షిప్ పతకాలను గెలుచుకుంది. అండర్ 21 టైక్వాండో వరల్డ్ ఛాంపియన్‌షిప్‌ల ప్రారంభ ఎడిషన్‌లో నితేష్ సింగ్, అంకిత్ మెర్ వరుసగా కాంస్య, రజత పతకాలను గెలుచుకున్నారు. నితేష్ తన వెయిట్ కేటగిరీలో పోలాండ్‌కు చెందిన అథ్లెట్‌ను ఓడించి సెమీఫైనల్స్‌లోకి ప్రవేశించడం ద్వారా ప్రపంచ పోటీలో పతకం సాధించిన తొలి భారతీయుడిగా ఘనత సాధించాడు. బల్గేరియా చేతిలో సెమీఫైనల్‌లో ఓడిపోయినప్పటికీ, కాంస్య పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. అయితే, 54 కిలోల విభాగంలో రజత పతకం సాధించే క్రమంలో దక్షిణ కొరియాకు చెందిన ప్రస్తుత సీనియర్ ప్రపంచ ఛాంపియన్ సియోయున్ సును ఓడించి అంకిత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించాడు. 16వ రౌండ్‌లో సియోతో జరిగిన మ్యాచ్‌లో, అంకిత్ దక్షిణ కొరియాపై త్వరగా విజయం సాధించి ప్రపంచం తన ప్రతిభను గుర్తించేలా చేశాడు. సెమీఫైనల్లో సీనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్ క్వార్టర్‌ఫైనలిస్ట్ బల్గేరియాకు చెందిన క్రిస్టియన్ జార్జివ్‌ను ఓడించి బంగారు పతక పోరులోకి అడుగుపెట్టాడు. ఫైనల్లో అంకిత్ 02 తేడాతో ఈజిప్టుకు చెందిన మోటాజ్ బెల్లా అసెం చేతిలో ఓడిపోయాడు.

# వాణిజ్యం



# 10 నుంచి ఇండో-యుఎస్ వాణిజ్య చర్చలు!

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం త్వరలో కార్యరూపం దాల్చే అవకాశం ఉందని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సైతం శనివారం వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు ఈనెల 10న ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు సాగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ చర్చలకు అమెరికా తరఫున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విజ్జర్ పాల్గొంటున్నారు. భారత్ ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అమెరికా ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. ఆ తర్వాత సెప్టెంబర్ 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ బృందం చర్చల కోసం అమెరికాకు వెళ్లింది. అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ ఇటీవల తెలిపారు. భారత ఎగుమతిదారులకు లబ్ధి చేకూరేలా సుంకాలను ప్రస్తావిస్తామని ఆయన వెల్లడించారు. టారిఫ్‌ల సమస్యను పరిష్కరించేందుకు ఒకసారి, పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు ఉంటాయని తెలిపారు. 2025 డిసెంబర్ నాటికి వాణిజ్య చర్చలు పూర్తి చేయాలని ఇరు దేశాలు లక్ష్యంగా పెట్టుకున్నాయి.



## రూపాయి పతనం ఆర్థికవ్యవస్థకు
# ప్రతికూలం కానేకాదు..

### -కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** అమెరికా డాలర్ తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు స్థాయి కనిష్ఠానికి పడిపోయిన విషయం తెలిసిందే. డాలర్ తో రూపాయి మారకం విలువ ప్రస్తుతం 89.95 గా ఉంది. రెండు రోజుల క్రితం ఈ విలువ 90 కి చేరింది. సమీప భవిష్యత్తులో ఈ మారకం విలువ రూ.91కి చేరుతుందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈక్రమంలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా స్పందించారు. రూపాయి పతనం పూర్తిగా ప్రతికూలం కాదని చెప్పారు. ఆంగ్లపత్రిక లీడర్ షిప్ సదస్సులో మాట్లాడుతూ రూపాయి పతనం వల్ల భారత దేశంలోని ఎగుమతిదారులకు ప్రయోజనకరమేనని మంత్రి అభిప్రాయపడ్డారు. భారత రూపాయి మారకం విలువ ఇటీవల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే చారిత్రాత్మక కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ డిసెంబర్ 3న రూపాయి రూ. 90.43 వద్ద కనిష్ట స్థాయిని తాకింది. రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతులు ఖరీదైనవిగా మారతాయి, ఇది ద్రవ్యోల్బణాన్ని పెంచుతుంది మరియు విదేశాలలో చదువుతున్న విద్యార్థులు, అంతర్జాతీయ ప్రయాణికుల బడ్జెట్‌లపై ప్రభావం చూపుతుంది. అయితే, బలహీనమైన రూపాయి భారతీయ ఎగుమతిదారులకు ప్రయోజనం చేకూర్చే అవకాశం ఉంది. ఎందుకంటే వారి ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్లలో చౌకగా మారతాయి.

# సోషల్‌మీడియా 'ఎక్స్'కు ఇయు భారీ జరిమానా!

**బ్రస్సెల్స్, డిసెంబరు 6:** టెస్లా అధినేత ఎలాన్ మస్క్ అధీనంలోని సోషల్‌మీడియా సంస్థ 'ఎక్స్'కు యూరోపియన్ యూనియన్ షాక్ ఇచ్చింది. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌పై 120 మిలియన్ యూరోల జరిమానా విధించింది. డిజిటల్ సర్వీసెస్ చట్టం నియమాలను ఉల్లంఘించిందని విచారణలో తేలడంతో జరిమానా విధిస్తూ నిర్ణయం తీసుకుంది. 27 దేశాల యూరోపియన్ యూనియన్‌లో డిజిటల్ సర్వీసెస్ చట్టం కింద ఒక ప్లాట్‌ఫామ్‌పై నిబంధనలు పాటించడం లేదంటూ చర్యలు తీసుకోవడం ఇదే మొదటిసారి. డీఎస్‌ఏ సోషల్ మీడియా కంపెనీలను యూజర్ల సెక్యూరిటీని నిర్ధారించాలని.. తప్పుడు సమాచారం, చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను ప్లాట్‌ఫామ్ నుంచి తొలగించాలని నిబంధనలు చెబుతున్నాయి. నిబంధనలు ఉల్లంఘిస్తే గణనీయమైన జరిమానాలు విధిస్తారు. గతంలో ఎక్స్ బ్లూ టిక్‌ను రాజకీయ నాయకులు, సెలబ్రిటీలు, వెరిఫైడ్ అకౌంట్స్‌కు మాత్రమే ఇచ్చింది. కానీ, ప్రస్తుతం ఎనిమిది డాలర్లు చెల్లించి ఎవరైనా ఈ బ్యాడ్జ్‌ను ఇస్తుందని ఆరోపిస్తున్నది. ఈ వ్యవస్థ ఫేక్ అకౌంట్స్‌ను గుర్తించడం కష్టతరం చేస్తుందని కమిషన్ తెలిపింది. డేటాబేస్ తగినంత సమాచారాన్ని అందించడం లేదని ఈయూ వాదిస్తోంది. సాంకేతిక అడ్డంకులు పరిశోధకులు డేటాను యాక్సెస్ చేయకుండా చేస్తున్నాయని.. నకిలీ ప్రకటనలు, తప్పుడు సమాచార ప్రచారాలను గుర్తించడం కష్టతరం చేస్తుందని ఈయూ చెబుతున్నది. దాంతో డేటాను యాక్సెస్ చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని కమిషన్ పేర్కొంది. ఈయూ వైస్ ప్రెసిడెంట్ హెన్నా విర్కునెన్ మాట్లాడుతూ బ్లూ టిక్‌లతో వినియోగదారులను తప్పుదారి పట్టించడం, ప్రకటన సమాచారాన్ని దాచడం, రీసెర్చర్స్‌ను అడ్డుకోవడం యూనియన్‌లో ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది.






# కస్టమ్స్ సుంకాల హేతుబద్ధీకరణ ఎన్డీయే కొత్త అజెండా

**న్యూఢిల్లీ, డిసెంబరు 6:** జీఎస్టీతో పరోక్షపన్నుల వ్యవస్థనుప్రక్షాళన చేసి హేతుబద్ధీకరించిన ఎన్డీయే సర్కారు ఇపుడు మరో అతిపెద్ద సరళీకరణను చేపడుతోంది. కస్టమ్స్‌ను మరింతగా సరళీకరించడమే ప్రధాన అజెండాగా ముందుకు వస్తోంది. ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో ఆదాయపు పన్నురేట్ల రూపంలోఒ ఐరట, జిఎస్టీ రేట్ల హేతుబద్ధీకరణ నిర్ణయాలతో కొంత ఊరటనిచ్చింది. ఈసారి కస్టమ్స్ రూపంలో కీలక మార్పులు చేపట్టనున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. కస్టమ్స్ నిబంధనలు పాటించడం కష్టంకాదని ప్రజలు భావించేలా సరళీకరణచేయాల్సి ఉందన్నారు. మరింత పారదర్శకంగా వీటిని చేస్తామని ఆమె వివరించారు. కస్టమ్స్‌లో ప్రతిపాదిత సంస్కరణలు సమగ్రంగా ఉంటాయని, కస్టమ్స్ సుంకాల రేట్ల హేతుబద్ధీకరణ కూడా ఉంటుందన్నారు. వచ్చే ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఈ అంశం ప్రతిపాదించవచ్చన్నారు. కస్టమ్స్ సుంకాలను రెండేళ్లుగా తగ్గిస్తూ వచ్చామని ఇంకా కొన్నిరేట్లు పైపైకి ఉన్నాయన్నారు. వాటిని తగ్గించాలని అదే తమ కొత్త లక్ష్యమన్నారు. బడ్జెట్‌లో ఏడు కస్టమ్స్ సుంకం రేట్లను ప్రభుత్వం హేతుబద్ధీకరించింది. సుంకాల సంఖ్యను 15నుంచి 8కి తగ్గించింది. ప్రస్తుత ఏడాదిలో ఏడుశాతానికిపైగానే జిడిపి వృద్ధిరేటు ఉందన్న అంచనాలను వ్యక్తంచేసిన ఆర్థికమంత్రి కస్టమ్స్ హేతుబద్ధీకరణ, సరళీకరణ చేపడతామని వెల్లడించారు.

# బ్యాంకుల్లో కస్టమర్లందరికీ సమానసేవలు

## ఏప్రిల్ 1నుంచి ఆర్బీఐ కొత్త మార్గదర్శకాలు

**ముంబయి, డిసెంబరు 6:** బ్యాంకుల్లో ఖాతాలున్న కస్టమర్లు అందరికీ సమాన తరహా సేవలందించే విధంగా ఆర్బీఐ మార్గదర్శకాలు సిద్ధంచేసింది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్ (బిఎస్‌బిడి)కి సంబంధించి కొత్త రూల్స్ తీసుకొచ్చింది. ఈ రూల్స్ ప్రకారం బేసిక్ సేవింగ్స్ అకౌంట్ కలిగి ఉన్న ఖాతాదారులకు నెలలో అన్‌లిమిడెట్ డిపాజిట్స్, ఉచిత ఏటీఎం లేదా డెబిట్ కార్డ్ వినియోగానికి అవకాశం కల్పించాలి. ఫ్రీ ఏటీఎం కార్డు జారీ, చెక్ బుక్ (ఏడాదికి 25 లీఫ్స్) ఉండేలా చూసుకోవాలి. అలాగే ఈ ఖాతాలకు సైతం ఎలాంటి అంతరాయం లేకుండా ఇంటర్నెట్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవలు అందించాల్సి ఉంటుంది. బేసిక్ సేవింగ్స్ బ్యాంక్ డిపాజిట్ అకౌంట్లకు



సంబంధించిన కొత్త రూల్స్ వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి తీసుకొస్తున్నట్లు ఆర్బీఐ వెల్లడించింది. బీఎస్‌బీడీ ఖాతాల్లో క్యాష్ డిపాజిట్ ఛార్జీలు విధించకూడదు. యూపీఐ, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి డిజిటల్ ట్రాన్సాక్షన్లపై ఛార్జీలు ఉండవు. ఇకపై ఆదాయం ఆధారంగా ఎంపిక ఉండదు. బ్యాంకులు ఆదాయం, ప్రొఫైల్ ఆధారంగా సేవింగ్స్ ఖాతా ఇచ్చేందుకు నిరాకరించకూడదు. సాధారణ సేవింగ్స్ అకౌంట్ల మాదిరిగానే పూర్తి బ్యాంకింగ్ సర్వీసులు అందించాల్సిందే. కేవైసీ, ఏఎంఎల్, రిస్క్ నిబంధనలు అందరికీ సమానంగా ఉండాలి. అన్ని బ్యాంకుల్లో ఒక వ్యక్తికి ఒకే బీఎస్‌బీడీ అకౌంట్ ఉండాలి. ఒక వ్యక్తి రెగ్యులర్ సేవింగ్స్ అకౌంట్, బీఎస్‌బీడీ అకౌంట్ తీసుకోవడానికి లేదు. నిబంధనలు అమలు చేసేందుకు బ్యాంకులు కస్టమర్ల అనుమతి తీసుకోవాలి. ప్రతి నెలా 7, 14, 21 సహా నెలాఖరున అంటే వారానికోసారి కచ్చితంగా ఖాతాదారుల లావాదేవీల వివరాలను క్రెడిట్ బ్యూరోలకు అందించాలి.

## ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ ఎఎంసి ఐపిఒ
# రూ.10 వేల కోట్ల సమీకరణ లక్ష్యం

**ముంబయి, డిసెంబరు 6:** ఐసిఐసిఐబ్యాంకు అనుబంధ సంస్థ ప్రుడెన్షియల్ అసెట్ బేనేజ్‌మెంట్ కంపెనీ ఎఎంసి తొలి ఐపిఒకు వస్తోంది. ఈనెల 12న ప్రారంభించి 16న ముగిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 11న కొనుగోలు గవాక్షం తెరుస్తుంది. ఐపిఒలో భాగంగా ధరలు రూ.2061నుంచి రూ.2165గా నిర్ణయించారు. మార్కెట్ అంచనాలప్రకారం సుమారు రూ.10వేల కోట్లను కంపెనీ ఈ ఇష్యూద్వారా సమీకరిస్తోంది. రూ.1 లక్షకోట్ల మార్కెట్ విలువలతో ఐపిఒకు వస్తోంది. ఈనెల 19న కంపెనీ షేర్లు స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్ట్ కానున్నాయి. పబ్లిక్ ఇష్యూ పూర్తిగా ఆఫర్‌ఫర్‌సేల్ ద్వారా జరుగుతుంది. ప్రమోటర్ అయినయుకెకు చెందిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్ 4.89 కోట్ల ఈక్విటీ షేర్లను ఐపిఒలోభాగంగా విక్రయిస్తుంది. తాజా షేర్లు జారీచేయక పోవడంవల్ల కంపెనీకి ఎలాంటి రాబడి ఉండదు. అసెట్‌మేనేజ్‌మెంట్ కంపెనీలో




ఐసిఐసిఐబ్యాంక్‌కు 51శాతం వాటా ఉంది. మిగిలిన 49 శాతం తన జాయింట్ వెంచర్ భాగస్వామి అయిన ప్రుడెన్షియల్ కార్పొరేషన్ హోల్డింగ్స్‌వద్ద ఉంది. ఎఎంసిలో ప్రుడెన్షియల్‌కార్పొరేషన్ తన వాటాలను తగ్గించుకోబోతోందని మెజార్టీ వాటాను దక్కించుకోనున్నట్లు ఐసిఐసిఐ ఈ ఏడాది ప్రకటించిందికూడా. హెచ్‌డిఎఫ్‌సిఎఎంసి, యుటిఐ ఎఎంసి, ఆదిత్యబిర్లాసన్‌లైఫ్ ఎఎంసి, శ్రీరామ్ ఎఎంసి, నిప్పన్‌లైఫ్ ఇండియా ఏఎంసిలు ఇప్పటికే ఎక్స్ఛేంజిల్లో లిస్టయ్యాయి. ఇపుడు ఐసిఐసిఐ ఎఎంసి రూపంలో అతిపెదనద సంస్థ లిస్టింగ్‌కు వస్తోంది. ఇప్పటికే గ్రూపుసంస్థలన్నీ స్టాక్ ఎక్స్ఛేంజిల్లో లిస్ట్ అయ్యాయి. ఇపుడు ఎఎంసి కంపెనీ గ్రూప్‌లోని ఐదో సంస్థగా నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.